ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



# విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY




శనివారం 12 సెప్టెంబర్ 2026 | సంపుటి: 28 సంచిక: 151
Saturday 12 Septembar 2026 | Vol.No 28 Issue No .151
హైదరాబాద్ | Hyderabad
పేజీలు: 12+12
వెల: రూ.1.00
PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
www.visionandhra.in

## ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలు

### హైదరాబాద్‌లో 13 రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు

- సెప్టెంబర్ 12 నుంచి 24వ తేదీ వరకు ఆంక్షలు అమలు
- ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి రాత్రి వరకు మళ్లింపులు
- భక్తుల వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాల ఏర్పాటు
- ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని నగర పోలీసుల సూచన



హైదరాబాద్‌లో వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో నగర ట్రాఫిక్ పోలీసులు కీలక ప్రకటన విడుదల చేశారు. ప్రసిద్ధ ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, ఈ నెల 12 నుంచి 24వ తేదీ వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు వెల్లడించారు. ఈ 13 రోజుల పాటు రోజూ ఉదయం 11 గంటల నుంచి భక్తుల రద్దీని బట్టి రాత్రి వరకు ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని స్పష్టం చేశారు. మిగతా2లో..

## పురపాలక పాలనలో ట్రాన్స్‌జెండర్లు..

- కో-ఆప్షన్ సభ్యులుగా వారికి అవకాశం
- అసెంబ్లీలో కీలక బిల్లుకు ఆమోదం



హైదారాబాద్, సెప్టెంబర్ 11 : తెలంగాణ ప్రభుత్వం మరో చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్లకు కో-ఆప్షన్ సభ్యులుగా ప్రాతినిధ్యం కల్పించే బిల్లుకు శాసనసభ శుక్రవారం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో పురపాలక పరిపాలనలో, విధాన నిర్ణయాల్లో ట్రాన్స్‌జెండర్ల భాగస్వామ్యానికి మార్గం సుగమమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరపున రాష్ట్ర శాసనసభా మిగతా2లో..

## విద్యే తలరాతలు మార్చే ఆయుధం

### విద్యా విధానంపై శాసనసభలో సమగ్ర చర్చ శుభ పరిణామం
### విద్యాశాఖ బడ్జెట్‌ను రూ.26,647 కోట్లకు పెంచాం
### మూడేళ్లలో 10,006 మంది ఉపాధ్యాయుల నియామకం



హైదరాబాద్: తెలంగాణ విద్యా విధానంపై శాసనసభలో చర్చ జరగడం శుభ పరిణామమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సభ్యులు చేసిన సూచనలు, సలహాలను సమీక్షించి తగిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రపంచంతో పోటీ పడేలా రాష్ట్రంలో నూతన విద్యా విధానాన్ని రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ విద్య, సాగునీటి రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని సీఎం గుర్తుచేశారు. దేశంలోని అనేక విద్యా సంస్థలు నెహ్రూ వేసిన పునాదులపైనే నిర్మితమయ్యాయని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే ప్రస్తుతమున్న అనేక విశ్వవిద్యాలయాలు ఏర్పాటయ్యాయని చెప్పారు. ప్రైవేటు పాఠశాలల్లో రెండున్నరేళ్లకే పిల్లలను చేర్పిస్తుండగా, ప్రభుత్వ పాఠశాలల్లో ఐదేళ్ల వయస్సులో చేర్పించే పరిస్థితి ఉందన్నారు. నర్సరీ, ఎల్‌కేజీతో పాటు ఇంగ్లిష్ భాషపై తల్లిదండ్రుల ఆసక్తి కారణంగా ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో తొలిసారిగా ప్రీ-ప్రైమరీ విధానాన్ని ప్రారంభించామని, ఈ ఏడాది 64 వేల మంది విద్యార్థులకు ప్రీ-ప్రైమరీ విద్య అందిస్తున్నామని వెల్లడించారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు కూడా మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తున్నామని చెప్పారు. సెంట్రలైజ్డ్ కిచెన్లను ఏర్పాటు చేసి నాణ్యమైన, పరిశుభ్రమైన అల్పాహారం, భోజనం అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు పోషకాహారం అందించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో విద్యారంగాన్ని పట్టించుకోలేదని విమర్శించిన సీఎం.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డైట్ ఛార్జీలు, కాస్మోటిక్ ఛార్జీలను పెంచిందన్నారు. విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నప్పటికీ తాము చేసిన పనులను ప్రచారం చేసుకోవడం లేదని పేర్కొన్నారు. సామాజిక వెనుకబాటుతనానికి ఆస్తులు, అంతస్తులు కాకుండా విద్య లేకపోవడమే ప్రధాన కారణమని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సీపెక్ సర్వేలో తేలిందని రేవంత్‌రెడ్డి తెలిపారు. మిగతా2లో..

## కులగణన ఒక 'ఎక్స్‌రే'

- తెలంగాణ కులగణన సర్వే దేశానికే ఆదర్శం
- జనగణనలో కులగణనను తప్పనిసరిగా చేర్చాలి
- కులగణన చేద్దామా? వద్దా? బీజేపీ సూటిగా చెప్పాలి
- కులగణనతోనే బలహీన వర్గాలకు న్యాయం..
- దేశ సంపద సమాన పంపిణీకి మార్గం
- తెలంగాణ తరహాలో దేశవ్యాప్తంగా సర్వే చేయాలి
- వచ్చే ఎన్నికల్లో రాహుల్ గాంధీ ప్రధాని అవుతారు
- అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదారాబాద్, సెప్టెంబర్ 11 : దేశంలో సామాజిక అసమానతలను తొలగించి బలహీన వర్గాలకు న్యాయం చేయాలంటే జనగణనలో కులగణనను తప్పనిసరిగా చేర్చాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. కులగణన చేద్దామా? వద్దా? అనే విషయాన్ని బీజేపీ సభ్యులు సూటిగా చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

## మంత్రి పదవి నుంచి కొండా సురేఖ తొలగింపుపై కేటీఆర్ సంచలన ఆరోపణలు

- సీఎం సోదరుల భూ కుంభకోణాన్ని బయటపెట్టినందుకే సురేఖపై వేటు వేశారని ఆరోపణ
- కాంగ్రెస్ హయాంలో దేశంలోనే అతిపెద్ద భూ కబ్జా జరుగుతోందని విమర్శ
- నిషేధిత భూముల జాబితా 16 లక్షల నుంచి కోటి 16 లక్షల ఎకరాలకు పెరిగిందని వెల్లడి



రాష్ట్ర మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించడం వెనుక భారీ భూ కుంభకోణం దాగి ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులకు సంబంధించిన భూ అక్రమాలను కొండా సురేఖ కుమార్తె వెలుగులోకి తీసుకువచ్చినందుకే ఆమెపై వేటు పడిందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో దేశంలోనే అతిపెద్ద భూ కబ్జా పర్వం కొనసాగుతోందని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో '22ఏ' నిషేధిత భూముల బాధితులతో జరిగిన సమావేశంలో కేటీఆర్ మిగతా2లో..

## 25 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న మోదీ

- సెప్టెంబర్ 17న ప్రతి ఇంటా దీపాలు వెలిగించాలి
- అక్టోబర్ 17 వరకు సేవా సంకల్ప్ అభియాన్
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వెల్లడి



హైదారాబాద్, సెప్టెంబర్ 11 : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల సుదీర్ఘ ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని తెలంగాణ వ్యాప్తంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వెల్లడించారు. ప్రజలకు సేవ చేయడం ద్వారా మరింత చేరువ కావడం, అలాగే పార్టీ కార్యకర్తల్లో సేవా భావాన్ని పెంపొందించడమే ఈ అభియాన్ ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. అభియాన్ ఆరంభ రోజైన సెప్టెంబర్ 17న 'ఆశీర్వాద్ కా దియా' పేరిట రాష్ట్రంలోని ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించి ప్రధానమంత్రికి శుభాకాంక్షలు తెలియజేయాలని రాంచందర్‌రావు పార్టీ శ్రేణులకు, ప్రజలకు మిగతా2లో..

## చెరువుల హద్దులకు రక్షణ కవచం...

- మత్స్యకారుల బతుకులకు భరోసా
- ఎఫ్‌టీఎల్ హద్దుల పరిరక్షణపై రాజీ పడబోం
- అన్ని చెరువులకు పరిరక్షణ కమిటీల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం
- ఇప్పటికే 44 వేల చెరువులకు జియో ట్యాగింగ్
- నెల్లికల్ ఎత్తిపోతల పథకంపై సభాముఖంగా విస్పష్టమైన హామీ
- జూన్ 2027 నాటికి 7,800 ఎకరాలకు సాగునీరు
- డిసెంబర్ 2027 నాటికి మొత్తం 24 వేల ఎకరాల ఆయకట్టుకు జలసిరులు
- పీడీఎస్‌లో అదనపు నిత్యావసర సరుకుల పంపిణీపై సానుకూల పరిశీలన
- శాసనమండలిలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదారాబాద్, సెప్టెంబర్ 11 : చెరువు నిండితే పల్లె పచ్చబడుతుందని, మత్స్యకారుడి వల నిండితే అతని కుటుంబంలో వెలుగులు విరుస్తాయని, అందుకే చెరువులు, కుంటలు, ఇతర జలవనరుల పరిరక్షణతోపాటు వాటిపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారుల జీవనోపాధిని కాపాడటాన్ని మిగతా2లో..

## బొల్లారం ఆయుధాల చోరీ కేసు..

- ఛేదించిన పోలీసులు, మిలిటరీ అధికారులు, • కేసులో నలుగురు నిందితులను అరెస్ట్



హైదారాబాద్, సెప్టెంబర్ 11 : హైదరాబాద్‌లోని బొల్లారంలో ఉన్న మద్రాస్ రెజిమెంట్ బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లో జరిగిన భారీ ఆయుధాల చోరీ కేసును పోలీసులు, మిలిటరీ అధికారులు అత్యంత సమర్థవంతంగా ఛేదించారు. ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలను తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి మొత్తం నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. చోరీకి గురైన అత్యంత ప్రమాదకరమైన ఆయుధాలు, మ్యాగజైన్లు, బుల్లెట్లు, బైనాక్యులర్‌ను మిగతా2లో..

## 22ఏ అనేది పొరపాటు కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన దుర్మార్గం

- రేవంత్ రెడ్డి భూములను కాజేయడమే పనిగా పెట్టుకున్నారన్న హరీశ్
- మంత్రి పొంగులేటి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్
- సామాన్యుల ఆస్తులను 22ఏ నుంచి తొలగించాలన్న హరీశ్



## రైతులకు యాంత్రీకరణ పథకం

- రైతు కోరుకున్న పనిముట్టు.. నచ్చిన కంపెనీ నుంచే కొనుగోలు
- సబ్సిడీ సొమ్ము నేరుగా రైతుఖాతాకే బదిలీ
- రైతుల డిమాండ్‌కు అనుగుణంగా వ్యవసాయ యాంత్రీకరణ
- మండలిలో మంత్రి తుమ్మల సమాధానం



హైదారాబాద్, సెప్టెంబర్ 11 : రైతులు తమకు అవసరమైన వ్యవసాయ పనిముట్లను, తమకు నచ్చిన కంపెనీ నుంచి కొనుగోలు చేసుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం యాంత్రీకరణ పథకాన్ని అమలు చేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. రైతులకు నాణ్యమైన వ్యవసాయ యంత్ర పరికరాలు అందించడంతో పాటు, వారి అవసరాలు, డిమాండ్‌కు అనుగుణంగా యంత్రాలను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. శాసనమండలిలో శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. యాంత్రీకరణ పథకం కింద రైతులకు నాణ్యమైన, ప్రమాణాలు కలిగిన వ్యవసాయ యంత్ర పరికరాలను మాత్రమే మిగతా2లో..

## పూర్తి పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించాం..

- 16 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలిచ్చాం
- వైసీపీ పార్టీ నేతలు అబద్ధాలు ప్రచారం
- దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించు జగన్
- విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని విమర్శలు



అమరావతి, సెప్టెంబర్ 11 : ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం డీఎస్సీ పరీక్షలను అత్యంత పారదర్శకంగా నిర్వహించి 16 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించిందని విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని స్పష్టం చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నిర్వహించిన ఈ మెగా డీఎస్సీపై వైసీపీ అధినేత జగన్, ఆ పార్టీ నేతలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. డీఎస్సీపై మిగతా2లో..

## పాలనలో స్పీడ్ పెరగాల్సిందే..

- నెలరోజుల్లో ఫైళ్లన్నీ ఆన్‌లైన్‌లో ఉండాలి
- జాప్యాన్ని ఏమాత్రం సహించేది లేదు
- ఫైళ్ల జాప్యంపై సీఎం చంద్రబాబు సీరియస్



అమరావతి, సెప్టెంబర్ 11 : ప్రభుత్వ దస్త్రాల పరిష్కారంలో జాప్యాన్ని ఏమాత్రం సహించేది లేదని, పాలనలో వేగం పెంచాలని సీఎం చంద్రబాబు అధికారులను గట్టిగా హెచ్చరించారు. మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్లు ఫైళ్లను వీలైనంత వేగంగా క్లియర్ చేయాలని స్పష్టం చేశారు. అమరావతిలో జరిగిన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయన పరిపాలనపై పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. సకాలంలో దస్త్రాలను పరిష్కరించకుండా జాప్యం చేస్తున్న కొందరు అధికారుల తీరుపై సీఎం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లోపు ఫైళ్లు క్లియర్ చేసిన వారిని అభినందిస్తూనే, గంటల వ్యవధిలోనే పూర్తి చేసిన వారిని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ సమావేశానికి కొందరు ఉన్నతాధికారులు గైర్హాజరు కావడంపై ముఖ్యమంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వారి నుంచి వివరణ తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌ను ఆదేశించారు. పరిపాలనలో జవాబుదారీతనం ముఖ్యమని, ఐఏఎస్ అధికారుల పనితీరుపై 360 డిగ్రీల నివేదికను అందరి అభిప్రాయాలతో రూపొందిస్తామని తెలిపారు. కార్యదర్శులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలు సేకరించాలని, అప్పుడే పనితీరును మిగతా2లో..

## పాలనలో స్పీడ్ పెరగాల్సిందే..

మెరుగుపరుచుకోగలమని సూచించారు. ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత, వేగం కోసం కీలక నిర్ణయం తీసుకున్నారు. నెల రోజుల్లో అన్ని శాఖల దస్త్రాలను పూర్తిగా ఆన్‌లైన్‌లోకి మార్చాలని స్పష్టం చేశారు. ఈ గడువు తర్వాత భౌతిక (మాన్యువల్) ఫైళ్ల నిర్వహణను తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. ఈ అంశంపై నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశిస్తూ, మంత్రులు కూడా దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చంద్రబాబు సూచించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా వచ్చే దరఖాస్తులను ప్రజలు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని కలెక్టర్లకు సూచించారు. "జిల్లా స్థాయిలో కలెక్టర్లు, నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేలు, మండల స్థాయిలో అధికారులు తరచుగా గ్రామాలకు వెళ్తే చాలా సమస్యలు అక్కడికక్కడే పరిష్కారమవుతాయి. ఇకపై ఈ పర్యటనల వివరాలను కూడా సమర్పించాలి" అని అన్నారు. సమస్యలు లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలపై ప్రజల్లో సానుకూల దృక్పథం ఏర్పడాలని ఆకాంక్షించారు. పనితీరు సరిగా లేని వారిని పక్కనపెట్టి, సమర్థంగా పనిచేసే వారిని గుర్తించి ప్రోత్సహించాలని స్పష్టం చేశారు. స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల్లో సిబ్బందిపై పనిభారాన్ని హేతుబద్ధీకరించాలని (రేషనలైజ్ చేయాలని) అధికారులను ఆదేశించారు. ఒకే ఉద్యోగిపై ఎక్కువ భారం మోపకుండా, అందరికీ సమంగా బాధ్యతలు అప్పగించేలా చూడాలన్నారు. ప్రతి పంచాయతీ పరిధిలోని స్వర్ణ గ్రామ సిబ్బందికి విధులను స్పష్టం చేస్తూ ఒక జాబ్ ఛార్ట్ సిద్ధం చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి స్వర్ణవార్డు, గ్రామ కార్యాలయానికి ఒక ఎలక్ట్రిక్ సైకిల్ అందించాలని కూడా సూచించారు.

## 22ఏ అనేది పొరపాటు కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన దుర్మార్గం

తెలంగాణలో నిషేధిత భూముల జాబితా 22ఏ వివాదంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 22ఏ జాబితాలో భూములను చేర్చడం కేవలం సాంకేతిక పొరపాటు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం దురుద్దేశంతో చేసిన పెద్ద దుర్మార్గమని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో 22ఏ బాధితులతో బీఆర్ఎస్ నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 'భూ భారతి' పేరుతో ప్రజల భూములకు 'భూ హారతి' పడుతోందని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనను పక్కనపెట్టి భూములను కాజేయడమే పనిగా పెట్టుకున్నారని, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 30 వేల ఎకరాల పాలిటెక్నిక్ కళాశాలల భూములపై కన్నేశారని హరీశ్ రావు ఆరోపించారు. భూ సమస్యల పరిష్కారానికి ఫోన్ చేస్తే చాలని ప్రచారం చేసుకున్నారని, కానీ నేరుగా వెళ్లి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసినా బాధితులకు ఎలాంటి పరిష్కారం దొరకడం లేదని ఎద్దేవా చేశారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తున్న ప్రభుత్వం... బడా బాబులు నిర్మించిన అక్రమ నివాసాల జోలికి మాత్రం వెళ్లడం లేదని విమర్శించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఏమాత్రం నైతిక బాధ్యత ఉన్నా వెంటనే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. 2ఏ నిషేధిత జాబితా నుంచి ముఖ్యమంత్రి నివాసాన్ని తొలగించినప్పుడు, అదే జాబితాలో ఉన్న సామాన్య ప్రజల నివాసాలను, భూములను ఎందుకు తొలగించడం లేదని నిలదీశారు. తక్షణమే పేదల, సామాన్యుల ఆస్తులను 22ఏ జాబితా నుంచి తొలగించాలని, బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ ముందుండి పోరాటం చేస్తుందని హరీశ్ రావు స్పష్టం చేశారు.

## బొల్లారం ఆయుధాల చోరీ కేసు..

స్వాధీనం చేసుకున్నట్లు స్పష్టం చేశారు. ఆగస్టు 31న జరిగిన ఈ ఆయుధాల దొంగతనంలో బెల్ ఆఫ్ ఆర్మ్స్ ఇన్ ఛార్జ్, అమ్యునేషన్ సెక్షన్ ఇన్ ఛార్జ్ సహకారం ఉన్నట్లు విచారణలో తేలింది. మొదట బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లోకి ప్రత్యక్షంగా ప్రవేశ అర్హత ఉన్న 16 మందిపై దృష్టి సారించిన అధికారులు, సుదీర్ఘ సాంకేతిక విచారణ చేపట్టారు. ఈ క్రమంలో హవాల్దార్లు టి.పి.ఎస్. రావు, మల్లేశ్ అలియాస్ రాజుల ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించడంతో వారిపై నిఘా పెట్టారు. విచారణ సమయంలో మల్లేశ్ అధికారులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసినప్పటికీ, సాంకేతిక ఆధారాలతో నిలదీయడం, అధికారులు అతడి భార్యకు పరిస్థితి వివరించడంతో అసలు నిజం బయటపడింది. భార్య గట్టిగా ప్రశ్నించడంతో మల్లేశ్ ఆయుధాల దొంగతనం ఒప్పుకున్నాడు. దర్యాప్తు వివరాల ప్రకారం.. నిందితుడు మల్లేశ్ ఆగస్టు 28, 29 తేదీల్లో ఆయుధాగారం వద్ద రెక్కీ నిర్వహించి, రాత్రి వేళల్లో సీసీ కెమెరాలు లేని మార్గాలను గుర్తించాడు. ఆగస్టు 30న కార్గిల్ గేట్ నుంచి లోపలికి వచ్చి పరిస్థితులను గమనించి, 31వ తేదీన పక్కా ప్రణాళికతో ఆయుధాలను చోరీ చేశాడు. ఆర్మీ నుంచి తనను అకారణంగా తొలగించారన్న కోపంతోనే మల్లేశ్ ఈ చర్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఆయుధాలను చోరీ చేశాక మొదట ఒక చోట పాతిపెట్టి, ఆ తర్వాత మరో ప్రాంతానికి ఎందుకు మార్చాడనే కోణంలో లోతైన విచారణ సాగుతోందని డీజీపీ వివరించారు. ఈ చోరీకి ఎలాంటి అంతర్జాతీయ ముఠాలతో గానీ, ఉగ్రవాద సంస్థలతో గానీ సంబంధాలు ఉన్నట్లు ఇప్పటివరకు ఆధారాలు లభించలేదని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. దేశ అంతర్గత భద్రతకు తీవ్ర ముప్పుగా పరిణమించే అవకాశం ఉన్న ఈ ప్రమాదకర ఆయుధాల చోరీని సత్వరమే ఛేదించిన మిలిటరీ అధికారులను, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్‌ను, దర్యాప్తు బృందాలను డీజీపీ సీవీ ఆనంద్ ప్రత్యేకంగా ప్రశంసించారు.

## ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలు

ప్రధాన మళ్లింపులు ఇవే: పోలీసులు ప్రకటన ప్రకారం, పాత సైఫాబాద్ పోలీస్ స్టేషన్ నుంచి బడా గణేష్ వైపు వచ్చే వాహనాలను ఇక్బాల్ మినార్ మీదుగా మళ్లిస్తారు. ఇక్బాల్ మినార్ నుంచి ఐమ్యాక్స్ వైపు వెళ్లే వాహనాలు సచివాలయం ఎక్స్ రోడ్ మీదుగా ప్రయాణించాల్సి ఉంటుంది. అదేవిధంగా, నెక్లెస్ రోటరీ నుంచి మింట్ కాంపౌండ్ వైపు వెళ్లే ట్రాఫిక్‌ను సచివాలయం జంక్షన్, ఖైరతాబాద్ ఫ్లైఓవర్ మీదుగా అనుమతిస్తారు. నిరంకారి నుంచి ఖైరతాబాద్ రైల్వే గేట్ వైపు వచ్చే వాహనాలను పాత సైఫాబాద్ పీఎస్ జంక్షన్ మీదుగా మళ్లిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. భక్తులకు పార్కింగ్ సౌకర్యాలు: గణపతి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకంగా పార్కింగ్ ప్రదేశాలను కేటాయించారు. రేస్ కోర్స్ రోడ్, ఎన్టీఆర్ ఘాట్, ఐమ్యాక్స్ సమీపంలోని హెచ్ఎండీఏ పార్కింగ్ స్థలం, ఐమ్యాక్స్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో వాహనాలను పార్క్ చేసుకోవచ్చు. ఖైరతాబాద్ జంక్షన్ నుంచి వచ్చే భక్తుల కోసం విశ్వేశ్వరయ్య భవన్‌లో పార్కింగ్ ఏర్పాటు చేశారు. వాహనదారులు రద్దీగా ఉండే మార్గాలకు బదులుగా ప్రత్యామ్నాయ రహదారులను ఎంచుకోవాలని పోలీసులు సూచించారు. అత్యవసర సహాయం కోసం 90102 03626 హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

## పురపాలక పాలనలో ట్రాన్స్‌జెండర్లు..

వ్యవహారాల మంత్రి డి. శ్రీధర్ బాబు 'తెలంగాణ మున్సిపాలిటీల (నాలుగో సవరణ) బిల్లు, 2026'ను సభలో ప్రవేశపెట్టారు. 2019 నాటి తెలంగాణ మున్సిపాలిటీల చట్టానికి ఈ బిల్లు సవరణలు ప్రతిపాదిస్తుంది. దీని ప్రకారం, హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) వెలుపల ఉన్న తొమ్మిది మున్సిపల్ కార్పొరేషన్లలో ఒక్కో ట్రాన్స్‌జెండర్‌ను నామినేటెడ్ సభ్యునిగా కో-ఆప్ట్ చేసుకునే అవకాశం కలుగుతుంది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, సామాజిక వివక్ష, వెలికి గురవుతున్న ట్రాన్స్‌జెండర్లను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడంతో పాటు, ప్రజా జీవితంలో వారి భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగానే ఈ సంస్కరణలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ బిల్లుకు బీజేపీ, సీపీఐ సహా ఇతర పక్షాల సభ్యులు మద్దతు ప్రకటించగా, అనంతరం సభ దీనిని ఏకగ్రీవంగా ఆమోదించింది.

## 25 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న మోదీ

పిలుపునిచ్చారు. నెల రోజుల పాటు సాగే ఈ ఉత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరాలు, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు. మోదీ పాలనలో జన్‌ధన్ యోజన, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా పేదలను నేరుగా బ్యాంకింగ్ వ్యవస్థతో అనుసంధానించి సంక్షేమ ఫలాలను పూర్తి పారదర్శకంగా అందిస్తున్నామని ఆయన తెలిపారు. యూపీఐ, డిజిటల్ చెల్లింపుల విప్లవంతో భారత్ ప్రపంచ డిజిటల్ పేమెంట్ రంగంలో అగ్రగామిగా నిలిచిందన్నారు. పీఎం విశ్వకర్మ, పీఎం స్వనిధి, ముద్ర రుణాల ద్వారా చేతివృత్తిదారులు, వీధి వ్యాపారులు, చిన్న వ్యాపారులకు ఆర్థిక చేయూతనిస్తున్నామని గుర్తుచేశారు. ఈ క్రమంలోనే 'మేరే సప్నో కా భారత్', 'సేవా కీ కహానీ', 'సేవా జ్యోతి కలశ్ యాత్ర', 'సుశాసన్ సేవా సంవాద్' వంటి పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ, మోదీ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేస్తామని పేర్కొన్నారు.

## మంత్రి పదవి నుంచి కొండా సురేఖ తొలగింపుపై కేటీఆర్ సంచలన ఆరోపణలు

మాట్లాడారు. మంచిర్యాలలో మొదలైన ఈ భూ కుంభకోణం వ్యవహారం ముదరడంతో, దానిని కప్పిపుచ్చేందుకు కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 16 లక్షల ఎకరాలుగా ఉన్న 22ఏ నిషేధిత భూముల జాబితా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏకంగా కోటి 16 లక్షల ఎకరాలకు పెరిగిందని కేటీఆర్ వివరించారు. రాష్ట్రంలో జరుగుతున్న భూదందాకు ఇదే నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. ఒక మంత్రి కుమార్తె ప్రభుత్వంలోని అవినీతిని ప్రశ్నిస్తే, ఏకంగా ఆ మంత్రినే పదవి నుంచి తొలగించడం దారుణమని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ఈ ఉదంతం కాంగ్రెస్ పాలనలో పారదర్శకత ఎంతలా లోపించిందో తేటతెల్లం చేస్తోందని ఆయన విమర్శించారు.

## రైతులకు యాంత్రీకరణ పథకం

అందిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. తయారీదారులు, సరఫరాదారులు అందించే ఉత్పత్తులను ఫార్మ్ మెషినరీ ట్రైనింగ్ అండ్ టెస్టింగ్ ఇన్స్టిట్యూట్ లేదా కేంద్ర వ్యవసాయ శాఖ (ణూాడఖీఔ) ద్వారా గుర్తింపు పొందిన సంస్థల వద్ద పరీక్షించిన తర్వాతనే రైతులకు సరఫరా చేస్తున్నామని తెలిపారు. రైతుల భద్రత, యంత్రాల నాణ్యత, పనితీరు వంటి అంశాల్లో ఎలాంటి రాజీ లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. యాంత్రీకరణ పథకం కింద రైతులకు అందించే పరికరాలు వారు కోరుకున్న విధంగా లభించడం లేదని, సబ్సిడీపై అందించే యంత్రాలకు, మార్కెట్లో లభించే యంత్రాలకు తేడా ఉంటుందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రస్తావించారు. సబ్సిడీ పరికరాలకు ఇచ్చే కొటేషన్ ధరలు, మార్కెట్ ధరల మధ్య వ్యత్యాసం ఉంటోందని పేర్కొన్నారు. డిమాండ్ ఉన్న యంత్రాలను ఎక్కువగా అందించాలని, డ్రోన్లను కూడా అధిక సంఖ్యలో అందించాలని కోరారు. దీనిపై మంత్రి తుమ్మల స్పందిస్తూ, ఎమ్మెల్సీ ప్రస్తావించిన అంశాలు గతంలో ఉన్న పరిస్థితులకు సంబంధించినవని, ప్రస్తుతం ఆ విధానం లేదని స్పష్టం చేశారు. రైతులు తమకు నచ్చిన పనిముట్టును, తమకు నచ్చిన కంపెనీ నుంచి కొనుగోలు చేసుకునే విధంగా ప్రస్తుత యాంత్రీకరణ విధానాన్ని రూపొందించామని తెలిపారు. గత ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులను వినియోగించుకోకుండా యాంత్రీకరణ పథకాన్ని నిలిపివేసిందని మంత్రి తుమ్మల తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని యాంత్రీకరణ పథకాన్ని పునరుద్ధరించి తిరిగి అమలులోకి తీసుకొచ్చిందన్నారు. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగడం ద్వారా రైతులపై శారీరక శ్రమ తగ్గడంతో పాటు, సాగు ఖర్చులు తగ్గి, సమయానికి వ్యవసాయ పనులు పూర్తయ్యే అవకాశం ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో యాంత్రీకరణ పథకం కోసం ప్రభుత్వం రూ.71 కోట్లు కేటాయించగా, రూ.63.11 కోట్లు ఖర్చు చేసి 15,565 వ్యవసాయ యంత్ర పరికరాలను రైతులకు సరఫరా చేసినట్లు మంత్రి వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో యాంత్రీకరణ పథకానికి రూ.147.91 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రైతుల డిమాండ్‌ను అనుగుణంగా, అవసరమైన వ్యవసాయ యంత్ర పరికరాలను యాంత్రీకరణ పథకం కింద సరఫరా చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. యాంత్రీకరణ పథకం ద్వారా రైతులకు అందించే పరికరాలపై ప్రభుత్వం గణనీయమైన సబ్సిడీని అందిస్తోందని మంత్రి తెలిపారు. చిన్న, సన్నకారు రైతులు, ఎస్సీ, ఎస్టీ రైతులు, మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీ, ఇతర రైతులకు 40 శాతం సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లు అందిస్తున్నట్లు వెల్లడించారు. దీంతో వ్యవసాయ యంత్ర పరికరాల కొనుగోలుకు రైతులపై పడే ఆర్థిక భారం తగ్గుతుందని మంత్రి పేర్కొన్నారు. రైతులు కోరుకునే విధంగా వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉండేలా ఎంప్యానెల్‌మెంట్ కమిటీలో రైతులకు కూడా భాగస్వామ్యం కల్పించినట్లు మంత్రి తెలిపారు. కమిటీలో శాస్త్రవేత్తలు, టెక్నికల్ ఇంజనీర్లు, అధికారులతో పాటు ఆదర్శ రైతులు, ఎఫ్‌పీవోలు (ఫ్పీాం) ప్రతినిధులను కూడా భాగస్వాములను చేశామని వివరించారు. రైతుల వాస్తవ అవసరాలు, క్షేత్రస్థాయి పరిస్థితులు, వివిధ ప్రాంతాల్లో సాగు విధానాలను పరిగణనలోకి తీసుకుని యంత్ర పరికరాల ఎంపిక జరిగేలా ఈ విధానం రూపొందించామని తెలిపారు. యాంత్రీకరణ పథకం కింద పరికరాలను సరఫరా చేసేందుకు 444 కంపెనీలు ఎంప్యానెల్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకున్నాయని మంత్రి వెల్లడించారు. అయితే ప్రతి కంపెనీని ఎంపిక చేయడం జరగదని, నిర్దేశిత ప్రమాణాలను పాటించే కంపెనీలను, కేంద్ర ప్రభుత్వానికి చెందిన సంబంధిత సంస్థలు గుర్తించి ఎంపిక చేసే ప్రమాణాలను అనుసరించే కంపెనీలను మాత్రమే జాబితాలో చేర్చుతామని స్పష్టం చేశారు. దీంతో రైతులకు నాణ్యత లేని లేదా ప్రమాణాలు లేని యంత్ర పరికరాలు అందకుండా చూడటంతో పాటు, నాణ్యమైన ఉత్పత్తులకు ప్రాధాన్యత లభిస్తుందని తెలిపారు. యాంత్రీకరణ పథకంలో రైతుకు కొనుగోలు విషయంలో పూర్తి స్వేచ్ఛ కల్పిస్తున్నామని మంత్రి తుమ్మల తెలిపారు.

## చెరువుల హద్దులకు రక్షణ కవచం...

ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య అంశంగా భావిస్తోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. చెరువుల పూర్తి నీటిమట్టం-ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) హద్దులను ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడుతామని, జలవనరుల ఆక్రమణలను ఉపేక్షించబోమని ఆయన శాసన మండలి వేదికగా ప్రకటించారు. శుక్రవారం శాసన మండలిలో జరిగిన చర్చ సందర్భంగా సభ్యులు లేవనెత్తిన అంశాలకు మంత్రి సమాధానమిచ్చారు. చెరువుల ఎఫ్‌టీఎల్ హద్దులు దెబ్బతిన్నా, జలవనరులు ఆక్రమణలకు గురైనా, వాటిపై ఆధారపడి జీవించే మత్స్యకార కుటుంబాలకు నష్టం వాటిల్లినా ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుందని చెప్పారు. సభ దృష్టికి తీసుకొచ్చిన నిర్దిష్ట సమస్యను నీటిపారుదల శాఖ అధికారులు స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని మంత్రి ఆదేశించారు. వారం రోజుల్లోగా సంబంధిత చెరువును సందర్శించి, జలవనరుల పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలు, స్థానిక మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి అవసరమైన కార్యాచరణపై నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. "చెరువులు, వాటి ఎఫ్‌టీఎల్ హద్దుల పరిరక్షణకు నేను సంపూర్ణంగా కట్టుబడి ఉన్నాను. ఎక్కడైనా ఎఫ్‌టీఎల్ హద్దులు దెబ్బతిన్నా, ఆక్రమణలు జరిగినా, మత్స్యకారులకు అన్యాయం వాటిల్లినా నిర్దిష్ట వివరాలను నా దృష్టికి తీసుకురండి. ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటుంది" అని మంత్రి సభకు భరోసా ఇచ్చారు. రాష్ట్రం ఏర్పడిన సమయంలో సుమారు 2,150గా ఉన్న మత్స్య సహకార సంఘాల సంఖ్య ప్రస్తుతం ఆరు వేలకు పైగా పెరిగిందని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. అదేవిధంగా సంఘాల సభ్యత్వం సుమారు రెండు లక్షల నుంచి 6.5 లక్షలకు చేరిందని వివరించారు. చెరువులు, ఇతర జలవనరుల పరిరక్షణలో మత్స్య సహకార సంఘాలకు మరింత క్రియాశీలమైన పాత్ర కల్పిస్తూ సమగ్ర విధానాన్ని రూపొందించాలని సభ్యులు కోరారు. జలవనరుల ఆరోగ్యంతోనే మత్స్యకారుల జీవనోపాధి ముడిపడి ఉన్నందున, చెరువుల పర్యవేక్షణ, చేప పిల్లల సంరక్షణ, ఆక్రమణలు లేదా ఇతర ముప్పులను తక్షణమే ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో మత్స్యకార సంఘాలు స్థానిక సంరక్షకులుగా సమర్థవంతమైన పాత్ర పోషించగలవని సూచించారు. రాష్ట్రంలోని అన్ని చెరువులకు పరిరక్షణ, నిర్వహణ కమిటీలను ఏర్పాటు చేసే ప్రక్రియను ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇటువంటి కమిటీలు పనిచేశాయని, అనంతర కాలంలో ఆ వ్యవస్థ నిలిచిపోయిందని తెలిపారు. జలవనరుల సమర్థ నిర్వహణ, నిరంతర పర్యవేక్షణ, ఆక్రమణల నిరోధానికి కమిటీల వ్యవస్థను పునరుద్ధరించాలని వచ్చిన సిఫారసుల మేరకు ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే సుమారు 44 వేల చెరువులకు జియో ట్యాగింగ్ పూర్తయిందని మంత్రి తెలిపారు. ఈ సమగ్ర సమాచార వ్యవస్థ చెరువుల స్థితిగతులను పర్యవేక్షించడంతోపాటు వాటి పరిరక్షణకు అవసరమైన కార్యాచరణ రూపొందించేందుకు బలమైన ప్రాతిపదికగా ఉపయోగపడుతుందని చెప్పారు. చెరువుల పరిరక్షణకు అదనపు నిధులు అవసరమైతే వాటిని సమకూర్చేందుకు ప్రభుత్వం వెనుకాడబోదని స్పష్టం చేశారు. చెరువుల సంరక్షణ, ఎఫ్‌టీఎల్ హద్దుల పరిరక్షణ, మత్స్యకారుల జీవనోపాధికి భరోసా కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్య అంశాలని పునరుద్ఘాటించారు. నల్లగొండ జిల్లాలోని నెల్లికల్ ఎత్తిపోతల పథకాన్ని డిసెంబర్ 2027 నాటికి సంపూర్ణంగా పూర్తి చేసి, సుమారు 24 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శాసన మండలి సాక్షిగా విస్పష్టమైన హామీ ఇచ్చారు. నెల్లికల్ ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య ప్రాజెక్టుగా గుర్తించిందని చెప్పారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్దేశించుకున్న గడువులోగా రెండు దశలను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామని వివరించారు. తొలి దశలో జూన్ 2027 నాటికి 7,800 ఎకరాలకు సాగునీరు అందిస్తామని, మిగిలిన సుమారు 16 వేల ఎకరాలకు డిసెంబర్ 2027 నాటికి నీరందించి మొత్తం 24 వేల ఎకరాల ఆయకట్టును సస్యశ్యామలం చేస్తామని ప్రకటించారు. "సభాముఖంగా విస్పష్టమైన హామీ ఇస్తున్నాను. మొదటి దశను జూన్ 2027 కంటే ముందుగానే పూర్తి చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. డిసెంబర్ 2027 నాటికి మొత్తం ప్రాజెక్టును పూర్తి చేసి, 24 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తాం" అని మంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఈ పథకం పనులకు కేవలం రూ.25.42 కోట్లు మాత్రమే విడుదలయ్యాయని మంత్రి తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటివరకు రూ.310.681 కోట్లు విడుదల చేసి, దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న ప్రాజెక్టు పనులకు వేగం పెంచిందన్నారు. తాను స్వయంగా రెండుసార్లు ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించానని, నీటిపారుదల శాఖ కార్యదర్శి కూడా రెండుసార్లు సందర్శించి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారని తెలిపారు. నెల్లికల్ ప్రాజెక్టును పూర్తి చేసి రైతుల దశాబ్దాల నిరీక్షణకు తెరదించాలన్నది ప్రభుత్వ దృఢ సంకల్పమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పునరుద్ఘాటించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రస్తుతం అందిస్తున్న బియ్యం, గోధుమలు, చక్కెరతోపాటు మరికొన్ని నిత్యావసర సరుకులను పంపిణీ చేసే ప్రతిపాదనను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. శాసన మండలి ప్రశ్నోత్తరాల సమయంలో ప్రొఫెసర్ ఎం.కోదండరామ్‌తోపాటు పలువురు సభ్యులు చేసిన సూచనలపై మంత్రి స్పందించారు. పీడీఎస్ పరిధిలోకి అదనపు సరుకులను తీసుకురావడం ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని, అందుకు అవసరమయ్యే ఆర్థిక భారాన్ని సమగ్రంగా అంచనా వేస్తున్నామని తెలిపారు. "అదనపు నిత్యావసర సరుకుల పంపిణీ అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. ఆర్థిక ప్రభావాన్ని అధ్యయనం చేస్తున్నాం. ఈ ప్రతిపాదనను సానుకూలంగా పరిశీలించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది" అని మంత్రి స్పష్టం చేశారు. సన్నబియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేయడం ద్వారా ప్రభుత్వం ఆహార భద్రతను కల్పిస్తోందని, అయితే పేద కుటుంబాలకు పోషక భద్రతను అందించాలంటే పప్పులు, వంట నూనెలు వంటి సరుకులను కూడా చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీ చేయాలని సభ్యులు సూచించారు. దీనివల్ల పేదల ఆహారంలో పోషక విలువలు పెరగడంతోపాటు రాష్ట్రంలో పప్పుధాన్యాలు, నూనెగింజల సాగుకు ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. చౌకధరల దుకాణాల ఆర్థిక స్థిరత్వం మెరుగుపడి, భవిష్యత్తులో అవి "పేదల సూపర్ బజార్లు"గా రూపాంతరం చెందే అవకాశం ఉంటుందని సభ్యులు అభిప్రాయపడ్డారు.

## కులగణన ఒక 'ఎక్స్‌రే'

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ సర్వే ను దేశానికి ఆదర్శంగా తీసుకుని, దేశవ్యాప్తంగా కూడా ఇలాంటి సమగ్ర సర్వే నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో జనగణన, కులగణన అంశంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. కులగణన అనేది కులాలకు, రాజకీయ పార్టీలకు సంబంధించిన అంశం కాదని, సమాజ శ్రేయస్సుకు సంబంధించిన విషయమని పేర్కొన్నారు. సమాజంలో నెలకొన్న అసమానతలను సరిచేయాలంటే ముందుగా వాటి తీవ్రతను, స్వభావాన్ని తెలుసుకోవాల్సి ఉంటుందని, అందుకు కులగణన ఎంతో కీలకమని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులపై సమగ్ర సర్వే నిర్వహించిందని భట్టి తెలిపారు. రాష్ట్రంలో ఏ కులానికి ఎంత జనాభా ఉంది, వారి వృత్తులు ఏమిటి, ఆర్థిక పరిస్థితి ఎలా ఉంది, ఎంతమంది చదువుకున్నారు, ఎంతమంది ఉద్యోగాల్లో ఉన్నారు, ఎంతమంది నిరుద్యోగులు, భూమి ఉన్నవారు ఎంతమంది, లేనివారు ఎంతమంది వంటి అనేక అంశాలను కూలంకషంగా సేకరించామని చెప్పారు. ప్లానింగ్ శాఖను పర్యవేక్షిస్తున్న డిప్యూటీ సీఎంగా తాను ప్రతిరోజూ ఈ ప్రక్రియను సమీక్షిస్తూ, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సర్వేను నిర్వహించామని తెలిపారు. తెలంగాణలో నిర్వహించిన ఈ సర్వే దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. సర్వే నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టినప్పుడు ప్రతిపక్ష సభ్యులు సైతం అభినందించారని గుర్తుచేశారు. దేశమంతా తెలంగాణ మోడల్ కావాలి తెలంగాణలో జరిగిన సర్వే తరహాలో దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి డిమాండ్ చేస్తోందని భట్టి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి పార్లమెంట్‌లోని వివిధ పార్టీల నాయకులతో పాటు ప్రధానమంత్రిని కూడా కలిసి దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలని విజ్ఞప్తి చేశారని చెప్పారు. మంత్రులు కూడా ఈ అంశంపై కేంద్రంపై ఒత్తిడి తెచ్చారని వివరించారు. అయినప్పటికీ కేంద్రం నుంచి ఆశించిన విధంగా స్పందన రాకపోవడంతో ఢిల్లీలో అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానించి సమావేశం నిర్వహించి, తెలంగాణలో అమలు చేసిన విధానాన్ని వివరించామని తెలిపారు. దేశవ్యాప్తంగా ఇదే తరహాలో కులగణన నిర్వహించాలని కోరామని చెప్పారు. జనగణన నిర్వహించే సమయంలోనే కులగణనను కూడా అందులో చేర్చుతామని అప్పట్లో కేంద్రం చెప్పిందని భట్టి గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం జరుగుతున్న జనగణనలో కులగణనను చేర్చకపోవడం బాధాకరమన్నారు. ఇచ్చిన మాట ప్రకారం జనగణనలో కులగణనను చేర్చాలని డిమాండ్ చేశారు. కులగణన లేకుండా దేశంలోని బలహీన వర్గాల వాస్తవ పరిస్థితులను ఎలా గుర్తిస్తారని ప్రశ్నించారు. కులగణనను చేర్చకుండా ప్రజలను పక్కదోవ పట్టించడం సరికాదన్నారు. ?"కులగణన చేద్దామా? వద్దా? అనే విషయాన్ని బీజేపీ సభ్యులు సూటిగా చెప్పాలి. కులగణనకు అనుకూలమైతే సభ తరపున కేంద్ర ప్రభుత్వానికి, ప్రధానమంత్రికి పిలుపునివ్వాలి. వ్యతిరేకమైతే అదే విషయాన్ని స్పష్టంగా చెప్పాలి" అని భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణలో సర్వే జరిగిన విషయాన్ని అసెంబ్లీలోనే అభినందించి, ఇప్పుడు దేశంలో ఎక్కడా కులగణన జరగలేదని చెప్పడం సరైన విధానం కాదన్నారు. తెలంగాణ మోడల్‌ను దేశవ్యాప్తంగా అమలు చేయాలని కోరుతున్నామని స్పష్టం చేశారు. సమాజంలో ఆస్తులు, వనరులు అందరికీ సమానంగా అందడం లేదని భట్టి పేర్కొన్నారు.

## విద్యే తలరాతలు మార్చే ఆయుధం

ప్రపంచంతో పోటీ పడాలంటే విద్యా విధానంలో తీసుకురావాల్సిన మార్పులపై విస్తృతంగా చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ నూతన విద్యా విధానం రూపొందించేందుకు విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేశామని, కమిషన్ సమర్పించిన నివేదికను పరిశీలించేందుకు కేకే నేతృత్వంలో కమిటీని నియమించామని చెప్పారు. సభ్యులు తమ సూచనలు, సలహాలను కమిటీకి అందించాలని, వాటిని ప్రభుత్వం స్వీకరించేందుకు సిద్ధంగా ఉందన్నారు. విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో 15 శాతం కేటాయించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. విద్యాశాఖను ముఖ్యమంత్రి నిర్వహిస్తున్నారంటూ విమర్శలు చేయడం సరికాదని రేవంత్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి స్వయంగా విద్యాశాఖను నిర్వహిస్తున్నారంటే ఆ శాఖకు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నామో అర్థం చేసుకోవచ్చన్నారు. తాను ముఖ్యమంత్రిగా విద్యాశాఖపై సమీక్ష నిర్వహిస్తే మొత్తం వ్యవస్థ సమీక్షలోకి వస్తుందని చెప్పారు. తనకు విద్యాశాఖపై ప్రత్యేకమైన ఆసక్తి, ప్యాషన్ ఉందన్నారు. 2023-24లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యాశాఖకు రూ.19,093 కోట్లు కేటాయించగా, తమ ప్రభుత్వం 2024-25లో రూ.21,292 కోట్లు కేటాయించిందన్నారు. 2025-26లో రూ.23,108 కోట్లకు, 2026-27లో రూ.26,647 కోట్లకు పెంచామని తెలిపారు. కేవలం మూడేళ్లలో విద్యాశాఖ బడ్జెట్‌ను రూ.7,554 కోట్ల మేర పెంచామని వివరించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే కేవలం 55 రోజుల్లో 10,006 మంది ఉపాధ్యాయుల ఉద్యోగాలను భర్తీ చేశామని సీఎం తెలిపారు. ఎలాంటి ఆరోపణలకు తావులేకుండా నియామక ప్రక్రియను పూర్తి చేశామన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో కేవలం 7,857 మంది ఉపాధ్యాయులను మాత్రమే నియమించిందని పేర్కొన్నారు. జెన్ ఆల్ఫా, జెన్ బీటా తరాలను దృష్టిలో ఉంచుకుని విద్యా విధానాన్ని రూపొందిస్తున్నామని చెప్పారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉందని, విద్యే తలరాతలను మార్చగలదనే నమ్మకంతోనే విద్యాశాఖను తన వద్ద ఉంచుకున్నానని రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రపంచంలోని అత్యుత్తమ విద్యా విధానాలను, బెస్ట్ ప్రాక్టీసెస్‌ను రాష్ట్రంలో అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. కొత్త నిర్ణయాలు తీసుకునే సందర్భంలో కొన్ని వివాదాలు చోటుచేసుకోవడం సహజమేనని, పాలిటెక్నిక్ కాలేజీలకు సంబంధించిన జీవో ఎంఎస్ నంబర్ 97 కూడా అలాంటిదేనని సీఎం పేర్కొన్నారు. తాను విద్యాశాఖ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 86 వేల మేర పెరిగిందని తెలిపారు. ఇది విద్యాశాఖ మంత్రిగా తన పనితీరుకు నిదర్శనమని రేవంత్‌రెడ్డి అన్నారు.

## పూర్తి పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించాం..

బహిరంగ చర్చకు రావాలని లోకేశ్ సవాల్ విసిరినా జగన్ ఇంతవరకు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. త్వరలోనే లోకేశ్ నాయకత్వంలో మరో మూడు డీఎస్సీలను విజయవంతంగా నిర్వహించి తీరుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. డీఎస్సీ, ఏపీపీఎస్సీ నిర్వహణకు ఉన్న ప్రాథమిక వ్యత్యాసం కూడా తెలీని వ్యక్తి జగన్ అని కేశినేని చిన్ని ఎద్దేవా చేశారు. స్పోర్ట్స్ కోటాలో ప్రత్యేకంగా పరీక్షలు ఉండవని, ఆ కేటాయింపులు నేరుగా సర్టిఫికెట్ల ఆధారంగా, మెరిట్ ప్రకారం జరుగుతాయని తెలిసినా వైసీపీ అసత్యాలు ప్రచారం చేస్తోందన్నారు. ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తున్న రామకృష్ణ అనే వ్యక్తికి డీఎస్సీలో ఉద్యోగం వస్తే, ఆయనకు రానట్లు సాక్షి పత్రికలో అబద్ధాలు రాశారని, ఆ బాధితుడు రామకృష్ణ స్వయంగా ఇక్కడే సజీవ సాక్ష్యంగా ఉన్నారని మీడియా ముందు ప్రదర్శించారు. ఐదేళ్ల పాలనలో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వని జగన్, తొమ్మిది నెలలుగా కుంభకర్ణుడిలా నిద్రపోయి ఇప్పుడు గ్లోబల్ ప్రచారంతో ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సొంత బాబాయి వివేకానందరెడ్డి హత్య కేసులో గొడ్డలిపోటును గుండెపోటుగా చిత్రీకరించడం, కోడికత్తి డ్రామాలు ఆడటం జగన్‌కు అలవాటేనని ఎంపీ ధ్వజమెత్తారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీ, గ్రూప్-1 నియామకాలలో జరిగిన భారీ అవకతవకలపై ప్రస్తుతం కోర్టు ఆదేశాల మేరకు విచారణ జరుగుతోందని తెలిపారు. ఆ అక్రమాల నివేదిక బయటకు వచ్చి తమ తప్పులు బయటపడతాయనే భయంతోనే డీఎస్సీపై వైసీపీ నేతలు బురద జల్లుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చిన సమాచారం తప్పని నిరూపించే దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని జగన్‌కు సవాల్ విసిరారు. ఇటువంటి దిగజారుడు రాజకీయాలు చేస్తే వచ్చే ఎన్నికల్లో జగన్ కనీసం ఎమ్మెల్యేగా కూడా గెలవలేరని జోస్యం చెప్పారు.


### తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ (భూ సేకరణ) శాఖ
నాగర్‌కర్నూల్ జిల్లా

నెం.జి2/808/2026 తేదీ. 08.09.2026
గజ.నెం.162/2026

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 19(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 25 ప్రకారము

**ఫారం. VII**
**(డిక్లరేషన్) రూఢి ప్రకటన**

నాగర్‌కర్నూల్ జిల్లా వంగూర్ మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామము వద్ద మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం డిస్ట్రిబ్యూటరి కెనాల్ - 73 (ఎం.జె.ఆర్.-16/మైనర్-ఎం.ఎల్.-1) నిర్మాణ నిమిత్తము పోతిరెడ్డిపల్లి గ్రామ పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్‌లో ఉదహరించిన ఎ. 2.28½ గుంటలు భూమి ప్రజా ప్రయోజనార్థం అనగా మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం డిస్ట్రిబ్యూటరి కెనాల్ - 73 (ఎం.జె.ఆర్.-16/మైనర్-ఎం.ఎల్.-1) నిమిత్తం సేకరించవలసిన అవసరం ఉన్నదని ప్రత్యేక ఉప కలెక్టరు (భూసేకరణ) యం.జి.ఎల్.ఐ.యస్.పి నాగర్‌కర్నూల్ గారు భావిస్తున్నారు. కావున ఇట్టి 2.28½ గుం భూమి డిస్ట్రిబ్యూటరి కెనాల్ - 73 (ఎం.జె.ఆర్.-16/మైనర్-ఎం.ఎల్.-1) నిమిత్తం భూ సేకరణ ద్వారా సేకరించుటకు గాను రూఢి ప్రకటన చేయడమైనది. సేకరించడానికి నిర్ధారించిన భూముల వివరాలు సంక్షిప్తంగా క్రింది ప్రకారము గలవు.

**షెడ్యూల్**

గ్రామము: పోతిరెడ్డిపల్లి మండలం: వంగూర్ జిల్లా: నాగర్‌కర్నూల్

| క్ర. సం. | సర్వే నెం./ ఎస్.డి. నెం. | పట్టా/ ఇనాం ఎట్సె ట్రా., | భూవర్గీ కరణ మెట్ట/ ఆరుతడి/ తరి | భూసేకరణకు ప్రతిపాదించిన విస్తీర్ణము ఎ. గుం | పట్టాదారు పేరు, అనుభవదారు పేరు మరియు ఏవైన హక్కులు గల యితర వ్యక్తులు | సరిహద్దులు | | | | చెట్లు | | నిర్మాణములు | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | ఉ | ద | తూ | ప | చెట్లు పేరు | చెట్లు సంఖ్య | వర్గము | విస్తీర్ణము |
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 68 | పట్టా | మెట్ట | 0.05½ | చికొండ పర్వతాలు తండ్రి మల్లయ్య (0.05½) జల్లెల లింగమ్మ భర్త లక్ష్మయ్య చికొండ రాము తండ్రి జంగయ్య చికొండ ధర్మయ్య తండ్రి పర్వతాలు చికొండ వెంకటమ్మ భర్త పర్వతాలు చికొండ శ్రీశైలం తండ్రి పర్వతాలు లింగారెడ్డి శ్రీనివాసులు రెడ్డి తండ్రి వెంకటేశ్వర్ రెడ్డి చికొండ బంగారమ్మ భర్త జంగయ్య ఇరిగేషన్ ప్రాజెక్టు | 65 | 74 | 67 | 69 | లేవు | లేవు | లేవు | లేవు |
| 2 | 65 | పట్టా | మెట్ట | 0.19½ | కెంగురి చిన్నయ్య తండ్రి రాములు (0.08½) యల్క నిరంజన్ తండ్రి సత్యనారాయణ (0.11) చికొండ రేణుక భర్త రాములు చికొండ మల్లేష్ తండ్రి పర్వతాలు యల్క పర్వతాలు తండ్రి నరసింహప్ప జల్లల పర్ధరాములు తండ్రి లక్ష్మయ్య పస్పనూరు వెంకటనారాయణ తండ్రి లక్ష్మినర్సు | 60 | 68 | 66 | 69 | లేవు | లేవు | బోరు, పైపులైన్ | 0.11 |
| 3 | 60 | లావుణి పట్టా | మెట్ట | 0.13½ | యల్క కృష్ణయ్య తండ్రి నర్సింహప్ప (0.10) పానుగంటి దుర్గమ్మ భర్త నర్సింహప్ప (0.03½) పుట్ట సత్యనారాయ్య తండ్రి రాములు ప్రభుత్వ భూమి | 61 | 65 | 59 | 64 | లేవు | లేవు | లేవు | లేవు |
| 4 | 61 | పట్టా | మెట్ట | 0.20½ | రాములు తండ్రి పెంటయ్య (0.16½) మారాల రవికుమార్ తండ్రి ఎల్లయ్య (0.04) సోము నిరంజన్ తండ్రి వెంకటయ్య తంగెళ్ల స్వామి తండ్రి జంగయ్య తంగెల్ల వరుణ్ తండ్రి నాగరాజు టి చందు తండ్రి నాగరాజు గుడ్డటి ధామోదర్ రెడ్డి తండ్రి నారాయణరెడ్డి మారాల బాలమ్మ భర్త ఎల్లయ్య | 57 | 60 | 59 | 62 | లేవు | లేవు | లేవు | లేవు |
| 5 | 62 | పట్టా | మెట్ట | 1.09½ | గుడ్డటి తిర్పతిరెడ్డి తండ్రి రాంరెడ్డి (0.25) గుడ్డటి కృష్ణారెడ్డి తండ్రి రాంరెడ్డి (0.12) గుడ్డటి సునంద భర్త దామోదర్‌రెడ్డి (0.12½) గుడ్డటి వెంటరెడ్డి తండ్రి నారాయణరెడ్డి | 56 | 64 | 61 | 47 | లేవు | లేవు | లేవు | లేవు |
| | | | మొత్తము | 2.28½ | | | | | | | | | |

భూసేకరణ చట్టం 30/2013 లోని సెక్షన్ 15(1) అనుసరించి పైన కనబరిచిన భూములకు సంబంధించినటువంటి రైతుల నుండి ఎటువంటి అభ్యంతరములు/ఆక్షేపణలు లేనందున ఇట్టి రూఢి ప్రకటన చేయడమైనది.

భూ సేకరణ తల పెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్టీల్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును. లేనిచో స్వీకరించబడవు.

పైన చూపిన భూ ఎని భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయము, నాగర్‌కర్నూల్ నందు పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉండును.

సామాజిక ఆర్థిక సర్వే నివేదిక ప్రకారము పైన చూపిన భూసేకరణ పిమ్మట ఏ ఒక్కరునూ వారి జీవనోపాధి కోల్పోవడం గాని నిర్వాసితులుగా మారడం గాని మరియు భూమి లేని వారిగా గాని జరగడము లేనందున ఇట్టి భూసేకరణ ప్రక్రియనందు పునరుపాధి మరియు పునరావాస కల్పన ప్రతిపాదనలు ఏమియును లేవు.

సం/- సం/- సం/-

స్పెషల్ డిప్యూటి కలెక్టర్ (భూ.సే), యూనిట్ –I, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్ | అదనపు కలెక్టరు, నాగర్‌కర్నూల్ | జిల్లా కలెక్టర్, నాగర్‌కర్నూల్

DIPR RO NO 857-LA/PP/ADVT/PUB/2026-27 తేదీ 11-09-2026

# సంపాదకీయం

## మొహం చాటేసిన వర్షాలు!

ఈ ఏడాది ఇప్పటివరకు వర్షాభావ పరిస్థితులే ఏర్పడ్డాయి. ఆయా ప్రాంతాల్లో అక్కడక్కడ చెదురుముదురు వర్షాలు మినహా ఎక్కడా అనుకున్న స్థాయిలో వర్షాలు కురవలేదు. మరోవైపు వర్షాకాలం చివరికి వస్తున్న కొద్దీ దేశంలోని రైతన్నల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. వాతావరణ శాఖ వెల్లడించిన తాజా అంచనాల ప్రకారం.. సెప్టెంబర్ మూడో వారం నుంచి దేశవ్యాప్తంగా పొడి వాతావరణం ఏర్పడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీనికి తోడు పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న 'ఎల్ నినో' ప్రభావం రబీ పంటల సాగుపై తీవ్ర ముప్పుగా పరిణమించేలా ఉంది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, బీహార్ వంటి పలు రాష్ట్రాల్లో సాధారణం కంటే 27 నుంచి 45 శాతం వరకు తక్కువ వర్షపాతం నమోదైంది. వర్షాకాలం ముగిసే సమయానికి వర్షాలు మొహం చాటేస్తే.. వచ్చే శీతాకాలంలో వేసే రబీ పంటల పరిస్థితి ఏంటనేది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. సాధారణంగా రబీ సీజన్ అక్టోబర్ నుంచి ప్రారంభమవుతుంది. సెప్టెంబర్‌లో వర్షాలు పడకపోయినా విత్తనాలు వేసే సమయం మారకపోవచ్చు కానీ, నేలలో తేమ శాతం దారుణంగా పడిపోతుంది. ప్రస్తుతం దేశంలోని 178 ప్రధాన రిజర్వాయర్లలో నీటి నిల్వలు గత ఏడాదితో పోలిస్తే దాదాపు 20 శాతం తగ్గిపోయాయి. గతేడాది ఇదే సమయానికి 163.44 బిలియన్ క్యూబిక్ మీటర్ల నీరు ఉండగా, ఇప్పుడు అది 130.55 బిలియన్ క్యూబిక్ మీటర్లకు పరిమితమైంది. పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్ , మధ్యప్రదేశ్ వంటి వ్యవసాయ ఆధారిత రాష్ట్రాల్లో నీటి నిల్వలు లేకపోతే విత్తనాలు మొలకెత్తడమే కష్టమవుతుంది. భారతీయ వ్యవసాయంలో రబీ కాలం చాలా కీలకమైనది. ముఖ్యంగా నీటి లభ్యత , నేలలోని తేమపై ఆధారపడే గోధుమ, ఆవాలు, శనగ పంటలు ఈసారి తీవ్ర ముప్పును ఎదుర్కొంటున్నాయి. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, హర్యానా రాష్ట్రాల్లో గోధుమలు, ఆవాల సాగు ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ మొదటి తడికి రిజర్వాయర్ నీళ్లే ఆధారం. మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్‌లోని నల్లరేగడి నేలల్లో వేసే శనగ పంట కేవలం భూమిలోని తేమ ఆధారంగానే పెరుగుతుంది. వర్షాలు లేక భూమి ఎండిపోతే ఈ పంటల దిగుబడి దారుణంగా పడిపోతుంది. ఎల్ నినో వల్ల ఏర్పడే కరవు పరిస్థితులను అధిగమించడానికి 'ఇండియన్ ఓషన్ డైపోల్' కాస్త ఆశాకిరణంగా కనిపిస్తోందని నిపుణులు చెప్తున్నారు. హిందూ మహాసముద్రంలో ఏర్పడే ఈ సానుకూల మార్పు వల్ల భారత్ వైపు వర్షపు మేఘాలు తొలకరిచ్చే అవకాశం ఉంది. 1997, 2023 సంవత్సరాల్లో ఎల్ నినో తీవ్రతను ఈ ఐఓడీ కొంతవరకు తగ్గించగలిగింది. అయితే, ఇది ప్రధానంగా వర్షాకాలానికే పరిమితమవుతుంది కాబట్టి, ఎండిపోయిన భూగర్భ జలాలను, ఖాళీ అయిన రిజర్వాయర్లను ఎంతవరకు నింపుతుందనేది అనుమానంగానే ఉంది. ఒకవేళ అక్టోబర్, నవంబర్ నెలల్లో భూమిలో తేమ శాతం పెరగకపోతే రబీ పంటల విస్తీర్ణం తగ్గడమే కాకుండా దిగుబడులు కూడా దెబ్బతింటాయి. దీనివల్ల రాబోయే రోజుల్లో గోధుమలు, పప్పుధాన్యాలు, వంటనూనెల సరఫరా తగ్గి, నిత్యావసర ధరలు మళ్లీ ఆకాశాన్ని తాకే ప్రమాదం ఉందని ఆర్థిక విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఇది కేవలం రైతుల ఆదాయాన్నే కాకుండా, సామాన్య ప్రజల జేబులకు కూడా పెద్ద కన్నం వేసేలా కనిపిస్తోంది. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా కరవు తాండవిస్తోంది. ఓవైపు వర్షాధార పంటల సాగును చాలా వరకు తగ్గించినప్పటికీ మరోవైపు బోర్లు, బావులపై ఆధారపడి సాగు చేసిన వరి సైతం చేతికందేలా లేదు. భూగర్భజలాలు దారుణంగా పడిపోయి, బోర్లు వట్టిపోతున్నాయి. ఎండిపోతున్న పంటలను చూడలేక అన్నదాతలు బావుల్లో పూడిక తీయిస్తూ కొత్త బోర్లు వేయిస్తున్నా చుక్క నీరు పడటం లేదు. ఈ వర్షాభావ పరిస్థితులు మరో వారం, పదిరోజుల పాటు కొనసాగితే పంటలపై ఆశలు వదిలేసుకోవాల్సిందేనని రైతులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో సాధారణంగా 1.32 కోట్ల ఎకరాల విస్తీర్ణంలో సాగు నమోదయ్యేది. కానీ ఈ ఏడాది 1.21 కోట్ల ఎకరాలు అంటే సుమారు 92 శాతం మేరకే సాగు చేసినట్లు వ్యవసాయశాఖ గణాంకాలు నివేదిస్తున్నాయి. ప్రధానంగా 66 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు నమోదవుతుండగా ఈసారి 52.81 లక్షల ఎకరాల్లో(80 శాతం) మాత్రమే నాట్లు పడ్డాయి. ఇక పత్తి అంచనా సాగు 47 లక్షల ఎకరాలకు గాను 48 లక్షల ఎకరాల్లో సాగు నమోదైంది. 6.49 లక్షల ఎకరాల విస్తీర్ణంలో అపరాలు సాగవుతుండగా 7.86 లక్షల ఎకరాలకు చేరింది. అధికంగా నీటి ఆధారమైన వరి సాగు 20 శాతం వరకు తగ్గింది. కానీ చాలా ప్రాంతాల్లో నాట్లు వేసిన రైతులు మాత్రం పంటను కాపాడుకోడానికి ఎన్నో పాట్లు పడుతున్నారు.రాష్ట్రంలో ఈ సీజన్?కు సంబంధించి ఇప్పటిదాకా 49 రోజులే వర్షం కురిసింది. 598.9 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతానికి గాను 478.2 మి.మీ మాత్రమే కురిసింది. మొత్తంగా 20 శాతం లోటు వర్షపాతం ఏర్పడగా 15 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. తక్కిన 18 జిల్లాల్లో లోటు వర్షపాతమే కొనసాగుతోంది. జనగామ, వరంగల్, హనుమకొండ, భద్రాద్రి కొత్తగూడెం, జోగులాంబ గద్వాల, సూర్యాపేట, ఖమ్మం, యాదాద్రి భువనగిరి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో దాదాపు 40 శాతం లోటులో కొనసాగుతుండటం గమనార్హం. గతేడాదితో పోలిస్తే రాష్ట్రంలో భూగర్భ జలమట్టం దాదాపు 2 మీటర్లకు పైగా పడిపోయింది. గత సంవత్సరం ఆగస్టు చివరి నాటికి 5.78 మీటర్ల లోతులో ఉన్న నీటిమట్టం ఇప్పుడు 7.87 మీటర్లకు పడిపోవడం గమనార్హం. జిల్లాల వారీగా చూస్తే సూర్యాపేట, వికారాబాద్ జిల్లాల్లో గతంతో పోలిస్తే అదనంగా 5 మీటర్ల మేర నీటిమట్టం తగ్గింది. నారాయణపేట, మహబూబ్‌నగర్, మేడ్చల్ జిల్లాల్లో 4 మీటర్లు, అలాగే వరంగల్, సంగారెడ్డి, రంగారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో 3 మీటర్లకు లోతులోకి నీటిమట్టాలు పడిపోయాయి. వర్షాలు కురవక, సాగునీరు లేక అన్నదాతలు అష్టకష్టాలు ఎదుర్కొంటున్నారు.

## పాలు, పసుపు నీళ్లతో శుద్ధి చేసిన ఘటనపై చర్యలు తీసుకోవాలి: కాంగ్రెస్




మల్కాజిగిరి, సెప్టెంబర్ 11,(విజన్ ఆంధ్ర): కేసిఆర్ ఫామ్ హౌస్ వద్ద దళితులు డప్పులతో నిరసన చేపడితే ఆ నేల అపవిత్రమైందని పాలు, పసుపు నీళ్లతో శుద్ధి చేసిన ఘటనపై విచారణ చేపట్టి, దోషులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు కోరారు. శుక్రవారం నేరేడ్ మెట్ పోలీస్ స్టేషన్లో వారు ఫిర్యాదు చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ...దళితులు డప్పులతో నిరసన చేపడితే ఆ నేల అపవిత్రమైందని పాలతో, పసుపు నీళ్లతో శుద్ధి చేయడం అమానీయ చర్య అన్నారు. ఇదిదొరల అహంకారానికి నిలువెత్తు నిదర్శనమన్నారు. దళితులంటే బీఆర్ ఎస్ నాయకులకు ఎంత చిన్న చూపు ఉందో ఈ చర్యతో దళిత సమాజానికి అర్థమైందన్నారు.దళితులు తలుచుకుంటే మీకు రాజకీయ పుట్ట గతులు ఉండవని హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లోదళితులంతా ఏకమై బిఆర్ఎస్ పార్టీని ఓటుతో బొందపెడతారని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ పై బిఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాత మధు, నవీన్ రెడ్డిలు చేసిన అసభ్య అనుచిత వ్యాఖ్యలను వారు ఖండించారు. తెలంగాణ ప్రభుత్వం వస్తే దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని , దళితులకు 3 ఎకరాలు భూమి ఇస్తానని 10 ఏళ్ళ బీఆర్ ఎస్ ప్రభుత్వ పాలనలో కేసీఆర్ దళితులను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాతదళిత సామాజికవర్గానికి చెందిన గడ్డం ప్రసాద్ కుమార్ నుస్పీకర్ పదవిలో కూర్చోబెట్టిందన్నారు. అది చూసి ఓర్వలేక కేసీఆర్ అసెంబ్లీకి రాకుండా ఫామ్ హౌజ్ లో నే నిద్ర పోతున్నాడని విమర్శించారు. స్పీకర్ దాడికి ఫామ్ హౌస్ నుంచే కుట్ర పన్నారని, అసెంబ్లీ ముందు గంగుల కమలాకర్ కు మహిళా ఎమ్మెల్యేలను తోసేయాలని కేటిఆర్ సైగలు చేశారని తెలిపారు.

## తెలంగాణ ఉద్యమంపై పరిశోధనకు తాళ్ల అజయ్‌కు డాక్టరేట్

### ఓ.యూ 85వ స్నాతకోత్సవంలో పట్టా ప్రదానం
### తల్లిదండ్రులు, ఉద్యమకారులకు డాక్టరేట్ అంకితం




కాప్రా/సెప్టెంబర్ 10(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో విద్యార్థుల పాత్రపై పరిశోధన చేసిన చెన్నారావుపేట (రాజీవ్‌నగర్ కాలనీ)కు చెందిన తాళ్ల అజయ్ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ 85వ స్నాతకోత్సవంలో భాగంగా ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేశారు.'రోల్ ఆఫ్ స్టూడెంట్స్ ఇన్ తెలంగాణ మూవ్‌మెంట్ (1956 ̈ 2014)' అంశంపై అజయ్ చేసిన పరిశోధనకు ఈ డాక్టరేట్ లభించింది. గవర్నర్, ఓయూ ఛాన్సలర్ శివ ప్రతాప్ శుక్లా అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి భారత్ బయోటెక్ వ్యవస్థాపకుడు, చైర్మన్ డా. కృష్ణ ఎల్లా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఓయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొ. కుమార్ మొలుగరం సమక్షంలో అజయ్ డాక్టరేట్ పట్టా స్వీకరించారు. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ తన విద్యా ప్రయాణంలో అండగా నిలిచిన గురువులు, బంధుమిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. డాక్టరేట్ సాధించడం తన సామాజిక బాధ్యతను మరింత పెంచిందన్నారు. తనను ఈ స్థాయికి తీసుకొచ్చిన తల్లిదండ్రులతో పాటు తెలంగాణ సాధన కోసం త్యాగాలు చేసిన విద్యార్థులు, ఉద్యమకారులకు డాక్టరేట్‌ను అంకితం చేస్తున్నట్లు తెలిపారు.

## గంజాయి విక్రయాలపై ఎస్టీఎఫ్ దాడి

### అంజయ్యనగర్‌లో కిలో గంజాయి పట్టివేత, మహిళపై కేసు



కూకట్ పల్లి (విజన్ ఆంధ్ర) సెప్టెంబర్ 11:కూకట్‌పల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మూసాపేట్ అంజయ్యనగర్‌లో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఎస్టీఎఫ్ ఏ టీం అధికారులు దాడులు నిర్వహించారు. సీఐ రమేష్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి చేపట్టిన తనిఖీల్లో కుదినేత సోని అనే మహిళ వద్ద కిలో గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.అక్రమంగా గంజాయిని కలిగి ఉన్నట్లు గుర్తించిన అధికారులు నిందితురాలిపై కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న గంజాయితో పాటు నిందితురాలిని కూకట్‌పల్లి ఎక్సైజ్ స్టేషన్ అధికారులకు అప్పగించినట్లు సీఐ రమేష్ తెలిపారు.ఈ దాడుల్లో ఎస్సై మధు, హెడ్ కానిస్టేబుల్ సంతోష్ ప్రసాద్, కానిస్టేబుళ్లు రవి, రాహుల్, రాజేశ్వరి, ఖలీద్ పాల్గొన్నారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై నిఘా కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

## వరి ధాన్యం సేకరణ సజావుగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు

### వానాకాలం - 2026-27 సన్నాహక సమావేశంలో కలెక్టర్ భవేష్ మిశ్రా

నిజామాబాద్, సెప్టెంబర్ 11 : (విజన్ ఆంధ్ర ) ప్రస్తుత వానాకాలం సీజన్ లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే ప్రక్రియ సజావుగా కొనసాగేలా సంబంధిత అధికారులు అంకిత భావంతో కృషి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. ఎక్కడ కూడా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పకడ్బందీ చర్యలు చేపట్టాలని అన్నారు. 2026-2027 వానాకాలం సీజన్ వరి ధాన్యం సేకరణకు సంబంధించి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలోని కాన్ఫరెన్సు హాల్ లో శుక్రవారం సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అక్టోబర్ మొదటి వారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులకు అందుబాటులోకి తేనున్న నేపథ్యంలో ముందస్తుగానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని అన్నారు. ఈసారి సుమారు 6.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నామన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని జిల్లాలో 736 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. వీటిలో ఐకేపీ ద్వారా 249 కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని నిల్వ చేసేందుకు వీలుగా గిడ్డంగులను గుర్తించాలన్నారు. తహసీల్దార్లతో క్షేత్రస్థాయిలో గోడౌన్లను పరిశీలింపజేసి, వాస్తవ నిల్వ సామర్థ్యం గుర్తించాలన్నారు. మార్కెట్ కమిటీలకు చెందిన గోడౌన్లు, రాష్ట్ర గిడ్డంగుల




సంస్థ గోడౌన్ లలో ఇప్పటికే భద్రపరచి ఉన్న మొక్కజొన్న నిల్వలను వెంటనే తరలించేలా మార్క్ ఫెడ్ అధికారులకు లిఖితపూర్వకంగా కోరాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యంను నిల్వ చేసేందుకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగానే ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని, ఈ విషయంలో సంబంధిత శాఖలు సమన్వయంతో వ్యవహరించాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని చోట్ల ధాన్యం దిగుబడులు చేతికందే సమయానికి కొనుగోలు కేంద్రాలు రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ సూచించారు. రైతులు నాణ్యతా ప్రమాణాలకు లోబడి, ప్రభుత్వంచే ఎంపిక చేయబడిన రకాలకు చెందిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి, పూర్తిస్థాయి మద్దతు ధర పొందేలా విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలోనూ మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణకు అవసరమైన గన్నీ బ్యాగులను అన్ని కేంద్రాలకు సమకూర్చాలన్నారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని వెంటదివెంట గోడౌన్లకు తరలించేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలలో సరిపడా సంఖ్యలో తేమ కొలిచే యంత్రాలు అందుబాటులో ఉంచాలని, రైతులకు నష్టం వాటిల్లకుండా తూకం, తరుగు వంటి అంశాల్లో జాగ్రత్తగా ఉండాలని, ధాన్యం సేకరణ ప్రక్రియ ముగిసేంత వరకు పకడ్బందీ పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ధాన్యం రవాణాకు సరిపడా సంఖ్యలో వాహనాలను సమకూర్చుకోవాలని, ధాన్యం ఎగుమతులు, దిగుమతులు వెంటదివెంట జరిగేలా ఎక్కువ సంఖ్యలో హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని, అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని దిశానిర్దేశం చేశారు. అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఏ చిన్న ఇబ్బందికి సైతం తావులేకుండా ధాన్యం సేకరణను సజావుగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, విజయ కుమారి, డీఆర్డీఓ సాయన్న, డీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, సివిల్ సప్లయిస్ డీ.ఎం ప్రవీణ్, డీసీఓ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరస్వామి , జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిణి గంగూబాయి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 12, 13న ప్రత్యేక ప్రచార దినాలు పకడ్బందీగా నిర్వహించాలి

### ్షపోలింగ్ కేంద్రాల్లో దీూాలు, సూపర్‌వైజర్లు, AERO\T అందుబాటులో ఉండాలి: అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 11(విజన్ ఆంధ్ర)మహబూబ్‌నగర్ జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 12, 13 తేదీల్లో నిర్వహించనున్న ప్రత్యేక ప్రచార దినాలను (Special Campaign Days) పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సంబంధిత అధికారులను, తహసీల్దార్లను ఆదేశించారు.ప్రత్యేక ప్రచార దినాల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో దీూాలు (దీశీశ్రీష్ట్ర ూవజవశ్రీ ూటటఱషవతీం), దీూా సూపర్‌వైజర్లు,ూజు=ాలు (ూంంఱర్ఘిత్ జుశ్రీవష్‌శీతీఝశ్రీ =వస్త్రఱర్‌తీఫ్ఱశీఅ ూటటఱషవతీం) సమన్వయంతో విధులు నిర్వహించాలని, తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో నిర్ణీత సమయంలో తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని సూచించారుఅర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం18 సంవత్సరాలు పూర్తిచేసుకున్న అర్హులైన యువతీ యువకులతో పాటు ఇప్పటివరకు ఓటరుగా నమోదు కాని అర్హులైన పౌరులను గుర్తించి, వారి నుంచి ఖీశీతీఎ-6 దరఖాస్తులను స్వీకరించి ఓటరు జాబితాలో నమోదు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారుమొదటిసారిగా ఓటు హక్కు పొందనున్న యువతలో అవగాహన కల్పించి, వారు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అర్హులైన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు అయ్యేలా దీూాలు ప్రజలకు అవసరమైన సమాచారం, మార్గదర్శకత్వం అందించాలని సూచించారు.అనర్హులైన




ఓటర్ల వివరాలను నిబంధనల మేరకు పరిశీలించాలిఓటరు జాబితాలో మరణించిన వ్యక్తుల పేర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలిపోయిన ఓటర్ల పేర్లు లేదా ఇతర కారణాలతో అనర్హులైన ఓటర్ల వివరాలు ఉన్నట్లయితే, నిబంధనల మేరకు పరిశీలించి ఖీశీతీఎ-7 ద్వారా తొలగింపు ప్రక్రియ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.అయితే అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు కూడా అనవసరంగా తొలగిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం మాత్రమే తదుపరి చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.ఓటరు వివరాల్లో తప్పులను సరిచేయాలిఇప్పటికే ఓటరు జాబితాలో నమోదై ఉన్న ఓటర్ల పేరు, వయస్సు, చిరునామా, ఫోటో తదితర వివరాల్లో తప్పులు లేదా మార్పులు ఉన్నట్లయితే, వాటి సవరణ కోసం ఖీశీతీఎ-8 దరఖాస్తులను స్వీకరించి, నిబంధనల మేరకు అవసరమైన సవరణలు చేపట్టాలని తెలిపారు.పోలింగ్ కేంద్రాల్లో ప్రజలకు పూర్తి సమాచారం అందించాలిప్రత్యేక ప్రచార దినాల్లో పోలింగ్ కేంద్రాలకు వచ్చే ప్రజలకు ఓటరు నమోదు, తొలగింపు, వివరాల సవరణకు సంబంధించిన దరఖాస్తు ప్రక్రియపై స్పష్టమైన సమాచారం అందించాలని అదనపు కలెక్టర్ సూచించారు.దీూాలు తమ పరిధిలోని ఓటర్లతో సమన్వయం చేసుకుంటూ, అర్హులైన కొత్త ఓటర్లను గుర్తించడం, ఓటరు జాబితాలో నమోదైన వివరాలను పరిశీలించడం, అవసరమైన సవరణలను నమోదు చేయడంలో చురుకైన పాత్ర పోషించాలని అన్నారు.అలాగే దీూా సూపర్‌వైజర్లు, ూజు=ాలు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రత్యేక ప్రచార దినాల నిర్వహణను సమీక్షించాలని ఆదేశించారు. స్వీకరించిన Form`6, Form`7, Form-8 దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి, ఎటువంటి పెండింగ్ లేకుండా తదుపరి చర్యలు చేపట్టేలా పర్యవేక్షించాలని తెలిపారు.అర్హులైన పౌరులు కొత్త ఓటరు నమోదుకు ఖీశీతీఎ-6, ఓటరు జాబితా నుంచి పేరు తొలగింపునకు ఖీశీతీఎ-7, ఓటరు వివరాల సవరణకు ఖీశీతీఎ-8 దరఖాస్తులను సమర్పించి, సెప్టెంబర్ 12, 13 తేదీల్లో నిర్వహించే ప్రత్యేక ప్రచార దినాలను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ కోరారు."అర్హులైన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో నమోదు కావడంతో పాటు, ఓటరు జాబితా శుద్ధంగా, పారదర్శకంగా, తప్పులులేకుండా ఉండేలా చూడటం అధికారుల బాధ్యత" అని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు.

## కాంగ్రెస్ కు దగ్గరవుతున్న జగన్

కడప, సెప్టెంబర్ 11, వైఎస్ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి క్రమంగా కాంగ్రెస్ అధిష్టానానికి దగ్గరవుతున్నారనే ప్రచారం ఢిల్లీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో వైఎస్ జగన్ సుదీర్ఘంగా చర్చలు జరిపారన్న కథనాలు రావడం, ఈ భేటీ వార్తలను అటు కాంగ్రెస్ కానీ, ఇటు వైఎస్ఆర్‌సీపీ కానీ స్పష్టంగా ఖండించకపోవడం ఈ అనుమానాలకు మరింత బలం చేకూరుస్తోంది. కేంద్రంలోని అధికార పక్షానికి అనుకూలంగా ఉంటూ వస్తున్న జగన్, సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తర్వాత తన జాతీయ రాజకీయ వ్యూహాన్ని పూర్తిగా మార్చుకుంటున్నారనే సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ ప్రచారానికి బలాన్ని చేకూరుస్తూ.. కాంగ్రెస్ అనుకూల సెఫాలజిస్టులు , విశ్లేషకులు జగన్-కాంగ్రెస్ కలయిక పై కొత్త లాజిక్కులు తెరపైకి తెస్తున్నారు. గత ఎన్నికల్లో ఏపీలో కాంగ్రెస్ పార్టీకి గణనీయమైన ఓటు బ్యాంక్ రాకపోయినా, ఓట్ల చీలిక వైఎస్ఆర్‌సీపీ విజయావకాశాలను కొంతవరకు దెబ్బతీసిందనే అంచనా ఉంది. భవిష్యత్తులో వైఎస్ఆర్‌సీపీ, కాంగ్రెస్ ఒకే గొడుగు కిందకి వచ్చినా లేదా ఇండియా కూటమి భాగస్వామిగా వైసీపీ చేరినా.. ఏపీలో కూటమికి గట్టి పోటీ ఇవ్వవచ్చని, కేంద్రంలోనూ బీజేపీకి వ్యతిరేక పక్షంలోకి మారేందుకు జగన్‌కు రోడ్‌మ్యాప్ సిద్ధమవుతోందని విశ్లేషిస్తున్నారు.అయితే, ఈ రాజకీయ పునరేకీకరణ వెనుక అతిపెద్ద అడ్డంకి వైఎస్ షర్మిల పాత్ర. ప్రస్తుతం ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఉన్న షర్మిల.. వైఎస్ జగన్‌పై, ఆయన పాలనా శైలిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నారు. ఆస్తి వివాదాలు, కుటుంబ విభేదాలు ఉన్నాయి. సయోధ్య కుదిరితే తప్ప కాంగ్రెస్-వైసీపీ మైత్రి సాధ్యం కాదనే వాదన ఒకవైపు ఉంది. కానీ, రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరు అన్నట్లుగా.. హైకమాండ్ ఆదేశిస్తే ఢిల్లీ పెద్దల సమక్షంలో కుటుంబ కలహాలను పక్కనబెట్టి ఒక అవగాహనకు వచ్చే అవకాశాలను కూడా కొట్టిపారేయలేము.వైఎస్ జగన్ ఈ దిశగా అడుగులు వేయడానికి మరో బలమైన కారణం ? కేంద్రంలోని అధికార పక్షం నుంచి గతంలో లభించినంత పొలిటికల్ రక్షణ ఇప్పుడు లభించడం లేదన్న భావన. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నమోదు అవుతున్న కేసులు, ఈడీ, సీబీఐ విచారణల వేగం పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ తరుణంలో ప్రాంతీయంగా ఒంటరిపోరు చేయడం

# అడవుల సంరక్షణలో అటవీ అధికారుల పాత్ర కీలకమైనది

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
### రక్తదానం చేసిన జిల్లా అటవీ శాఖ అధికారి



మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 11,(విజన్ ఆంధ్ర)అడవులను రక్షించి పర్యావరణాన్ని కాపాడడంలో అటవీశాఖ అధికారుల పాత్ర ఎంతో కీలకమైనదని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని మందమర్రి మండలం గాంధారి వనం ప్రాంతంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అడవి అమరవీరుల సంస్మరణ దినోత్సవం కార్యక్రమానికి కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శాంతారామ్, జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్ లతో కలిసి హాజరై అటవీ అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాల ప్రభావం అటవీ ప్రాంతంపై పడుతుందని, ఈ క్రమంలో అడవులు, పర్యావరణాన్ని కాపాడడంలో అటవీశాఖ అధికారులు విశిష్ట కృషి చేస్తారని తెలిపారు. ఆదివాసి గిరిజనుల హక్కులను కాపాడుతూనే అటవీ అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అడవులను రక్షించడం ద్వారా భావితరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించడం జరుగుతుందని, తద్వారా ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అందించినట్లు అవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని తెలిపారు. అనంతరం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో జిల్లా అటవీ అధికారి స్వచ్ఛందంగా రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. అటవీశాఖ అధికారులు, సిబ్బంది సైతం రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి జిల్లా కలెక్టర్ ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మైలార్ దేవరంపల్లిలో ఎస్ఐఆర్ ప్రక్రియ పై సమీక్ష

### 115 పోలింగ్ బూత్ లో 174 మంది 116 పోలింగ్ బూత్ లో 188 మందికి వచ్చిన నోటీసులు
### ఓటరుకు సంబంధించిన సరైన డాక్యుమెంట్లు ఆన్లైన్లో అప్ లోడ్ చేయడం
### ఏఈఆర్ఓ, ఎంపిడిఓ కేశబోయిన వినయ్ కుమార్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 11 ( విజన్ ఆంధ్ర ) : ఎస్ఐఆర్ ఫారంలో ఓటర్లు తమ వివరాలు కరెక్ట్ గా రాయని వారికి నోటీసులు జారీ చేయనైనదని ఏఈఆర్ఓ, ఎంపిడిఓ కేశబోయిన వినయ్ కుమార్ అన్నారు. ఓటర్లకు వచ్చిన నోటీసులు ఆధారంగా సరైన డాక్యుమెంట్లతో ఎలా ఆన్లైన్ లో అప్ లోడ్ చేయాలో క్షుణ్ణంగా విదిలించి ప్రత్యక్షంగా చేసి చూపించారు ఏఈఆర్ఓ. శుక్రవారం వికారాబాద్ మండల పరిధిలో గల మైలార్ దేవరంపల్లి గ్రామాన్ని సందర్శించి నోటీసులు వచ్చిన ఓటర్లకు గ్రామ సర్పంచ్ కొమ్ముని అనంతయ్య ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఈఆర్ఓ ఎంపిడిఓ కేశ బోయిన వినయ్ కుమార్ విజన్ ఆంధ్ర జిల్లా ప్రతినిధి మాచన్న గారి గైబులు ముదిరాజ్ తో మాట్లాడారు. గ్రామ సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శి జనంపల్లి సరితా రెడ్డి, అంగన్వాడీ టీచర్లకు ఆశా వర్కర్లకు ప్రత్యేకంగా తర్ఫీదు పొందిన శిక్షణా రైతులకు ఏఈఆర్ఓ పూర్తి అవగాహన కల్పించారు. పోలింగ్ స్టేషన్ 115లో 174 మంది, పోలింగ్ స్టేషన్ 116 లో 188 మందికి నోటీసులు వచ్చాయని తెలిపారు. ఓటర్ వచ్చిన నోటీసును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత సర్టిఫికెట్లను ఓటరు ద్వారా తెప్పించుకొని ఆన్లైన్ లో అప్లోడ్ చేయించారు.

## కార్మికుల సంక్షేమ భవనాన్ని సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ రాజర్షిషా



ఆదిలాబాద్, సెప్టెంబర్ 11 (విజన్ ఆంధ్ర):కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం నిర్మించిన నూతన లేబర్ ఫెసిలిటేషన్ కేంద్ర భవనాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. శుక్రవారం ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవ్య, రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి వర్చువల్ విధానంలో ప్రారంభించగా.. కలెక్టర్, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూషాతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ధాన్యం, పత్తి కొనుగోలు సీజన్లలో శ్రమిస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. భవనం నిరంతర నిర్వహణ కోసం అధికారులు, కార్మిక సంఘాల నాయకులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ముత్యం రెడ్డి, ఇతర అధికారులు, కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులు

## బోడుప్పల్ సర్కిల్‌లో 4,932 విగ్రహాల పంపిణీ

### డీప్యూటీ కమిషనర్ ఏ శైలజ

బోడుప్పల్,సెప్టెంబర్ 11(విజన్ ఆంధ్ర) : పర్యావరణ పరిరక్షణలో భాగంగా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులకు పర్యావరణహిత మట్టి గణేష్ విగ్రహాలను డిప్యూటీ కమిషనర్ ఏ. శైలజ పంపిణీ చేశారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సహకారంతో మొత్తం 4,932 మట్టి విగ్రహాలు బోడుప్పల్ సర్కిల్‌కు అందినట్లు అధికారులు తెలిపారు. వీటిలో 8 అంగుళాల విగ్రహాలు 3,933, 12 అంగుళాలవి 666, 15 అంగుళాలవి 333 ఉన్నాయి. ప్రజలు మట్టి విగ్రహాలను వినియోగించి పర్యావరణహితంగా వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించాలని డిప్యూటీ కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎం ఏఈ మహేష్, సిబ్బంది పాల్గొన్నారు. పీర్జాదిగూడలో రేపు పంపిణీపీర్జాదిగూడ, మేడిపల్లి ప్రాంతాల కాలనీ సంక్షేమ సంఘాల




ప్రతినిధుల కోసం రేపు ఉదయం 9.30 గంటలకు పీర్జాదిగూడ కౌన్సిల్ హాల్‌లో మట్టి గణేష్ విగ్రహాల పంపిణీ చేపట్టనున్నట్లు డిప్యూటీ కమిషనర్ తెలిపారు. సంబంధిత సంఘాల ప్రతినిధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

# పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు న్యాయం అందించాలి

### గణేష్ ఉత్సవాలు ప్రశాంతవాతావరణంలో,ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించాలి

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 11: (విజన్ ఆంధ్ర)కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయం లో శుక్రవారం జిల్లా ఎస్పీ నితికా పంత్ , జిల్లా పోలీస్ అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేసారు. ఈ సమావేశంలో పాల్గొన్న పోలీస్ అధికారులతో ఎస్పీ మాట్లాడుతూ... ప్రతీ కేసులో 'క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్' ద్వారా నేరస్తులకు శిక్షపడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు. కేసుల విచారణలో జాప్యం చేయరాదని, పోలీస్ అధికారులంతా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్ వాహనాలతో అధికారులు, సిబ్బంది నిరంతరం గస్తీ కాస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, డయల్ 112 కాల్స్ కి త్వరగతిన స్పందించాలని అన్నారు. అనంతరం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పెండింగ్ లో ఉన్న పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకొని,వారి పురోగతి కి కృషి చేయాలన్నారు. కేసుల నమోదు,దర్యాప్తు, నేరస్థుల వివరాల నిర్వహణ, డేటా సమన్వయంలో సీసీటీఎన్ఎస్ ను సమర్ధవంతంగా వినియోగించి పనితీరును మరింత మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్ధాలు, మట్కా, జూదం, బెట్టింగ్ లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యత గురించి ప్రజలలో మరింత అవగాహన కల్పించి తమ తమ నివాస ప్రాంతాల్లో మరియు వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చేయాలని తెలిపారు. ప్రాపర్టీ కేసుల్లో ప్రస్తుతం పోలీసు శాఖ వినియోగిస్తున్న సాంకేతికతను ఉపయోగించి నేరస్తులను పట్టుకుని సొత్తును రికవరీ చేసి భాదితులకు



త్వరతగతిన అందేలా చూడాలని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి(బ్లాక్ స్పాట్స్) వాటి నివారణకై సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఎండింగ్ లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బాధితులకు న్యాయం చేకూరేలా పనిచేయాలని తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నాకాబంది, కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్స్ నిర్వహించాలని అన్నారు. మద్యం సేవించి వాహనాలను నడుపుతూ,ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారి గురించి నిరంతరం వాహన తనిఖీలు చేపట్టి పట్టుబడిన వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ఆసిఫాబాద్ డీఎస్పీ అశోక్, కాగజ్ నగర్ డిఎస్పి వాహీదుద్దీన్, ఇన్స్పెక్టర్స్, సబ్ ఇన్స్పెక్టర్స్, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బ్యాంక్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలి

### యూఎఫ్ బియు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 11,(విజన్ ఆంధ్ర)బ్యాంకు ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల ను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యు ఎఫ్ బి యు ) ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా ఒక్కరోజు ఇచ్చిన పిలుపులో భాగంగా మంచిర్యాల పట్టణంలో బ్యాంకు ఉద్యోగులు, అధికారులు ఐక్యంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, బ్యాంకింగ్ రంగ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఐదు రోజుల బ్యాంకింగ్‌ను వెంటనే అమలు చేయాలని, ఉద్యోగులపై పెరుగుతున్న పని భారాన్ని తగ్గించేందుకు బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను త్వరగా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగులు దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన సేవలు అందిస్తున్నప్పటికీ, వారి న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల సంక్షేమం, మెరుగైన పని పరిస్థితులు, తగినంత సిబ్బంది నియామకం వంటి అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. ఉద్యోగుల ఐక్యతను చాటుతూ నిర్వహించిన ఈ కార్యక్రమం మంచిర్యాలలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బ్యాంకు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అన్ని బ్యాంకుల ఉద్యోగ సంఘాలు ఐక్యంగా పోరాడుతున్నాయని తెలిపారు. ఉద్యోగుల




హక్కులు, సంక్షేమం కోసం అవసరమైన అన్ని ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. బ్యాంకు ఉద్యోగుల డిమాండ్లకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎస్ బి ఐ ఎస్ యు హెచ్ సి మంచిర్యాల రీజినల్ సెక్రటరీ కె. శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆఫీసర్స్ అసోసియేషన్ రీజినల్ సెక్రటరీ వెంకటేష్,ఏ జి ఎస్ సతీష్,ఓబిసి ఆర్ ఎస్ బిల్లా సత్యనారాయణ,యు బి ఐ ఆర్ ఎస్ వసంత కుమార్, టిజిబి బ్యాంక్ ఆర్ ఎస్ రాము సురేష్, ఏ డి సి సి బి. బాలరాజు, తదితర యూనియన్ నాయకులు, వివిధ బ్యాంకులకు చెందిన ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.

## బీసీలకు న్యాయం జరిగే వరకు ఉద్యమం ఆగదు: రూప్నర్ రమేష్...

### బీసీల హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలి: అజ్మీరా శ్యామ్ నాయక్



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 11:( విజన్ ఆంధ్ర) బీసీల న్యాయమైన హక్కుల సాధన కోసం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీల ధర్మ పోరాట దీక్షకు మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇంచార్జి అజ్మీరా శ్యామ్ నాయక్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు రూప్నర్ రమేష్ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా అజ్మీరా శ్యామ్ నాయక్ మాట్లాడుతూ, బీసీలకు జనాభా ప్రాతిపదికన న్యాయం జరగాలంటే సమగ్ర కులగణన ఎంతో అవసరమని అన్నారు. దేశంలో బీసీలు అత్యధిక జనాభా కలిగి ఉన్నప్పటికీ అనేక రంగాల్లో తమకు రావాల్సిన హక్కులు, అవకాశాలు పూర్తిస్థాయిలో దక్కడం లేదని పేర్కొన్నారు. బీసీలకు సంబంధించిన జనాభా గణాంకాలు స్పష్టంగా ఉంటేనే విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం, సంక్షేమ పథకాలు తదితర రంగాల్లో సరైన వాటా సాధ్యమవుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ జనగణనలో బీసీ కులగణన చేపడతామని ప్రకటించిన నేపథ్యంలో, ఆ ప్రక్రియను కేవలం ప్రకటనలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో బీసీ కుటుంబాలను సమగ్రంగా లెక్కించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి కులాన్ని ప్రత్యేకంగా నమోదు చేసి, స్పష్టమైన గణాంకాలను సేకరించాలని అన్నారు. బీసీలకు ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్ కేటాయించి సమగ్రంగా కులగణన చేపట్టాలని ఆయన కోరారు. బీసీల హక్కుల కోసం చేపడుతున్న ఉద్యమానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని, బీసీ సంఘాలు, యువత, విద్యార్థులు, మహిళలు ఐక్యంగా ముందుకు రావాలని అజ్మీరా శ్యామ్ నాయక్ పిలుపునిచ్చారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు రూప్నర్ రమేష్ మాట్లాడుతూ, బీసీలకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. బీసీల జనాభాను కచ్చితంగా లెక్కించకుండా, బీసీలకు ప్రత్యేక కాలమ్ లేకుండా కులగణన నిర్వహిస్తే భవిష్యత్తులో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీలకు రాజ్యాంగబద్ధంగా రావాల్సిన హక్కులు, విద్యాఉద్యోగ అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం, సంక్షేమ ఫలాలు జనాభా ప్రాతిపదికన అందాలంటే సమగ్ర కులగణన తప్పనిసరి అని రూప్నర్ రమేష్ అన్నారు. బీసీల కుటుంబాలను ప్రత్యేకంగా లెక్కించి, ప్రతి కులానికి ప్రత్యేక గుర్తింపు కోడ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీల హక్కుల కోసం నిర్వహిస్తున్న ధర్మ పోరాట దీక్ష కేవలం ఒకరోజు కార్యక్రమం కాదని, ఇది బీసీల భవిష్యత్తు కోసం సాగుతున్న ఉద్యమానికి ఒక బలమైన ప్రారంభమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం బీసీల న్యాయమైన డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. బీసీలకు న్యాయం జరిగే వరకు ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని, రాబోయే రోజుల్లో బీసీ సంఘాలు, యువత, విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు, రైతులను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని రూప్నర్ రమేష్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు రేగొండ కేశవరావు ,ఏఎంసీ చైర్మన్ ఇరుకుల మంగ , ఆవిడపు ప్రణయ్ కుమార్ ,వైరాగడే మారుతి పటేల్, లోబడే లవ్ కుమార్, గాజులు జక్కయ్య, పురుషోత్తం బాలేష్ బొట్టుపల్లి ప్రశాంత్, బీసీ సంక్షేమ సంఘం ఆసిఫాబాద్ మండల అధ్యక్షులు సిరికొండ సాయికృష్ణ, మాలి సంఘం నాయకులు శంకర్, బీసీ నాయకులు హనుమండ్ల శ్రీకాంత్ ,వనం మధుకర్, షేక్ అసద్,దూడల అశోక్, సంతోష్,కాశయ్య, వెంకన్న, నాందేవ్, తదితర బీసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మైనార్టీ సంగారెడ్డి మండల అధ్యక్ష పదవి బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహిస్తా –సంగారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షుడు రియాజ్



సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ :11(విజన్ ఆంధ్ర) సంగారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షుడిగా తనను నియమించినందుకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, నిర్మల జగ్గారెడ్డి, ప్రవీణ్ అన్న, సర్పంచ్ సాయిలకు నూతనంగా నియమితులైన మైనార్టీ అధ్యక్షుడు రియాజ్ కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి పార్టీ బాధ్యతలను అప్పగించిన కాంగ్రెస్ పార్టీ పెద్దలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులు, సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా మండలంలోని మైనార్టీ వర్గాలను పార్టీతో మరింతగా అనుసంధానం చేసేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. మైనార్టీ వర్గాల సమస్యలను నాయకుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. పార్టీ అధిష్ఠానం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా నాయకులు, కార్యకర్తల సమన్వయంతో ముందుకు సాగుతానని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీకి మరింత బలోపేతం తీసుకురావడానికి కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతూ, తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తానని నూతన మైనార్టీ అధ్యక్షుడు స్పష్టం చేశారు

## అయిజ పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

### వైద్య సేవలు, మందుల నిల్వలు, రికార్డుల పరిశీలించిన జిల్లా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్.సంధ్యా కిరణ్మయి



అయిజ సెప్టెంబర్ 11 (విజన్ ఆంధ్ర)జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్ఓ డా. సంధ్యా కిరణ్మయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది హాజరు, మందుల నిల్వలు, రికార్డుల నిర్వహణ, ల్యాబొరేటరీ, వ్యాక్సినేషన్, ఎన్‌సీడీ, ప్రసవ సేవలను పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. సేవలకు సంబంధించిన వివరాలను రికార్డుల్లో, ఆన్‌లైన్ పోర్టల్స్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. పీహెచ్‌సీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. ఆమె వెంట ఎస్ఓ తీర్మల్‌రెడ్డి, డీపీఎచ్ఎన్ఓ వరలక్ష్మి ఉన్నారు.

## పెద్దచెరువు ట్యాంక్‌బండ్ పనులు 15 రోజుల్లో పూర్తి చేయాలి కలెక్టర్ ఖుష్బూ గుప్తాలి



మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 11 (విజన్ ఆంధ్ర)మహబూబ్ నగర్ పెద్దచెరువు ట్యాంక్‌బండ్ అభివృద్ధి పనుల్లో మిగిలిన పనులను 15 రోజుల్లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె పెద్దచెరువు మినీ ట్యాంక్‌బండ్, పక్కనే ఉన్న శిల్పారామాన్ని సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించారు. పెద్దచెరువులో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్న కలెక్టర్, ఇరిగేషన్ శాఖ, ముూఢ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన పెండింగ్ పనుల వివరాలను పరిశీలించారు. ఇప్పటికే చేపట్టిన పనులను పరిశీలించి, అవసరమైన చోట మార్పులు, అదనపు అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం శిల్పారామాన్ని సందర్శించిన కలెక్టర్ అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. స్టాళ్లను ఎవరెవరికి కేటాయించారు, వాటి ప్రస్తుత పరిస్థితి ఏమిటనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేటాయించిన అన్ని స్టాళ్లను త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అక్టోబర్ 1వ తేదీ నుంచి శిల్పారామంలోని అన్ని స్టాళ్లు పూర్తిస్థాయిలో కార్యకలాపాలు నిర్వహించేలా అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, ఇరిగేషన్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మైలార్ దేవ్ పల్లి పరిధిలో విషాదం

### వేడి నీళ్ల బకెట్లో పడి నాలుగేళ్ల చిన్నారి మృతి

రాజేంద్రనగర్ మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర విషాదకర సంఘటన చోటుచేసుకుంది. వేడి నీళ్ల బకెట్లో పడి నాలుగేళ్ల బాలిక మృతి చెందింది స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం మైలార్దేవ్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రగతి నగర్ మహబూబ్నగర్ జిల్లాకు చెందిన ఒక కుటుంబం ఉపాధి నిమిత్తం ప్రగతి నగర్లో నివాసముంటోంది. ఓ కంపెనీలో పనిచేసే బాలిక తల్లి, పని ముగించుకుని ఇంటికి వచ్చిన తర్వాత స్నానం చేయడానికి బకెట్లో వాటర్ హీటర్ పెట్టి నీళ్లను వేడి చేస్తోంది

# రాజన్న పనులకు వేగం పెంచాలి



వేములవాడ, సెప్టెంబర్ 11 (విజన్ ఆంధ్ర బ్యూరో):వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం వీటీఏడీఏ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆలయ అభివృద్ధి పనులు, నిత్యాన్నదాన సత్రం, బద్ది పోచమ్మ ఆలయ నిర్మాణ పనులను అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. తిప్పాపూర్ బ్రిడ్జి నుంచి రాజన్న ఆలయం వరకు చేపడుతున్న 80 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్.. మురుగు కాలువ, విద్యుత్ టవర్లు, రోడ్డు నిర్మాణానికి సంబంధించిన పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి పనిని నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. అనంతరం ఐడీఓసీలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్ ఆలయ అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. పనుల్లో జాప్యం లేకుండా శాఖల మధ్య సమన్వయం పెంచాలని, అవసరమైన చోట అదనపు కూలీలను ఏర్పాటు చేసి పనుల వేగాన్ని పెంచాలని ఆదేశించారు. నిత్యాన్నదాన సత్రం నిర్మాణ పనులను కూడా వేగవంతం చేయాలని సూచించారు. బద్ది పోచమ్మ ఆలయ విస్తరణ పనులను పరిశీలించిన కలెక్టర్.. ప్రణాళిక ప్రకారం నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. వీటీఏడీఏ ఆధ్వర్యంలో చేపడుతున్న అన్ని పనులను సంబంధిత శాఖల అధికారులు నిత్యం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. అధునాతన గోశాల పురోగతిపై కూడా వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ రమాదేవి, వేములవాడ ఆర్డీఓ కేఎస్బీ కుమారి, ఆర్అండ్బీ ఎస్ఈ భీమ్లా నాయక్, డీఈ శాంతయ్య, మున్సిపల్ కమిషనర్ లోకేష్, నీటిపారుదల శాఖ అధికారి దయాకర్, తహసీల్దార్ జయంత్, రాజన్న ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

# శివాలయానికి దర్వాజా పూజా కార్యక్రమం



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 11 (విజన్ఆంధ్ర):మహబూబాబాద్ జిల్లా మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు శనిగాపురంలో శివాలయానికి దర్వాజా పూజా కార్యక్రమం అంగరంగ వైభవంగా జరపడం జరిగింది . శనిగాపురం గ్రామంలో రామ మందిరం వద్ద వెలిసిన శివాలయానికి ఎంతో ప్రాధాన్యత ఉన్నది ఈ శివాలయము మహబూబాబాద్ నుండి హైదరాబాదుక పోయే మార్గమధ్య లో శనిగాపురం మున్సిపాలిటీ పరిధిలో కలదు .ఇక్కడ ఎంతో మంది భక్తులు ప్రతిరోజు పూజలు చేసుకుని తమ పనులకు వెళ్లి సాయంత్రం రాగానే వారి కోరికలు నెరవేరుస్తాయని భావనతో వారు ప్రతి రోజు పూజలు చేసుకుంటూ వెళ్తుంటారు దాంతో ఈ శివాలయము రామ మందిరము రోజురోజు దినదిన అభివృద్ధి చెందుతూ ఉన్నది. ఈ కార్యక్రమంలో శివాలయ నిర్మాణ దాత కందుకూరి వెంకన్న స్వర్ణ తొమ్మిదవ వార్డ్ కౌన్సిలర్ కందుకూరి సుధా మోహన్ మాజీ సర్పంచ్ గుగులోత్ రాజు నాయక్, రామాలయ అధ్యక్షుడు రాంశెట్టి వీరేందర్ కోశాధికారి చిట్టిమల్ల శ్రీను ప్రధాన కార్యదర్శి పద్మం ఉపేంద్రమ్మ ఉపాధ్యక్షులు పద్మం బిక్షపతి ఆర్గనైజింగ్ సెక్రటరీ వేల్పుల విష్ణువర్ధన్ ఉపాధ్యక్షురాలు ఆరే అరుణ ఉపాధ్యక్షుధ్యక్షులు చిట్టిమల్ల సైదులు చిట్టి మల్ల వెంకన్న కార్యదర్శి గంగాధర్ యమున బానోత్ వెంకన్న ,చిట్టిమల్ల రమాదేవి మరిపాల చంద్రయ్య చుక్క సుమన్ తదితర భక్తులు పాల్గొన్నారు.

# జలసాధన సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయండి

## పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ కో కన్వీనర్, ఆకాష

## లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులు వెంటనే ప్రారంభించాలి



షాద్ నగర్, సెప్టెంబర్ 11(విజన్ ఆంధ్ర):నాగర్ కర్నూల్ పట్టణంలోని గాంధీ పార్క్‌లో రేపు తల పెట్టిన జలసాధన సత్యాగ్రహ దీక్షకు పెద్ద ఎత్తున షాద్నగర్ నియోజకవర్గం వ్యాప్తంగా రైతులు ప్రజలు తరలిరావాలని, జేఏసీ ,ప్రజా సంఘాల నాయకులు ఆకాష్ నాయక్ పిలుపునిచ్చారు..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేపు నిర్వహించనున్న జలసాధన సత్యాగ్రహ దీక్షకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, కుల సంఘాల నాయకులు, రైతులు, మేధావులు, తెలంగాణ ఉద్యమకారులను ఆహ్వానించడం జరిగిందన్నారు. ఇది ఏ ఒక్క రాజకీయ పార్టీ సమస్య కాదని, ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజలందరి సమస్య అని ఆయన అన్నారు. పాలమూరు ప్రాంతానికి రావాల్సిన సాగునీటిని కాపాడుకోవడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయించుకోవడం కోసం ప్రజలందరూ ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. పాలమూరు లిఫ్ట్ ఇరిగేషన్ నీటిని నల్లగొండ వైపు మళ్లించే విధంగా ఉన్న డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పాలమూరు ‑ రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో అత్యంత కీలకమైన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అమలు జరిగితే పాలమూరు ప్రాంతానికి సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉందన్నారు. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి, జిల్లాను సస్యశ్యామలం చేసే వరకు అన్ని రాజకీయ పార్టీలను, ప్రజా సంఘాలను కలుపుకొని పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ ఆధ్వర్యంలో నిరంతరం ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. కాబట్టి రేపు నాగర్ కర్నూల్ పట్టణంలోని గాంధీ పార్క్‌లో నిర్వహించే జలసాధన సత్యాగ్రహ దీక్షకు రైతులు, మేధావులు, తెలంగాణ ఉద్యమకారులు, ప్రజా సంఘాల నాయకులు, కుల సంఘాల నాయకులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# పీలారంలో ఎస్ఐఆర్ నోటీసులు వచ్చిన ఓటర్లకు అవగాహన

## పోలింగ్ స్టేషన్ 117లో 302 మందికి నోటీసులు

## ఓటర్లకు అవగాహన కల్పించి తప్పులను సరిచేయడం

## గ్రామ సర్పంచ్ పట్లోళ్ళ లక్ష్మారెడ్డి, ఏఈఆర్ఓ ఎంపిడిఓ కేశబోయిన వినయ్ కుమార్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 11 ( విజన్ ఆంధ్ర ) : నోటీసులు వచ్చిన ఓటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పీలారం గ్రామ సర్పంచ్ పట్లోళ్ళ లక్ష్మారెడ్డి, ఏఈఆర్ఓ ఎంపిడిఓ కేశబోయిన వినయ్ కుమార్ సంయుక్తంగా భరోసా కల్పించారు. ఓటర్లకు వచ్చిన నోటీసులను క్షుణ్ణంగా పరిశీలించి కావలసిన ధృవపత్రాలను ఆన్లైన్లో అప్లోడ్ చేశామని అన్నారు. శుక్రవారం వికారాబాద్ మండల పరిధిలోగల పిలారం గ్రామంలో పోలింగ్ స్టేషన్ 117 లో 302 మంది ఓటర్లకు నోటీసులు వచ్చిన వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు విజన్ ఆంధ్ర జిల్లా ప్రతినిధి మాచన్నగారి గైబులు ముదిరాజ్ తో మాట్లాడారు. నోటీసులు వచ్చిన వారికి ఆన్లైన్లో ఏఏ డాక్యుమెంట్లు అప్లోడ్ చేయాలో వారు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జ్ఞానేశ్వర్ ఇతర గ్రామాల కార్యదర్శులు గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఖజానా నిర్వహణలో నిబంధనలు, పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలి

## సీనియర్ డీఏజీ ఎం. నరేష్ కుమార్



సంగారెడ్డి బ్యూరో , సెప్టెంబర్: 11(విజన్ ఆంధ్ర)తెలంగాణ రాష్ట్ర సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ ఎం. నరేష్ కుమార్ ( ఇండియన్ ఆడిట్ అండ్ అకౌంట్స్ సర్వీసెస్ అధికారి) శుక్రవారం సంగారెడ్డి జిల్లా ఖజానా కార్యాలయంలో వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈనెల 7 నుండి కొనసాగుతున్న వార్షిక ఆడిట్‌లో భాగంగా చివరి రోజున ఆయన కార్యాలయాన్ని సందర్శించి, వివిధ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌తో పాటు జిల్లాలో పనిచేస్తున్న ఏటీఓలు, ఎస్టీఓలతో ఆయన సమావేశమై ఖజానా నిర్వహణ, ఆడిట్ అంశాలు, కార్యాలయ విధులపై సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న ఆడిట్ అభ్యంతరాలు (ఔట్స్టాండింగ్ ఆడిట్ పరస్ ), ప్రస్తుత ఆడిట్ అభ్యంతరాలు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నరేష్ కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆర్థిక లావాదేవీల నిర్వహణలో నిబంధనలు, విధివిధానాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఐ ఎఫ్ ఎం ఐ యస్ పోర్టల్ ద్వారా పేపర్‌లెస్ ఆన్‌లైన్ బిల్లుల సమర్పణ జరుగుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు, సిబ్బంది విధి విధానాలను పూర్తిగా అవగాహన చేసుకొని, ఎలాంటి లోపాలకు తావులేకుండా బిల్లుల ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. పెన్షనర్లకు సంబంధించిన పెన్షన్ల చెల్లింపుల ప్రక్రియను సక్రమంగా, సకాలంలో నిర్వహించాలని, అదేవిధంగా నెలవారీ అకౌంట్స్ నిర్ణీత గడువులోగా అకౌంటెంట్ జనరల్ కార్యాలయానికి సమర్పించాలని సూచించారు. ఖజానా కార్యాలయాల్లో రికార్డులు, రిజిస్టర్లు, ఆర్థిక లావాదేవీల వివరాలను ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేసి భద్రపరచాలని, ప్రభుత్వ నిధుల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం, ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని సూచించారు. జిల్లా ఖజానా కార్యాలయంలో రికార్డుల నిర్వహణ, విధుల అమలు, ఆడిట్ ప్రక్రియకు సంబంధించి చేపడుతున్న చర్యలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, ఏ టి ఓ లు, ఎస్టీఓలు సంపత్ స్వరూప్, రాజారెడ్డి, శారద, ఏటీఓలు, జిల్లా ఖజానా కార్యాలయంలోని వివిధ విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

# అంటరానితనాన్ని మళ్లీ తెరపైకి తెస్తున్న బీఆర్ఎస్

## స్పీకర్‌పై వ్యాఖ్యలకు బీఆర్ఎస్ నేతలు క్షమాపణ చెప్పాలి

## రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్‌షావలి ఆచారి



గద్వాల సెప్టెంబర్ 11 (విజన్ ఆంధ్ర బ్యూరో)తెలంగాణలో అంటరానితనాన్ని రూపుమాపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుంటే, బీఆర్ఎస్ మరోసారి అంటరానితనాన్ని తెరపైకి తెచ్చి వివాదాలకు కారణమవడం విడ్డూరంగా ఉందని తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్షావలి ఆచారి విమర్శించారు. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్‌షావలి ఆచారి మీడియా సమావేశంలో మాట్లాడుతూఅసెంబ్లీ సమావేశాల సందర్భంగా స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యల విషయంలో బీఆర్ఎస్ ముఖ్యనేతలు ఎందుకు స్పందించడం లేదని ఆయన ప్రశ్నించారు. దళిత ముఖ్యమంత్రి, మూడు ఎకరాల భూమి, దళితులపై మమకారం ఉందని చెప్పుకునే బీఆర్ఎస్. పదేళ్ల పాలనలో దళితులకు చేసిన న్యాయం ఏమిటో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు మరోసారి అంటరానితనం అంశాన్ని తెరపైకి తీసుకురావడం సిగ్గుచేటని షేక్‌షావలి ఆచారి మండిపడ్డారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని అనుసరించి ప్రభుత్వాలు పాలన సాగిస్తున్న సమయంలో బిఆర్ఎస్, బిజెపి ద్వంద్వ వైఖరితో దళితుల పట్ల తమ వైఖరిని బయటపెట్టుకుంటున్నాయని ఆరోపించారు. అసెంబ్లీ స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేతలు క్షమాపణ చెప్పాలని, తమ వైఖరిని మార్చుకోవాలని కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నట్లు షేక్‌షావలి ఆచారి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 1855 ఏళ్ల బీసీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ

## -ఈ నెల 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

## -జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



సంగారెడ్డి బ్యూరో,సెప్టెంబర్ :11(విజన్ ఆంధ్ర )జిల్లాలోని బీసీ మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రోత్సాహం అందించేందుకు ఇంటింటికి ఇందిరమ్మ కుట్టు మిషన్ల పంపిణీ పథకం కింద ఉచిత కుట్టు మిషన్ల పంపిణీకి అర్హులైన మహిళలు సెప్టెంబర్ 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన మహిళలు ట్ర్జిజూ:"/స్త్రశీఎఎం.ఎస్త్రస్త్ర.స్త్రశీజ.అఅ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకొనుటకు ఈ నెల 15 చివరి తేదీ అని తెలిపారు. దరఖాస్తుదారుల వయస్సు 18 నిండి 55 సంవత్సరాల లోపు ఉండాలని, నిరుద్యోగ మహిళలు, నిరుపేదలు, నిరాధారణకు గురైన వితంతు, ఒంటరి, వికలాంగులు, అనాధ మహిళలకు, టైలరింగ్ ట్రైనింగ్ సర్టిఫికెట్ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. నివాసం, కులం, ఆదాయం, ఆధార్, విద్యార్హత, టైలరింగ్ శిక్షణకు సంబంధించిన ధ్రువపత్రాలు, తెల్ల రేషన్ కార్డ్ లేదా ఆహార భద్రత కార్డు కలిగి ఉండాలని, కనీస అక్షరాస్యత తప్పనిసరి అని, ఎక్కువ దరఖాస్తులు వస్తే కనీస విద్యార్హత ఐదవ తరగతి పాసైన వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. కుటుంబంలో ఒకరికి మాత్రమే అవకాశం ఉంటుందని, కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణులకు 1.50 లక్షలు, పట్టణ వాసులకు రెండు లక్షల లోపు ఉన్నవారు అర్హులని తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో బీసీ స్వయం ఉపాధి పథకం కింద ఆర్థిక లబ్ధి పొందిన వారు అర్హులు కాదని స్పష్టం చేశారు. దరఖాస్తుదారులు దరఖాస్తులను సంబంధిత వెబ్సైట్ నుండి డౌన్లోడ్ చేసుకుని కుల, ఆదాయ, నివాస, ఆధార్ కార్డు, రేషన్ కార్డ్, విద్యార్హతలు, టైలరింగ్ శిక్షణ, అనుభవం తదితర ధ్రువీకరణ పత్రాలతో గ్రామీణులు సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారికి, పట్టణ ప్రాంతవాసులు సంబంధిత మున్సిపల్ కమిషనర్లకు ఈ నెల 15లోగా దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ సూచించారు.

# భూ రీ-సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

## రైతులకు సమాచారం ఇచ్చాకే సర్వే చేపట్టాలి

## జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 11 (విజన్ ఆంధ్ర)భూ రీ-సర్వే ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో శుక్రవారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్‌తో కలిసి క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న రీ-సర్వేను ఆయన పరిశీలించారు. రోవర్ల వినియోగం, మ్యాప్‌లు, కొలతల విధానాన్ని క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. సర్వేకు వెళ్లే ముందు సంబంధిత రైతులకు ముందస్తుగా సమాచారం అందించాలి. రైతులు అందుబాటులో ఉన్నప్పుడే, వారి సమక్షంలోనే సర్వే చేపట్టాలి. భూ రీ-సర్వే ప్రారంభించే ముందే భూముల సరిహద్దులను (బౌండరీలను) స్పష్టంగా నిర్దేశించి, ఆ తర్వాత కొలతలు ప్రారంభించాలి. సాంకేతిక పరికరాలను సక్రమంగా వినియోగిస్తూ కొలతలు, రికార్డులను కచ్చితత్వంతో నమోదు చేయాలి. సర్వే వేగవంతం చేసేందుకు అవసరమైన రోవర్లను కొనుగోలు చేయాలని జిల్లా సర్వే అధికారికి సూచించారు. సర్వే సమయంలో రైతులకు ఉత్పన్నమయ్యే సందేహాలు, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం వెంటనే నివృత్తి చేయాలి. సర్వే ప్రాముఖ్యతపై కలెక్టర్ స్థానిక గ్రామస్తులతో మాట్లాడారు. భూ సరిహద్దులు, కొలతల నవీకరణ ద్వారా భవిష్యత్తులో వచ్చే భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని వివరించారు. రీ-సర్వే పారదర్శకంగా పూర్తయ్యేందుకు గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు అధికారులకు సహకరించాలని కోరారు.ఁఈ కార్యక్రమంలో సర్వే ఏడీ శ్రీనివాసులు, తహసిల్దార్ సుగుణ, ఎంపీడీవో విజయసింహారెడ్డి, గ్రామ సర్పంచ్ రవీందర్, రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్లు పాల్గొన్నారు.

## కొమిరెడ్డిపల్లిలో రీసర్వే పనులను పరిశీలించిన రెవెన్యూ అదనపు కలెక్టర్ హరిప్రియ

మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 11(విజన్ ఆంధ్ర)మహబూబ్‌నగర్ రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ శుక్రవారం ఆర్డీఓ నవీన్తో కలిసి మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లి గ్రామంలో కొనసాగుతున్న రీసర్వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల సర్వేయర్ ఆధ్వర్యంలో చేపడుతున్న రీసర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆమె, పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రీసర్వే పనులను నిర్దేశిత నిబంధనలు, మార్గదర్శకాల మేరకు పకడ్బందీగా నిర్వహించి, వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రీసర్వేలో భూ వివరాల నమోదును క్షుణ్ణంగా పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్దేశిత గడువులోగా రీసర్వే ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మూసాపేట మండల తహసీల్దార్, ఎంపీడీఓ, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు (=×ం), మండల సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రాచీన గ్రంథాలు, చేతివ్రాతల భద్రతకు డిజిటలైజేషన్

## అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) యన్. ఖీమ్యా నాయక్



ఁవనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 11 (విజన్ ఆంధ్ర) వనపర్తి జిల్లాలోని ఆధ్యాత్మిక, ఆయుర్వేద, ప్రాచీన చరిత్రకు సంబంధించిన ప్రతిష్టాత్మక చేతివ్రాతలను సేకరించి వాటిని డిజిటలైజేషన్ చేసేందుకు జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) యన్. ఖీమ్యా నాయక్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన కమిటీ తొలి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఁజిల్లా ప్రజలు తమ ఇళ్లలో భద్రపరుచుకున్న ప్రాచీన చేతి వ్రాతలు, దేవాలయాలు, మఠాలు, దర్గాల్లో ఉన్న వారసత్వ గ్రంథాలు, ఆయుర్వేద గ్రంథాలను సత్వరమే గుర్తించాలని అధికారులకు సూచించారు. వాటిని సేకరించి, సురక్షితంగా డిజిటలైజేషన్ పూర్తి చేసిన అనంతరం తిరిగి యాజమాన్యాలకు అందజేస్తామని స్పష్టం చేశారు.ఁవిద్యార్థుల ద్వారా సేకరణప్రాచీన గ్రంథాలు, చేతివ్రాతల గుర్తింపులో విద్యార్థులు కీలక పాత్ర పోషించవచ్చని, అందుకే కళాశాల ప్రిన్సిపాళ్లను ఈ కమిటీలో సభ్యులుగా చేర్చామని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రిన్సిపాళ్లు తమ కళాశాల విద్యార్థుల ద్వారా గ్రామాల్లోని పురాతన పుస్తకాల వివరాలను ముందుగా నిర్ణీత ప్రొఫార్మాలో సేకరించాలని ఆదేశించారు.ఁఈ సమావేశంలో ఇంటర్మీడియట్ నోడల్ అధికారి నరేందర్ కుమార్, ఎఫ్-సెక్షన్ సూపరింటెండెంట్ సునీత, పలు డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రజాపాలన దినోత్సవం నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ రాజర్షిషా



ఆదిలాబాద్, సెప్టెంబర్ 11 (విజన్ ఆంధ్ర): ఈ నెల 17న నిర్వహించనున్న 'తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ' వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వేడుకల నిర్వహణ, ముందస్తు ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 17 న కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రజాపాలన దినోత్సవ ప్రధాన వేడుకలు జరుగుతాయని, ఈ వేడుకల నిర్వహణకు సంబంధించి వివిధ శాఖల అధికారులకు బాధ్యతలు కేటాయించినట్లు తెలిపారు. కలెక్టరేట్ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్‌ను, ప్రొటోకాల్, వీఐపీ ఆహ్వానం, డయాస్ ఏర్పాట్లను ఆర్డీవో, తహసీల్దార్లు సమన్వయంతో పూర్తి చేయాలని ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరా, వేదిక పూల అలంకరణ, అగ్నిమాపక వాహనం అందుబాటులో ఉంచడం, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, శాంతి భద్రత, బందోబస్తు ఏర్పాట్లు తదితర ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఆర్.ఎస్.చిత్రు, డీఆర్వో స్రవంతి, జడ్పీ సీఈవో రవి, పర్యవేక్షకురాలు శైలజతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళా ఎమ్మెల్యేలపై అసభ్య ప్రవర్తనపై ఫిర్యాదు

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబరు11:(విజన్ ఆంధ్ర) అసెంబ్లీ ప్రాంగణంలో మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అసభ్యంగా, అమానవీయంగా వ్యవహరించడంపై బీఆర్ఎస్ పార్టీ నేతలు, ఎమ్మెల్యేలు ఢిల్లీలో జాతీయ మహిళా కమిషన్‌ను ఆశ్రయించారు. ఎమ్మెల్యే కోవా లక్ష్మితో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం జాతీయ మహిళా కమిషన్ అధ్యక్షురాలు విజయ కిషోర్ రహత్కర్‌ను ప్రత్యేకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. అసెంబ్లీ ప్రాంగణంలో తమపై జరిగిన దాడి, పోలీసులు వ్యవహరించిన తీరును కమిషన్ అధ్యక్షురాలి దృష్టికి తీసుకెళ్లారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల అనుచితంగా ప్రవర్తించిన పోలీసులపై తక్షణమే విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళా ప్రజాప్రతినిధుల హక్కులు, గౌరవానికి భంగం కలిగించేలా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను కూడా బీఆర్ఎస్ నేతలు కలిసి ఘటనకు సంబంధించిన వివరాలను వివరించారు. మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడి, పోలీసుల వ్యవహారశైలిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను శిక్షించాలని కోరారు.

# జ్వరంతో వస్తే డెంగ్యూ పరీక్షలు చేయాల్సిందే

**కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**ఖిల్లాఘనపూర్ సీహెచ్‌సీ, ఎస్సీ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**

**శిథిలావస్థలో ఉన్న వసతి గృహ నూతన భవనానికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశం**



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 11 (విజన్ ఆంధ్ర)ప్రభుత్వ ఆస్పత్రికి జ్వరంతో వచ్చే ప్రతి రోగికీ తప్పనిసరిగా డెంగ్యూ పరీక్షలు నిర్వహించాలని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి వైద్యులను ఆదేశించారు. శుక్రవారం వనపర్తి జిల్లా ఖిల్లాఘనపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)తో పాటు ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆస్పత్రి తనిఖీ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ల్యాబ్, ఎక్స్‌రే యంత్రాలను నిరుపయోగంగా ఉంచకుండా పూర్తిస్థాయిలో వినియోగించి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలి. టీబీ అనుమానితులను ముందస్తుగానే గుర్తించి, విస్తృతంగా ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించి తగిన చికిత్స ప్రారంభించాలి. ఆస్పత్రిలో మందుల కొరత లేకుండా ఎప్పటికప్పుడు నిల్వలను పర్యవేక్షించాలి. ప్రసవాల కోసం వచ్చే గర్భిణులకు మెరుగైన వసతులు కల్పించి, అత్యవసర వైద్యానికి సిబ్బంది ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలి**శిథిల భవనం స్థానంలో నూతన ఎస్సీ హాస్టల్**అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహాన్ని పరిశీలించిన కలెక్టర్, భవనం శిథిలావస్థకు చేరడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నూతన భవన నిర్మాణానికి అవసరమైన పూర్తి వివరాలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని ఎస్సీ సంక్షేమ అధికారిని ఆదేశించారు. కొత్త భవనం పూర్తయ్యే వరకు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణమే అనువైన తాత్కాలిక భవనాన్ని గుర్తించి వసతి కల్పించాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డిఎమ్‌హెచ్‌వో) భాస్కర్ నాయక్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రాంజీరావు, స్థానిక తహసిల్దార్, ఎంపీడీవో, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అలీసాగర్ అభివృద్ధి కి చర్యలు

**అలీ సాగర్ ను సందర్శించిన అదన కలెక్టర్ భుజంగరావు**



నిజామాబాద్ సెప్టెంబర్11:(విజన్ ఆంధ్ర)నిజామాబాద్ జిల్లాలో గల ప్రముఖ పర్యాటక ప్రదేశము అలీసాగర్ అభివృద్ధి కి చర్యలు తీసుకొనున్నట్లు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) భుజంగరావు తెలిపారు .క్షేత్ర పర్యటనలో భాగంగా అలీ సాగర్ ను శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి పార్కు, ఉద్యానవనశీ బోటింగ్ పాయింట్, హరిత హోటల్ ను పరిశీలించారు..హరిత హోటల్ లో పర్యాటకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.అలాగే బోటింగ్ సిబ్బందికి పర్యాటకుల బోటింగ్ సందర్భంగా తీసుకోవలసిన జాగ్రత్తలను గూర్చి వారికి వివరించారు.రాబోవు రోజుల్లో అలీసాగర్ ను అభివృద్ధి పరచడానికి కాంపౌండ్ వాల్, తీగల వంతెన, రాత్రి విడిది కోసం ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బోట్ లో తిరిగారు.ఆయన వెంట ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ సందీప్,జిల్లా పర్యాటక అభివృద్ధి అధికారి పవన్ కుమార్ లు పాల్గొన్నారు.

# గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి

## మండపాల అనుమతి తప్పనిసరి ఆర్డీవో సుబ్రహ్మణ్యం




వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 11 (విజన్ ఆంధ్ర) గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని ఆర్డీవో సుబ్రహ్మణ్యం సూచించారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో ఉత్సవాల నిర్వహణపై శాంతి కమిటీ (పీస్ కమిటీ) సమావేశం నిర్వహించారు.అనుమతి లేకుండా మండపాలు వద్దువిగ్రహాల ప్రతిష్ఠాపన కోసం నిర్వాహకులు సంబంధిత శాఖల నుంచి తప్పనిసరిగా ముందస్తు అనుమతులు పొందాలని ఆర్డీవో స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా మండపాలు ఏర్పాటు చేయరాదని, ప్రజలకు, వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా చూడాలని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీస్ శాఖతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు.**విద్యుత్ భద్రత పాటించాలి**మండపాల వద్ద నాణ్యమైన విద్యుత్ వైర్లను మాత్రమే వాడాలని, షార్ట్ సర్క్యూట్‌ల ప్రమాదాలు చోటుచేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ శాఖ అధికారుల ఆదేశాలు తప్పక పాటించాలన్నారు. నిమజ్జన ప్రాంతాల్లోనూ విద్యుత్ సరఫరా, ఇతర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.డీజేల శబ్ద పరిమితి తప్పనిసరిఉత్సవాల్లో డీజేలను నిబంధనలకు అనుగుణంగా మాత్రమే వినియోగించాలని ఆర్డీవో స్పష్టం చేశారు. అధిక శబ్దంతో వృద్ధులు, చిన్నారులు, విద్యార్థులు, ఆసుపత్రుల్లోని రోగులకు ఇబ్బందులు కలగకుండా శబ్ద పరిమితులను పాటించాలన్నారు.పారిశుద్ధ్యం, భద్రతపై ప్రత్యేక దృష్టిమండపాలు, ప్రధాన రహదారులు, నిమజ్జన ప్రాంతాల్లో చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని, తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించాలని సూచించారు. నిమజ్జనం రోజున రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కాగా, నిమజ్జనం రోజున వైన్ షాపులు మూసి వేయించనున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఉత్సవాలను ఐక్యత, సోదరభావంతో జరుపుకోవాలని ఆర్డీవో కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మాధవి, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, పోలీస్, విద్యుత్, మున్సిపల్, పంచాయతీ, పారిశుద్ధ్య శాఖల అధికారులు, మసీద్ కమిటీ, శాంతి కమిటీ సభ్యులు పాల్గొన్నారు

# గురుకులాల్లో నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు అందించాలి

**చిట్యాల జ్యోతిబా పూలే బాలుర పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ వినోద్ కుమార్**

**పదో తరగతి విద్యార్థులకు స్వయంగా తెలుగు బోధించిన అదనపు కలెక్టర్**



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 11(విజన్ ఆంధ్ర)ప్రభుత్వ గురుకుల విద్యాసంస్థల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు, పౌష్టికాహారం అందించాలని వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం వనపర్తి మండలం చిట్యాల గ్రామంలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పరిపాలనా అంశాలు, విద్యా ప్రమాణాలు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ముందుగా పాఠశాలలోని ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లు, విద్యార్థుల నమోదు వివరాలు, సరుకుల నిల్వ స్టాక్ రికార్డులు, భోజన నిర్వహణ పుస్తకాలను అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా, పక్కాగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. వారి చదువు, వసతి, భోజన సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకుని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని యాజమాన్యానికి సూచించారు.పదో తరగతి విద్యార్థులకు పాఠం బోధనతనిఖీలో భాగంగా పదో తరగతి గదికి వెళ్లిన అదనపు కలెక్టర్ విద్యార్థులకు స్వయంగా తెలుగు పాఠ్యాంశాన్ని బోధించారు. అనంతరం పాఠానికి సంబంధించి పలు ప్రశ్నలు అడిగి వారి అవగాహన స్థాయిని పరిశీలించారు. విద్యార్థులు ఉత్సాహంగా సమాధానాలు ఇవ్వడంతో వారిని అభినందించారు. రాబోయే పబ్లిక్ పరీక్షల్లో పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఇప్పటి నుంచే ప్రత్యేక ప్రణాళిక రూపొందించి బోధన కొనసాగించాలని స్పష్టం చేశారు. పాఠశాలల్లో పరిశుభ్రమైన వాతావరణం, పౌష్టికాహారం అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేసి విద్యార్థులలో ఉన్న ప్రతిభను వెలికితీయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో గణేశ్ ఉత్సవాలు నిర్వహించాలి

**జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి**

**డీజేలకు అనుమతి లేదు.. మండపాల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరి**

**సర్వమత పెద్దలు, ఉత్సవ కమిటీలతో సమన్వయ సమావేశం**




వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 11 (విజన్ ఆంధ్ర) జిల్లా వ్యాప్తంగా గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత, సామరస్య వాతావరణంలో జరుపుకోవాలని వనపర్తి జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం జిల్లా పోలీసు కార్యాలయ సమావేశ భవనంలో మండపాల నిర్వాహకులు, హిందూ, ముస్లిం, క్రైస్తవ మత పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో శాంతి సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వానికి భారతదేశం ప్రతీక అని, అన్ని మతాలను ఆదరిస్తూ పండుగలు జరుపుకునే మంచి సంస్కృతి వనపర్తి జిల్లాలో ఉందన్నారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు యంత్రాంగం నిరంతరం పెట్రోలింగ్, బందోబస్తు నిర్వహిస్తుందని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని, ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆన్‌లైన్‌లో నమోదు తప్పనిసరిమండప నిర్వాహకులు ప్రతి వినాయక విగ్రహ ఏర్పాటుకు పోలీసు శాఖ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్పీ సూచించారు. విగ్రహం ఎత్తు, ప్రదేశం, నిమజ్జనం తేదీ వంటి వివరాలు నమోదు చేస్తే సంబంధిత స్టేషన్ అధికారులు అనుమతులు జారీ చేస్తారని తెలిపారు.**మండప నిర్వాహకులకు కీలక సూచనలు** మండపాల వద్ద, ప్రధాన ఆలయాలు, మసీదులు, చర్చీల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. మండపం వద్ద 24 గంటలూ కనీసం ఇద్దరు వాలంటీర్లు అందుబాటులో ఉండాలి. మండపాల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ డిజేలకు అనుమతి లేదు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం రాత్రి 10 గంటల వరకే తక్కువ శబ్దంతో స్పీకర్లు వాడాలి. మద్యం సేవించి మండపాల వద్దకు రాకుండా చూడాలి. మండపాల వద్ద టపాకాయలు కాల్చరాదు. రాకపోకలకు ఇబ్బంది లేకుండా మండపాలు, భక్తుల కోసం క్యూలైన్లు ఏర్పాటు చేయాలి. కమిటీ సభ్యుల పేర్లు, ఫోన్ నంబర్లతో కూడిన ఫ్లెక్సీని మండపంలో ప్రదర్శించాలి. పోలీసు తనిఖీల కోసం విధిగా 'పాయింట్ పుస్తకం' అందుబాటులో ఉంచాలి. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, వనపర్తి సీఐ సుగంధ రత్నం, కొత్తకోట సీఐ రమేష్, ఎస్‌బీ సీఐ నరేష్, జిల్లా ఎస్సైలు, పోలీసు సిబ్బంది, ప్రజాప్రతినిధులు, వివిధ మతాల పెద్దలు పాల్గొన్నారు.

# ఆరోగ్యకరమైన సమాజానికి పోషకాహారమే పునాది

**వాల్ పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ ఆదర్శ్ సురభి**



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 11 (విజన్ ఆంధ్ర) చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పోషకాహార లోపానికి గురికాకుండా అవసరమైన పౌష్టికాహారం అందేలా ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో 9వ జాతీయ పోషణ మాసం కార్యక్రమాల్లో భాగంగా రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి పోషకాహారమే ప్రాథమిక పునాది అని స్పష్టం చేశారు. పోషకాహార లోపాన్ని ప్రారంభ దశలోనే గుర్తించి, అవసరమైన వారికి తగిన వైద్య, పోషకాహార సేవలు అందించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం అర్హులైన ప్రతి ఒక్కరికీ సక్రమంగా అందేలా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. స్థానికంగా లభించే పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాల వినియోగంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు.మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పోషణ మాసం కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పోషకాహారం ప్రాముఖ్యతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి సుధారాణి, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వివాదాల పరిష్కారానికి లోక్ అదాలత్ సువర్ణ అవకాశం

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాకరాజు శ్రీనివాసరావు**

వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 11(విజన్ ఆంధ్ర)న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న వివాదాల పరిష్కారానికి రేపు నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ ఒక సువర్ణ అవకాశమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ బాకరాజు శ్రీనివాసరావు తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. సివిల్ వివాదాలు, వివాహ సంబంధిత కేసులు మోటార్ ప్రమాద క్లెయిమ్‌లు చెక్ బౌన్స్ కేసులు మరియు రాజీపడదగిన క్రిమినల్ కేసులు ఏళ్ల తరబడి నడిచే కేసులకు తక్షణమే ముగింపు లభిస్తుంది.కోర్టు ఫీజు వాపస్: లోక్ అదాలత్‌కు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. కేసు వేసే సమయంలో చెల్లించిన కోర్టు ఫీజును కూడా తిరిగి ఇచ్చివేస్తారు.లోక్ అదాలత్ ఇచ్చే తీర్పుకు వ్యతిరేకంగా ఉన్నత న్యాయస్థానాల్లో అప్పీలు చేయడానికి అవకాశం ఉండదు.

# మట్టి గణపతులనే పూజిద్దాం

**పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత**

**ఐడీఓసీలో విగ్రహాల పంపిణీ చేసిన అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 11 (విజన్ ఆంధ్ర)పర్యావరణ పరిరక్షణలో భాగంగా వినాయక చవితి పండుగకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్టించి పూజించాలని వనపర్తి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ పిలుపునిచ్చారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ (ఐడీఓసీ) ఆవరణలో ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విగ్రహాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... పండుగలను భక్తిశ్రద్ధలతో పాటు పర్యావరణహితంగా జరుపుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ), రసాయన రంగులతో కూడిన విగ్రహాల వల్ల నీటి వనరులు తీవ్రంగా కలుషితమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. మట్టి విగ్రహాలను ప్రతిష్టించి నిమజ్జనం చేయడం వల్ల అవి సులభంగా నీటిలో కరిగిపోతాయని, జల కాలుష్యాన్ని అరికట్టవచ్చని తెలిపారు. ప్రజల్లో పర్యావరణంపై అవగాహన పెంచేందుకు కాలుష్య నియంత్రణ మండలి ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. “మట్టి వినాయకుడు - స్వచ్ఛమైన పర్యావరణం“ అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ సమాజంలోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ యాదయ్య, జిల్లా కార్మిక శాఖ అధికారి చుక్క రవి, కాలుష్య నియంత్రణ మండలి జిల్లా నోడల్ అధికారి అనిల్ కుమార్, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చిట్యాల బీసీ కళాశాలకు 10 కోట్ల నిధులు

**జీవో ఆర్టీ నెం. 93 ద్వారా పరిపాలనా అనుమతులు జారీ**

**సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులకు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ధన్యవాదాలు**





వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 11(విజన్ ఆంధ్ర) వనపర్తి మండలం చిట్యాలలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ నివాస బాలుర జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం 10 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ జీవో ఆర్టీ నెం. 93 (తేదీ: 16-07-2026) ద్వారా పరిపాలనా అనుమతులు జారీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చిందిప్రత్యేక చొరవతో నిధుల సాధనగ్రామీణ ప్రాంత బీసీ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు అందించాలనే లక్ష్యంతో వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ఈ నిధులను సాధించారు. ప్రస్తుతం ఉన్న బాలుర పాఠశాల ప్రాంగణంలోని స్థలంలోనే ఈ నూతన కళాశాల భవనాన్ని నిర్మించనున్నారు. ఈ నిర్మాణ పనులను తెలంగాణ విద్యా, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ద్వారా చేపడుతున్నట్లు ప్రభుత్వం సెప్టెంబర్ 5న స్పష్టం చేసింది.ప్రభుత్వానికి ఎమ్మెల్యే కృతజ్ఞతలురూ. 10 కోట్ల నిధులు కేటాయించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఈ నిధుల విడుదలకు సహకరించిన జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవిలకు కృతజ్ఞతలు తెలియజేశారు.సొంత భవనం అందుబాటులోకి వస్తే గ్రామీణ ప్రాంత బీసీ విద్యార్థులు ఇంటర్మీడియట్ విద్యను మరింత సౌకర్యవంతంగా పూర్తి చేసి, ఉన్నత విద్య వైపు అడుగులు వేయడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# కళాశాల భవన నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరు




వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 11(విజన్ ఆంధ్ర)చిట్యాల ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాల ప్రాంగణంలో నిర్మించనున్న ఎంజేపీ గురుకుల జూనియర్ కళాశాల సొంత భవన నిర్మాణానికి రూ. 10 కోట్లు మంజూరయ్యాయి. నిధుల మంజూరుకు ప్రత్యేకంగా కృషి చేసిన వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, ఎంజేపీ సొసైటీ కార్యదర్శి బడుగు సైదులుతో పాటు సహకరించిన ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులకు కళాశాల యంత్రాంగం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది. సొంత భవన నిర్మాణానికి భారీగా నిధులు కేటాయించడం పట్ల ఉమ్మడి మహబూబ్‌నగర్ ఆర్‌సీవో శ్రీనివాస్ గౌడ్, డీసీవో శ్రీవేణి, కళాశాల ప్రిన్సిపాల్ గురువయ్య గౌడ్, అధ్యాపక బృందం మరియు విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. భవన నిర్మాణం పూర్తయితే కళాశాల అభివృద్ధికి మరింత ఊతం లభించడమే కాకుండా, విద్యార్థులకు నాణ్యమైన, మెరుగైన విద్యా వసతులు అందుబాటులోకి వస్తాయని వారు పేర్కొన్నారు.

# జ్ఞాన భారత్ మిషన్ కు సహకరించాలి

## చారిత్రక సంపద డిజిటలైజేషన్

## అదనపు కలెక్టర్ నర్సింగరావు




గద్వాల సెప్టెంబర్ 11 (విజన్ ఆంధ్ర బ్యూరో)పురాతన మాన్య స్క్రిప్టులు, తాళపత్ర గ్రంధాలు, శాసనాలు, గోడలపై లిఖితాలు, ఇతర చారిత్రక, సాంస్కృతిక, వారసత్వ సంపదను గుర్తించి డిజిటలైజేషన్ చేసేందుకు జ్ఞాన భారత్ మిషన్ ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని జిల్లావాసులు సహకరించాల్సిందిగా అదనపు కలెక్టర్ నర్సింగరావు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మిషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గద్వాలలోని మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడారు. జిల్లాకు చెందిన పరిశోధకులు, చరిత్రకారులు, సాహితీవేత్తలు తమ వద్ద గ్రంధాలు, శాసనాలు, తదితర చారిత్రాత్మక సంపద ఉంటే ఇవ్వాలని, సంబంధిత అధికారులు వాటిని డిజిటలైజేషన్ చేసి తిరిగి ఇస్తారన్నారు. ఈనెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవంను పురస్కరించుకొని జిల్లాలోని 31 యువ టూరిజం క్లబ్ ల ఆధ్వర్యంలో వివిధ పోటీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని చారిత్రక, సాంస్కృతిక, పర్యాటక వారసత్వాన్ని పరిరక్షిస్తూ పర్యాటక రంగ అభివృద్ధిలో యువతను భాగస్వామ్యం చేసే విధంగా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఈ సమావేశంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మనోజ్ కుమార్ రెడ్డి, జిల్లా పర్యటకశాఖ అధికారి రామలింగేశ్వర గౌడ్, ఇంటర్ నోడల్ అధికారి హృదయ రాజ్, డిఈవో విజయలక్ష్మి, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్.డి.ఎ,ఎన్ఏ, సీడీఎస్ పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

**ప్రతి సెషన్ పరీక్షకు అరగంట ముందు గేట్లు మూసివేత**

**పరీక్షలు రాసే అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి**

**హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 11 (విజన్ ఆంధ్ర)హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించిన కలెక్టర్ఈ నెల 13వ తేదీన ( ఆదివారం)నిర్వహించే నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నావల్ అకాడమీ ఎగ్జామ్- 2, కంబైన్డ్ డిఫెన్స్ సర్వీస్ -2 పరీక్షల నిర్వహణకు పరీక్షా కేంద్రాలలో అధికారులు సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎన్ డి ఎ, ఎన్ఏ, కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశంలో పరీక్షలు జరిగే హనుమకొండ సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, ప్రభుత్వ పింగిళి డిగ్రీ, పీజీ కళాశాలలో పరీక్షల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను గురించి సంబంధిత అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ పరీక్షలు జరుగుతున్న దృష్ట్యా పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఉండాలని, అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో వైద్య సదుపాయం ఉ ండేలా చూసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు.పరీక్ష నిర్వహణలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. పరీక్షా గదుల నిర్వహణ, తాగునీటి కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎన్డీఏ, నావల్ అకాడమీ పరీక్ష ఈనెల 13న ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 4:30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, అదేవిధంగా వడ్డేపల్లి లోని పింగిళి ప్రభుత్వ బాలికల డిగ్రీ, పీజీ కళాశాలలో సిడిఎస్ పరీక్ష ఉదయం 9 నుండి 11 గంటల వరకు, మధ్యాహ్నం 12:30 నుండి 2:30 గంటల వరకు, సాయంత్రం 4 నుండి 6 గంటల వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. పరీక్షలను అధికారులు సమన్వయంతో ప్రశాంతంగా, సజావుగా సాగే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో పరీక్షలు ఏర్పాట్లకు సంబంధించి కేంద్ర పరిశీలకులు ఉమేష్ మీనా, రాష్ట్ర పరిశీలకులు సురేష్ బాబు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అధికారులతో మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, కలెక్టరేట్ ఏవో గౌరీ శంకర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, మై భారత్ కోఆర్డినేటర్ భూక్య సంజీవ్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ జ్యోతి, పింగిళి కళాశాల నుండి డాక్టర్ సుహాసిని, పోలీస్ శాఖ నుండి ఎస్సై ప్రసాద్, విద్యుత్ శాఖ ఏఈ అలేఖ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ముచ్చటగా మూడు రోజులు అసెంబ్లీకి కేసీఆర్

**24 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం**

**టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఇందిర శోభన్**

**బీఆర్ఎస్ పార్టీ కి రాష్ట్రలో పుట్టగతులు ఉండవు**




నిజామాబాద్ సెప్టెంబర్11:( విజన్ ఆంధ్ర) కేసీఆర్ ముచ్చటగా మూడు రోజులు అసెంబ్లీకి వచ్చి,24 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేశారనీ టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఇందిర శోభన్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ కి రాష్ట్రలో పుట్టగతులు ఉండవని జిల్లా అధ్యక్షులు కాట్ పల్లి నగేష్ రెడ్డి అన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు కాట్ పల్లి నగేష్ రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఇందిర శోభన్ విలేకరుల సమావేశం నిర్వహించారు.రాష్ట్ర అధికార ప్రతినిధి ఇందిర శోభన్ మాట్లాడుతూ.. ప్రతి పక్ష నాయకుడిగా కేసీఆర్ అసెంబ్లీకి రాకుండా ప్రజాధనం వృధా చేస్తున్న తీరును ప్రజలు గమనిస్తున్నారన్నారు.ఇప్పటి వరకు దాదాపు 24కోట్లు ఖర్చు చేసారని, కేవలం వెయ్యి రోజుల్లో 3రోజులు మాత్రమే అసెంబ్లీకి వచ్చినటువంటి ప్రతిపక్ష నాయకుడు ఉండటం మనకు సిగ్గుచేటన్నారు. బి ఆర్ ఎస్ అధికారంలోకి రాకముందు రాష్ట్ర ఆర్థిక స్థితి బాగుండేదని కెసిఆర్ వచ్చాక రాష్ట్రమును అప్పుల తెలంగాణగా మార్చారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పులను చెల్లిస్తూ , సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తుందని ఇవి ప్రతి పక్ష నాయకులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు? తెలంగాణలో ఉన్న ప్రతి గ్రామంలో ఉన్న ప్రజలకు కెసిఆర్ గురించి బి ఆర్ ఎస్ గురించి తెలిసేలా కాంగ్రెస్ నాయకులు వివరించాలన్నారు. వెయ్యి రోజుల పాలనను అసెంబ్లీలో చర్చిస్తారనే ఉద్దేశ్యంతో కేటీఆర్, హరీష్ రావ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీ ముందు ఇష్టం వచ్చినట్లు వ్యవహరించరన్నారు. స్పీకర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసారని, మహిళా పోలీసుల ముందు చొక్కాలు విప్పి నీచంగా ప్రవర్తించినటువంటి వారిని తెలంగాణ సమాజం క్షమించదన్నారు. సబిత, సునీత లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మి లను ను అడ్డం పెట్టుకొని బి ఆర్ ఎస్ డ్రామాలు చేస్తుందని, వీళ్ళు ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీలో అధికారం అనుభవించి ఆ పార్టీ లోకి వెళ్లారని, ఇప్పటికయినా వీళ్ళు ఆ పార్టీ మాయలో పడి తెలంగాణ ప్రజలకు మోసం చేయకుండా ఉండాలన్నారు. బీజేపీ ప్రభుత్వం కూడా దళితుల పట్ల కపట ప్రేమ చూపుతుందని, బీజేపీ , బి ఆర్ ఎస్ రెండు ఒకే ధోరణిలో వెళ్తున్నాయని, రోబోయే రోజుల్లో ఆ పార్టీ లకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ సందర్బంగా నగేష్ రెడ్డి మాట్లాడుతూ ..మా ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు పూర్తి అయ్యి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టామన్నారు. కాంగ్రెస్ పార్టీ చేసిన వాగ్దానాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తుచా తప్పకుండ అమలు చేస్తున్నారన్నారు. మరి ఫార్మ్ హౌస్ లో పడుకున్న కెసిఆర్ మా పార్టీ మీద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీద వ్యతిరేకంగా నినాదాలు, ధర్నాలు చేయండి అని పిలుపునివ్వడం హాస్యస్పదంగా ఉ oదన్నారు. అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్న సమయంలో కెసిఆర్ సూచనల మేరకు ఒక పక్కన అల్లుడు, మరో పక్క కుమారుడు వారి ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు కలిసి స్పీకర్ పైన అనుచిత వ్యాఖ్యలు చేయడం, మహిళల ముందు చొక్కాలు విప్పుకొని అసభ్యకరంగా ప్రవర్తించినందుకు ఎమ్మెల్సీలు నవీన్ రెడ్డి, తాతా మధు లను సస్పెండ్ చేయడం జరిగిందన్నారు..స్పీకర్ ను అవమానించినందుకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించడం జరిగిందన్నారు..కెసిఆర్ నిద్రలేపెందుకు మా నాయకులు నర్సారెడ్డి వెయ్యి డప్పులతో నిరసన కార్యక్రమం ఏర్పాటు చేస్తే ఆ ప్రదేశంను పసుపు నీళ్లతో శుభ్రం చేయడం దొరల అహంకారన్నీ తెలియజేస్తుందన్నారు. రాబోయే రోజుల్లో బి ఆర్ ఎస్ పార్టీ కి రాష్ట్రలో పుట్టగతులు ఉండవని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు శరత్, రత్నాకర్ గౌడ్, గాదారి గోపి, జిల్లా ప్రధాన కార్యదర్శులు ప్రవీణ్ గౌడ్, బున్నే రవిందర్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు యాదగిరి, సేవాదళ్ అధ్యక్షులు సంతోష్, ఎస్సీ సెల్ అధ్యక్షులు లింగం, ఫిషిరీస్ ఛైర్మన్ శ్రీనివాస్, జిల్లా కోశాధికారి భక్త వత్సలం, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు రేవతి, పోల ఉషా, స్వప్న, మాజీ ఫ్లోర్ లీడర్ రాజేంద్ర ప్రసాద్, రఘు, సాయికుమార్, గణేష్, సుభాష్, రవి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ డిసిసిబి బ్యాంక్ ఉద్యోగుల సమ్మె




యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూ.ఎఫ్.బి.యూ) పిలుపు మేరకు డిసిసిబి బ్యాంకు ఉద్యోగులు సిద్దిపేట పట్టణంలోని బ్యాంకు ఎదుట టిసిసిబిఎ రాష్ట్ర యూనియన్ లీడర్ రమేష్ మరియు మెదక్ జిల్లా డిసిసిబి యూనియన్ నాయకులు ఎల్లయ్య, సత్యనారాయణ, నిరంజన్ లతో పలువురు బ్యాంకు ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. రమేష్ మాట్లాడుతూ యూ.ఎఫ్.బి.యూ అనేది బ్యాంక్ ఉద్యోగులు మరియు అధికారులకు చెందిన క్రింది 7 యూనియన్లతో కూడిన ఒక ఉమ్మడి వేదిక: పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు, ప్రైవేట్ సెక్టార్ బ్యాంకులు, విదేశీ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు మరియు సహకార బ్యాంకుల నుండి బ్యాంకింగ్ పరిశ్రమలో పనిచేస్తున్న 90% కంటే ఎక్కువ మంది ఉద్యోగులకు యూ.ఎఫ్.బి.యూ ప్రాతినిధ్యం వహిస్తోందని తెలిపారు. యూ.ఎఫ్.బి.యూ తరపున, మేము ఈ రోజు సమ్మెలో పాల్గొంటుమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు, ఆర్‌బీఐ, ఎల్ఐసీ, జిఐసీ, నాబార్డ్, ప్రైవేట్ కంపెనీలు, స్టాక్ మార్కెట్, మనీ మార్కెట్, ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్ మొదలైన సంస్థల్లో ఇప్పటికే వారానికి 5 రోజుల పనిదినాల విధానం అమలులో ఉంది. బ్యాంకుల్లో కూడా నెలకు 2 శనివారాలు ఇప్పటికే సెలవులు. కాబట్టి మిగిలిన శనివారాలను మాత్రమే సెలవులుగా ప్రకటించాల్సి ఉంది. సోమవారం నుండి శుక్రవారం వరకు రోజుకు 40 నిమిషాల అదనపు పనివేళలకు యూనియన్లు అంగీకరించినందున, వినియోగదారులకు లభించే సేవలు/ వ్యాపార వేళలలో ఎటువంటి తగ్గింపు ఉండదు. బ్యాంక్ ఉద్యోగులు మరియు అధికారులు అనేక ఆటంకాలు, పరిమితులు ఉన్నప్పటికీ బ్యాంకింగ్ రంగానికి, ప్రజలకు తమ వంతు ఉత్తమ సేవలను అందిస్తున్నారు. కరోనా మహమ్మారి సమయంలో కూడా బ్యాంక్ ఉద్యోగులు దేశ ప్రజలకు సేవలు అందించారు. ప్రస్తుతం అనేక కారణాల వల్ల బ్యాంకింగ్ పనితీరు అత్యంత ఒత్తిడితో కూడుకున్నదిగా మారింది. సరైన పని-జీవిత సమతుల్యతను పెంపొందించుకోవడానికి వారానికి 5 రోజుల పనిదినాల విధానాన్ని అమలు చేస్తూ మిగిలిన శనివారాలను కూడా సెలవులుగా ప్రకటించాలని యూ.ఎఫ్.బి.యూ డిమాండ్ చేస్తోందని తెలిపారు. చీఫ్ లేబర్ కమిషనర్ మరియు డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ సెప్టెంబర్ 8 మరియు 9, 2026 తేదీలలో రాజీ చర్చలు నిర్వహించారని అయితే వారానికి 5 రోజుల బ్యాంకింగ్ విధానంపై ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పష్టమైన హామీ రాకపోవడంతో, సమ్మెను నిర్వహించాలని యూనియన్లు ఈ ఆందోళనా బాట పట్టాల్సి వచ్చిందని తెలిపారు.

# భద్రకాళి గుడి నుండి బండ్ ఐల్యాండ్ వరకు రోప్ వే నిర్మాణం

**ప్రి బిడ్డింగ్ సమావేశం లో వివిధ అంశాల పైన చర్చ**

**చాహత్ బాజ్ పాయి జిల్లా కలెక్టర్, కుడా వైస్ చైర్ పర్సన్**



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 11 (విజన్ ఆంధ్ర)కూడా పరిధిలో మరో పర్యాటక అభివృద్ధి కి అడుగులు పడునున్నాయి భద్రకాళి గుడి నుండి చెరువు ఐ లాండ్ వరకు బండ్ కనెక్టివిటీ తో రోప్ వె నిర్మాణం చేపట్టనున్నారు. ఇందుకు సంబందించిన ప్రీ బిడ్డింగ్ సమావేశం శుక్రవారం జిల్లా కలెక్టర్, కుడా వైస్ చైర్ పర్సన్ చాహత్ బాజ్ పాయి అధ్యక్షతన కుడా కార్యాలయం లో సమావేశం జరిగింది. బిడ్డింగ్ దాఖలు చేసేందుకు అదాని, ఉష బ్రేకోవర్, సి ఎస్ ఆర్ ఎల్ గజానన కంపెనీ లు ముందుకు వచ్చాయి ఈ నేపథ్యంలో....కంపెనీ ప్రతినిధులతో రోప్ వే నిర్మాణానికి సంబంధించిన వివిధ అంశాలను కలెక్టర్, కుడా అధికారులు, కంపెనీ ప్రతినిధులు చర్చించారు ఈ సమావేశం లో కుడా పిఒ అజిత్ రెడ్డి, ఈ ఈ భీమ్ రావు తదితరులు పాల్గొన్నారు

# చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి

**ప్రతిష్టించే విగ్రహాల ఎత్తుపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**మట్టి విగ్రహాల నిమజ్జనం చాలా సులువు**

**తక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలను స్థానికంగానే నిమజ్జనం చేసుకుని సహకరించాలి**

**నవరాత్రులు పూర్తి కాగానే వీలైనంత త్వరగా వినాయకులను నిమజ్జనంకి తీసుకరావాలి**

**ట్రాఫిక్ సమస్య తలేత్తకుండ ఉండేందుకు సహకరించండి**

**వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 11 (విజన్ ఆంధ్ర)నగరంలోని కాజీపేట బంధం చెరువు, హనుమకొండ సిద్దేశ్వర గుండం, చిన్న వడ్డేపల్లి, ఉర్సు చెరువుల వద్ద గణపతి నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన పోలీస్ కమిషనర్, కలెక్టర్ గణపతి విగ్రహాల నిమజ్జనానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరంలోని కాజీపేట బంధం చెరువు, హనుమకొండ సిద్దేశ్వర గుండం,చిన్న వడ్డే పల్లి, ఉర్సు చెరువుల వద్ద గణపతి నిమజ్జన ఏర్పాట్లను పోలీస్ కమిషనర్, కలెక్టర్ లు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువులు, గుండం వద్ద ఎన్ని వినాయక విగ్రహాలు నిమజ్జనానికి వచ్చే అవకాశం ఉందో, గతంలో ఆయా ప్రాంతాల్లో ఎన్ని విగ్రహాలను నిమజ్జనం చేశారని అధికారులను పోలీస్ కమిషనర్, కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన సందర్భంగా అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ శ్వేత, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... గణపతి నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, ఎలాంటి ఇబ్బందులకు తావులేకుండా సజావుగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిమజ్జన సమయంలో అవసరమైన క్రేన్లను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. బంధం చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగింపు చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం చెరువులు, గుండంలో నీటి మట్టం తక్కువగా ఉన్నందున పెద్ద విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన తగిన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని అన్నారు.చెరువు కట్ట వద్ద అవసరమైన మేరకు చదును చేసే పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. నిమజ్జనానికి వచ్చే వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రోడ్లు బాగుండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.విగ్రహాల సంఖ్య, పరిమాణం, నిమజ్జనానికి అవసరమైన సౌకర్యాలపై ముందస్తు అంచనా వేసుకుని తగిన ఏర్పాట్లు చేయాలన్నారు.నిమజ్జనానికి వచ్చే వాహనాల రాకపోకలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలను సమర్థవంతంగా చేపట్టాలని ఆదేశించారు. తక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలను స్థానికం గానే నిమజ్జనం చేసుకొనే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు నవరాత్రులు పూర్తి కాగానే... తొందరగా వినాయకులను కదిలించి...నిమజ్జనం కి తరలించాలన్నారు.ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ ప్రభాకర్ రావు, జీడబ్ల్యూఎంసీ ఎస్ఈ రవికుమార్, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, డీఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సామ్య నాయక్, సాగునీటిపారుదల శాఖ అధికారులు కిరణ్ కుమార్, మధుసూదన్ రెడ్డి, జీడబ్ల్యూఎంసీ ఎంహెచ్వో డాక్టర్ రాజేష్, ఆర్అండ్‌బీ ఈఈ దేవిక చౌహన్, మైనింగ్ ఏడీ రామాచారి, కాజీపేట తహసీల్దార్ రాజు, ఏసీపీలు ప్రశాంత్ రెడ్డి, సత్యనారాయణ, కాజీపేట పోలీస్ ఇన్స్పెక్టర్ శ్యామ్ సుందర్, తదితర అధికారులు పాల్గొన్నారు.

# తల్లి బిడ్డ ఆరోగ్యం గా ఉండేలా

**జిల్లా స్థాయి 'పోషణ్ మేళా' వేడుకలు ఘనంగా నిర్వహణ**

**సమతుల ఆహారం..సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం**

**కుడా చైర్ పర్సన్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 11 (విజన్ ఆంధ్ర )మాత శిశు మరణాలను నివారించడంతో పాటు ఆరోగ్య తెలంగాణ సాధనలో భాగంగా ప్రభు త్వం పోషణ మాసం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని కుడా చైర్ పర్సన్ గుండు సుధారాణి అన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'పోషణ్ మాసః 2026' కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి 'పోషణ్ మేళా'ను శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. పోషకాహార లోపాన్ని నివారించి, ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కుడా ఛైర్పర్సన్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ , అదనపు కలెక్టర్ (రెవిన్యూ) రవి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) శేషాద్రి హాజరయ్యారు. ుఈ కార్యక్రమం లో కుడా చైర్ పర్సన్ గుండు సుధా రాణి మాట్లాడుతూ.... పోషణ అన్నది కేవలం ఆహారం ఇవ్వడమే కాదు భవిష్యత్ తరాన్ని తయారు చేయడం అని, ప్రభుత్వ పథకాలు ప్రజలలోకి తీసుకెళ్లాలని ఇది అందరి భాధ్యత అని అన్నారు.చిన్నారులు, మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ వహించి ప్రతి ఒక్కరూ పోషకాహారాన్ని తమ రోజువారీ జీవనశైలిలో భాగం చేసుకోవాలని ఈ సందర్భంగా అన్నారు . గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగా హన కల్పించాలని,గర్భిణులు, బాలింతలు పోషకా హారం తీసుకుంటే మాతా శిశువు మరణాలను తగ్గించవచ్చని... పోషక విలువలు కలిగిన ఆహారాన్ని క్రమ పద్ధతుల్లో తీసుకుంటే మంచిదన్నారు అనంతరం జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ.. పోషణ మాసం కార్యక్రమాలు జిల్లాలో అన్ని శాఖ ల సమన్వయం తో నిర్వహించుకోవాలని అన్నారు.గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం అందిస్తూ పోషణ స్థాయిని పెంచడమే ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. పౌష్టికాహారం అందించడం తో పాటు.. దానిపై అవగహన కూడా కల్పించాలన్నారు ఈ కార్యక్రమం లో కుడా చైర్ పర్సన్, కలెక్టర్ గర్భిణులకు సంప్రదాయబద్ధంగా 'శ్రీమంతం' నిర్వహించి సీమంతపు సారెను అందజేశారు. అలాగే 7 నెలలు నిండిన చిన్నారులకు పౌష్టికాహారంతో 'అన్నప్రాశన' ను కూడా జరిపించారు పోషణ్ మేళా & ఆహార ప్రదర్శన: వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఫుడ్ ఎగ్జిబిషన్ అందరినీ ఆకట్టుకుంది. వివిధ రకాల ఆహార సమూహాలు (ఫుడ్ గ్రూప్స్ ) 'ఫుడ్ పిరమిడ్'ను ప్రదర్శించి, వాటి వల్ల కలిగే పోషక విలువలు, ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు.బాలామృతం వంటకాలు: అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారం 'బాలామృతం'తో తయారు చేసిన రకరకాల రుచికరమైన, ఆరోగ్యకరమైన వంటకాలను ప్రదర్శించి అందరికీ అవగాహన కల్పించారు. ుఈ కార్యక్రమం లో బి డబ్ల్యు ఓ విశ్వజ,జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి, డి ఎం హెచ్ ఓ , డి ఆర్ డి ఓ , డివైస్ ఓ , ఆయుష్ డీపీఎం , సీడీపీవో లు పోషన్ అభియాన్ టీం , అంగన్వాడీ టీచర్స్, బెనిఫిషరీస్ పాల్గొన్నారు.

# విచారణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలి

**హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి**

హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 11 (విజన్ ఆంధ్ర)హనుమకొండ నయీమ్ నగర్ లోని పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక విచారణ కేంద్రంలో నో మ్యాపింగ్, అనామలీస్ జాబితాలోని ఓటర్ల నుండి స్వీకరిస్తున్న ప్రక్రియను పరిశీలించిన అదనపు కలెక్టర్ ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్- 2026 )లో భాగంగా నో మ్యాపింగ్, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్ల నుండి స్వీకరిస్తున్న ధ్రువ పత్రాల విచారణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు.శుక్రవారం హనుమకొండ నయీమ్ నగర్ లోని 240వ పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక విచారణ కేంద్రంలో నో మ్యాపింగ్, అనామలీస్ జాబితాలోని ఓటర్ల నుండి స్వీకరిస్తున్న ప్రక్రియను అదనపు కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ నో మ్యాపింగ్, అనామలీస్ జాబితాలోని ఓటర్ల నుండి స్వీకరించిన ధ్రువపత్రాలను త్వరగా పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం సమర్పించిన ధ్రువపత్రాలు ఉన్నాయా లేదా అనేది క్షుణ్ణంగా విచారణ అధికారులు పరిశీలించాలన్నారు. జాబితాలో ఉండి నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్దేశిత సమయం, పోలింగ్ కేంద్రం, ఎన్నికల సంఘం సూచించిన ధ్రువ పత్రాలతో హాజరయ్యే విధంగా బిఎల్వోలు, ఇతర అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.ఈ సందర్భంగా ఏఈఆర్వో చల్లా ప్రసాద్, బీఎల్వో సూపర్ వైజర్లు, బీఎల్వోలు, తదితరులు పాల్గొన్నారు.

# నేరేడ్‌మెట్‌లో వడ్డే ఓబన్న విగ్రహం ఏర్పాటు అనుమతి ఇవ్వాలి



మల్కాజిగిరి,సెప్టెంబర్ 11,(విజన్ ఆంధ్ర) : నేరేడ్‌మెట్ లో వడ్డే ఓబన్న విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని మల్కాజిగిరి వడ్డెర సంఘం, వడ్డే ఓబన్న కమిటీ సభ్యులు కోరారు. శుక్రవారం వారు, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం మల్కాజిగిరి వడ్డెర సంఘం ▪ వడ్డే ఓబన్న కమిటీ సభ్యులు వేముల రాజు, ఓర్స్ పరుశ రాములు, వేముల నర్సింహా, గిరిశెట్టి రాజు, వేముల శీను,మాట్లాడుతూ, వడ్డే ఓబన్న దేశభక్తి, ధైర్యసాహసాలకు ప్రతీకగా నిలిచిన మహనీ యుడని కొనియాడారు. ఆయన సేవలు, పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు తెలియజేసేలా నేరేడ్ మెట్‌లో వడ్డే ఓబన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయ నున్నట్లు తెలిపారు.వడ్డెర సమాజం ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే వడ్డే ఓబన్న విగ్రహం ఏర్పాటుకు అధికారులు సానుకూలంగా స్పందించి, అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని వారు కోరారు.

# ప్రపంచ చరిత్ర కలిగిన తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి

**తెలంగాణ విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి**
**సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి**
**కాజీపేటలో సాయుధ పోరాట వారోత్సవాలు**

కాజీపేట న్యూస్ ( విజన్ ఆంధ్ర ) : ప్రపంచ చరిత్ర కలిగిన తెలంగాణ సాయుధ పోరాట యోధుల చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని, తెలంగాణ విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అన్నారు. ఈ నెల 11 నుండి 17 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా హనుమకొండ జిల్లాలో శుక్రవారం సిపిఐ కాజీపేట మండల సమితి ఆధ్వర్యంలో రాంపూర్ లోని అర్శనపల్లి హనుమంతరావు స్తూపం వద్ద వారోత్సవాలు నిర్వహించారు. ముందుగా అర్శనపల్లి హన్మంతరావు స్థూపానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభకు సిపిఐ మండల కార్యదర్శి మాలోతు శంకర్ అధ్యక్షత వహించగా సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ తెలంగాణ విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని, ట్యాంక్ బండ్ పై సాయుధ పోరాట యోధుల విగ్రహాలు పెడతామని, పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను చేర్చుతామని చెప్పిన హామీలను ప్రభుత్వం ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు. మరోవైపు



కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తూ నైజాం పై పోరాటాన్ని హిందూ, ముస్లింల గొడవగా చిత్రీకరిస్తున్నదని అన్నారు. నాటి పోరాటంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ పాత్ర ఏ మాత్రం లేదని, సాయుధ పోరాటానికి వారసులు ఒక్క కమ్యూనిస్టులేనని అన్నారు. భూస్వాములకు, దోపిడీ దారులకు నైజాం సర్కారు అండగా ఉండడం వల్లనే నైజాం సర్కారు పై సాయుధ పోరాటానికి సిపిఐ పిలుపునిచ్చిందన్నారు. ఆ పోరాటంలో తెలంగాణలో పది లక్షల ఎకరాల భూమి పంచబడిందని, వేల గ్రామాలను విముక్తి చేయడం జరిగిందని చెప్పారు. నాటి పోరాటంలో దొడ్డి కొమరయ్య మొదలుకొని నాలుగున్నర వేల మంది వీరులు అమరులయ్యారని, నేడు తెలంగాణలో గ్రామ గ్రామాన నాటి నెత్తుటి ఆనవాళ్ళు ఉన్నాయని అన్నారు. బీజేపీకి తెలంగాణ విలీన దినోత్సవంపై మాట్లాడే హక్కు లేదన్నారు. ప్రపంచ చరిత్ర కలిగిన తెలంగాణ సాయుధ పోరాటాన్ని, అమరుల జీవిత చరిత్రలను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠ్యాంశాలుగా చేర్చడంతో పాటు తెలంగాణ విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, తోట బిక్షపతి, జిల్లా కార్యవర్గ సభ్యులు మునిగాల బిక్షపతి, ఎన్ ఎ స్టాలిన్, కాజీపేట మండల కార్యదర్శి మాలోత్ శంకర్ నాయక్, నాయకులు కొట్టే వెంకటేష్, బొట్టు బిక్షపతి, కుడి స్వామి, మునిగాల ఐలయ్య, రసమల్ల కుమార్, ముంద్రాతి శ్రీకాంత్, గంగారపు కుమార్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక విగ్రహాల నిమజ్జనానికి అనువైన చెరువులను పరిశీలించిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్.పి

**నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి**

మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 11(విజన్ ఆంధ్ర).యక చవితి ఉత్సవాల సందర్భంగా నిర్వహించనున్న వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమం ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా, ప్రశాంతంగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్.పి. శ్రీమతి డి.జానకి అధికారులను ఆదేశించారు.వర్షాభావ పరిస్థితుల కారణంగా జిల్లాలోని పలు చెరువులు, ఇతర నీటి వనరుల్లో నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో చిన్న, మధ్య తరహా విగ్రహాల నిమజ్జనం కోసం ఏర్పాటు చేస్తున్న కృత్రిమ బేబీ పాండును, పెద్ద విగ్రహాల నిమజ్జనానికి అనువైన చెరువులను శుక్రవారం కలెక్టర్, ఎస్.పి సంయుక్తంగా పరిశీలించారు.ఈ సందర్భంగా క్రిస్టియన్ పల్లి పంచవటి పాఠశాల సమీపంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్మించిన కృత్రిమ బేబీ పాండ్‌తో పాటు పాలకొండ చెరువు, శ్రీనివాస్ కాలనీ చెరువు, అప్పన్నపల్లి చెరువు, చిన్నదర్పల్లి చెరువులను పరిశీలించి, నిమజ్జన ఏర్పాట్లపై మున్సిపల్, రెవెన్యూ, పోలీసు అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అప్పనపల్లి చెరువు వద్ద ఎక్కువ వినాయక విగ్రహాలు వచ్చే అవకాశం ఉన్నందున, అక్కడ రెండు పెద్ద బేబీ పాండ్లను నిర్మించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.చిన్న, మధ్య తరహా విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే ప్రాంతాల్లో బేబీ పాండ్లను ఏర్పాటు చేయాలని, వాటిలో తగినంత నీరు ఉండేలా చూడాలని కలెక్టర్ సూచించారు. నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భద్రతా చర్యలను పటిష్టంగా చేపట్టాలని జిల్లా ఎస్.పి



ఆదేశించారు.నిమజ్జన కేంద్రాల వద్ద విద్యుత్ దీపాలు, బారికేడ్లు, పారిశుద్ధ్య సౌకర్యాలు, తాగునీరు, ప్రవేశం ▪ నిష్క్రమణ మార్గాలు తదితర మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిమజ్జనం అనంతరం విగ్రహాల అవశేషాలు, పూజా సామగ్రి, ప్లాస్టిక్ తదితర వ్యర్థాలను వెంటనే తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.బేబీ పాండ్ల వద్ద నిరంతరం పారిశుద్ధ్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, నీటి నాణ్యతను పర్యవేక్షించాలని తెలిపారు. నిమజ్జనం పూర్తయిన అనంతరం పాండ్లను శుభ్రపరిచి, అవసరమైన మేరకు నీటిని తొలగించి, ఆయా ప్రాంతాలను యథావిధిగా పునరుద్ధరించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.బేబీ పాండ్లు, నిమజ్జన కేంద్రాల వివరాలను ప్రజలకు ముందుగానే తెలియజేసేలా మీడియా, సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రజలు తమ సమీపంలోని నిర్దేశిత నిమజ్జన కేంద్రాల్లోనే విగ్రహాలను నిమజ్జనం చేసేలా అవగాహన కల్పించాలని తెలిపారు.పెద్ద విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన నీటి లభ్యతను పరిశీలించి, అవసరమైతే ప్రత్యామ్నాయ ప్రాంతాలను గుర్తించి తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి వచ్చే పెద్ద విగ్రహాల నిమజ్జనానికి బీచుపల్లి వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలని గద్వాల జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. దీనిపై గద్వాల జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని కలెక్టర్ వెల్లడించారు.నిమజ్జన కార్యక్రమం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా జరిగేలా పోలీసు, మున్సిపల్, రెవెన్యూ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్, ఎస్.పి.లు సూచించారు. నిమజ్జన కేంద్రాల వద్ద తగినంత పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల రాకపోకలు, ప్రజల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ ఆదేశించారు.నిమజ్జన కేంద్రాలకు విగ్రహాలను తీసుకువచ్చే వాహనాలకు అనుకూలంగా ప్రవేశ మార్గాలు, పార్కింగ్ స్థలాలు, నిమజ్జనం అనంతరం తిరిగి వెళ్లే మార్గాలను ముందుగానే సిద్ధం చేయాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసు శాఖతో సమన్వయంతో చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు.అనంతరం పాతపల్లి పెద్ద చెరువు మినీ ట్యాంక్‌బండ్‌ను, దాని ప్రక్కనే ఉన్న శిల్పారామాన్ని జిల్లా కలెక్టర్, ఎస్పీ సంయుక్తంగా సందర్శించారు. పెద్ద చెరువులో జరుగుతున్న పనులు, వాటి పురోగతిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. శిల్పారామంలోని స్టాళ్ల కేటాయింపుల వివరాలను కూడా అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, డి.ఆర్.డి.ఓ నరసింహులు, జిల్లా వి.హెచ్.పి. అధ్యక్షులు యాది రెడ్డి, ప్రతినిధులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ నోటీసుల జారీ, విచారణ ప్రక్రియను వేగవంతం చేయాలి

**22-ఏ ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలి**
**తహసీల్దార్లతో సమీక్షలో కలెక్టర్ భవేష్ మిశ్రా**



నిజామాబాద్ సెప్టెంబర్ 11 :(విజన్ ఆంధ్ర )ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)లో భాగంగా అనామలీస్, నో మ్యాపింగ్ కేటగిరీలో గుర్తించిన ప్రతి ఓటరుకు నోటీసులు అందించి, పక్కాగా మార్గదర్శకాలను పాటిస్తూ పారదర్శకంగా విచారణ నిర్వహించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో శుక్రవారం సాయంత్రం తహసీల్దార్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసుల జారీ, వాటి పంపిణీ, విచారణ ప్రక్రియపై ఒక్కో మండలం వారీగా సమీక్షించారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎన్నికల సంఘం గడువు పొడిగించిన నేపథ్యంలో ఈ వెసులుబాటును వినియోగించుకుని నిర్ణీత గడువు లోపు పూర్తి చేయాలని అన్నారు. నోటీసుల విచారణ ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని, ప్రతి కేసుకు సంబంధించిన ధ్రువపత్రాలు క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ ముందుకెళ్లాలని అన్నారు.

క్షేత్రస్థాయిలో పర్యటించాలని, పోలింగ్ స్టేషన్ల వారీగా ప్రతిరోజూ బీఎల్ఓలు, సూపర్వైజర్ల పనితీరును పర్యవేక్షించాలని తహసీల్దార్లకు సూచించారు. పెండింగ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి మిగిలిన నోటీసుల పంపిణీని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వేరే ప్రాంతానికి శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లు ఉంటే, అలాంటి వారు ఫారం - 8 సమర్పించేలా చూడాలన్నారు. చివరి నిమిషంలో హడావుడి పడకుండా గడువు కంటే ముందే ఈ ప్రక్రియను పూర్తి చేసేలా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. కాగా, 22-ఏ నిషేధిత భూములకు సంబంధించి ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులు, అర్జీలపై సత్వరమే స్పందించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. దరఖాస్తుదారులను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోకూడదని అన్నారు. భూభారతి చట్టం మార్గదర్శకాలను పాటిస్తూ, రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తూ అర్జీలను వెంటదివెంట పరిష్కరించాలని హితవు పలికారు. అర్జీల పరిష్కారంలో జాప్యం వల్ల దరఖాస్తుదారులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉత్పన్నం కాకూడదని అన్నారు. ఈ విషయంలో అలసత్వ వైఖరిని ప్రదర్శిస్తే ఉపేక్షించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీఆర్ఓ గీత, ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, విజయ కుమారి, కలెక్టరేట్ ఏ.ఓ బాలరాజు, అన్ని మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి మహిళల భాగస్వామ్యం కీలకం

**మహిళా సంఘాల ద్వారా విస్తృతంగా అవగాహన కల్పించాలి**
**నా సమాజం సురక్షిత సమాజం“ అనే సంకల్పంతో ముందుకు సాగుదాం**
**సీపీ శ్వేత,జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 11,(విజన్ ఆంధ్ర)డ్రగ్స్, మద్యం వంటి వ్యసనాలకు యువత దూరంగా ఉండేలా అవగాహన కల్పించి, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీపీ శ్వేత,జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళా క్షేత్రంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో సమాజ భద్రత కోసం డ్రగ్స్ నిర్మూలననే లక్ష్యంగా చేపట్టిన సంఘమిత్ర అవగాహన కార్యక్రమాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, డీసీపీ దార కవిత, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మంద సుజాత జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ..ఏమాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై గ్రామీణ మహిళలు, యువత కుటుంబాలకు అవగాహన కల్పించాలన్నారు. ఎక్కడైనా మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం లేదా అక్రమ రవాణా గురించిన సమాచారం తెలిసినప్పుడు పోలీసులకు బాధ్యతగా తెలియ జేయాలన్నారు. అభివృద్ధి లో మహిళల చైతన్యం ముఖ్య భూమిక పోషిస్తుందన్నారు.అన్నీ శాఖల అధికారులు సహకరిస్తేనే రాబోయే రోజుల్లో మాదక ద్రవ్యాల వాడకాన్ని పూర్తిగా నివారించవచ్చున్నారు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ...ముఖ్యంగా మహిళా స్వయం సహాయక సంఘాలు, టౌన్ లెవల్ ఫెడరేషన్ల సభ్యులు రహిత సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని కోరారు. మహిళా సంఘాలు, టౌన్ లెవల్ ఫెడరేషన్లకు జిల్లాలో ఎంతో బలమైన నెట్‌వర్క్ ఉందని తెలిపారు. ఒక చిన్న సందేశాన్ని మహిళా సంఘాల ద్వారా పంపితే అది వేలాది మంది మహిళలకు,



తద్వారా లక్షలాది కుటుంబాలకు చేరే అవకాశం ఉందన్నారు. పట్టణ ప్రాంతాల్లోనే పెద్ద సంఖ్యలో మహిళా సభ్యులు ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లోనూ దాదాపు లక్ష మంది వరకు మహిళలు వివిధ సంఘాల్లో సభ్యులుగా ఉన్నారని పేర్కొన్నారు. యువతలో మార్పులను తల్లులే ముందుగా గుర్తించాలని, యువత డ్రగ్స్ లేదా మద్యం వ్యసనాలకు లోనవుతున్నప్పుడు వారి ప్రవర్తనలో అనేక మార్పులు కనిపిస్తాయని చెప్పారు. గతంలో అందరితో కలిసి మెలిసి ఉండే యువకులు లేదా యువతులు అకస్మాత్తుగా ఒంటరిగా ఉండటం, ఎక్కువగా మాట్లాడటం లేదా తమకు సంబంధించిన విషయాలను కుటుంబ సభ్యులతో చెప్పకపోవడం వంటి ప్రవర్తనా మార్పులను తల్లులు, కుటుంబ సభ్యులు ముందుగానే గుర్తించాలని సూచించారు. పిల్లలు డబ్బులు అడిగినప్పుడు దేనికి ఖర్చు చేస్తారు అనే విషయాలను తెలుసుకోవాలని సూచించారు. మహిళల సహకారం లేకుండా డ్రగ్స్ నిర్మూలన సాధ్యం కాదని పేర్కొన్నారు. డ్రగ్స్ వ్యతిరేక కార్యక్రమాలను కేవలం పోలీసు, ప్రభుత్వ యంత్రాంగంతోనే నిర్వహించడం సాధ్యం కాదని, మహిళా సంఘాలు, కుటుంబాలు, సమాజం సహకారం ఎంతో అవసరమన్నారు. ఎంజీఎం ఆసుపత్రిలో డీ-అడిక్షన్ కేంద్రం సామర్థ్యాన్ని పెంచడంతో పాటు, వ్యసన బాధితులకు వైద్య చికిత్సతోపాటు కౌన్సెలింగ్ సహాయం అందుతుందని కలెక్టర్ తెలిపారు. మన కుటుంబానికి, మన సమాజానికి డ్రగ్స్ వద్దు అనే సందేశాన్ని మహిళా స్వయం సహాయక సంఘాలు, వివిధ వేదికలు, సమావేశాలు, వీడియో సందేశాల ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.మహిళా సంఘాల బలమైన నెట్‌వర్క్ ద్వారా ఈ సందేశాన్ని ప్రతి గ్రామం, ప్రతి వార్డు, ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అందరి సమిష్టి కృషితోనే డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత మాట్లాడుతూలి డ్రగ్స్ మహమ్మారిని అరికట్టి యువతను మత్తు పదార్థాల బారినుంచి కాపాడటంలో మహిళల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. మహిళల చైతన్యంతోనే డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సామాజిక సమస్యల పరిష్కారంలో క్రియాశీలక భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.కుటుంబ వ్యవస్థలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, మహిళలు కుటుంబానికి మార్గదర్శకులుగా, పిల్లలకు ఆదర్శంగా నిలుస్తారని తెలిపారు. ప్రస్తుతం డ్రగ్స్ వినియోగం సమాజంలో, ముఖ్యంగా యువతలో ఆందోళనకర స్థాయిలో పెరుగుతోందని డీసీపీ ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్‌కు సంబంధించిన అనేక కేసులను పోలీసులు నమోదు చేస్తూ, అక్రమ మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకుంటున్నప్పటికీ, కేవలం కేసులు నమోదు చేయడం, పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా మాత్రమే సమస్యను పూర్తిగా పరిష్కరించలేమన్నారు.మహిళలు, ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల సభ్యులు డ్రగ్స్ వ్యతిరేక ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. తమ కుటుంబాల్లోని పిల్లలు, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలని, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వారికి వివరించాలని సూచించారు.డ్రగ్స్ వినియోగం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబ ఆర్థిక పరిస్థితిపై, సామాజిక వ్యవస్థపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా తల్లిదండ్రులు, మహిళలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. మహిళలు ముందుకు వచ్చి సామాజిక బాధ్యతగా డ్రగ్స్ వ్యతిరేక కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం ద్వారా రాబోయే తరాలను రక్షించవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, జిల్లా ఇన్చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, డీఆర్డీఏ మేన శ్రీను, మెప్మా పీడీ రాజేశ్వర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# న్యాయమే గెలిచింది

## శివుడు భూమి శివుడికి చెందింది

**శివాలయం భూములను ఆక్రమించుకున్న వారికి కోర్టు గుణపాఠం చెప్పింది**

ఎన్టీఆర్‌నందిగామ శివారు చందాపురం బైపాస్ లో సర్వే నెంబర్ 822-2 లో శ్రీ సుఖ శ్యామలాంబ సమేత రామలిం గేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన 79 సెంట్లు భూమిని చందాపురం గ్రామానికి చెందిన కొందరుకొంతకాలంగాఆక్రమిం చుమకొని దానిలో 12 సెంట్లు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేశారు. ఆక్రమణపై దేవస్థానం చైర్మన్ రాజా వాసిరెడ్డి మురళి రాఘవ కుమార్ హైకోర్టుని ఆశ్రయించారు.దేవస్థానం రికార్డులను పూర్వాపరాలనుపరిశీలించిన హైకోర్టు ఆక్రమించిన భూమిలో కట్టడాలను తొలగించి శ్రీ సుఖశామలాంబ సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి 79 సెంట్లు భూమిని అప్పగించాలని తీర్పునిచ్చింది.

# బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు శుద్ధి పేరిట బుద్ధిలేని రాజకీయాలు చేస్తున్నాయి

**- టిపిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ కోటూరి మానవతారాయ్**

హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 11 ( విజన్ ఆంధ్ర ) బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు శుద్ధి పేరిట బుద్ధిలేని రాజకీయాలు చేస్తున్నాయి అని టిపిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ కోటూరి మానవతారాయ్ అన్నారు.హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇనుగాల వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలొ టిపిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ కోటూరి మానవతారాయ్ మాట్లాడుతూ బిజెపిది వికసిత్ భారత్ కాదు వివక్ష భారత్.ఉత్తరాఖండ్ రాష్ట్రం లో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున కార్గే ప్రసంగించిన వేధిక ను బిజెపి శుద్ధి చేసి దళిత నాయకుడికి ఘోర అవమానం చేస్తే..తెలంగాణలో బిఆర్ఎస్ బిజెపిని అనుసరిస్తూ రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న దళిత స్పీకర్ ను బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు బూతులు తిట్టడం క్షమించరాని నేరం అయినప్పటికీ ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్ స్పందన కోరుతూ డప్పులతో ప్రజాస్వామ్య బద్ధంగా నిరసన తెలిపేందుకు




వెళ్ళితే ఆ ప్రాంతాన్ని విఆర్ఎస్ నాయకులు పసుపు నీళ్లతో శుద్ధి చేశారని అన్నారు.అంతరించి పోయిన అంటరాని తనాన్ని ప్రోత్సహిస్తూ మూఢనమ్మకాలను వాప్తి చేస్తూ కెసిఆర్ క్షుద్ర రాజకీయాలకు పాల్పడటం సిగ్గుచేటు అన్నారు.కెసిఆర్ మొదటి నుండి దళిత ద్రోహిగా ముద్ర పడ్డాడు. దళిత ముఖ్యమంత్రి అని దళితులను దగా చేసిండు,దళితులకు మూడు ఎకరాలని దళితులను మోసం చేసిండు,మాదిగ జాతి కి చెందిన డాక్టర్ రాజయ్యను కారణం లేకుండా ఉపముఖ్యమంత్రి పదవి నుండి తొలగించి దళిత జాతికి అవమానం చేసిండు,మాదిగలకు మంత్రి వర్గంలో స్థానం లేకుండా మాదిగ జాతికి అన్యాయం చేసిండు అన్నారు.అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని బరాబర్ మార్చుతా అని దళిత జాతి పట్ల వివక్ష వెళ్లగక్కిండు.భట్టివిక్రమార్క దళిత సిఎల్పి నాయకుడు ఉంటే చూసి ఓర్వలేకే కాంగ్రెస్ ఎమ్మెల్యే ను పార్టీ పిరాయింపులకు పాల్పడ్డాడు అన్నారు.కెసిఆర్ ముఖ్యమంత్రి హోదాలో అంబేద్కర్ పూలే జయంతి వర్ధంతి కార్యక్రమాల్లో పాల్గొనకుండా దళిత బహుజనుల పట్ల పూర్తి వ్యతిరేకతను ప్రదర్శించాడు అన్నారు.బడి ఎగ్గొట్టితే బడి దొంగ అంటామ్.అసెంబ్లీ సమావేశాలను ఎగ్గొట్టే బిఆర్ఎస్ ఎమ్మెల్యేను కెసిఆర్ ను అసెంబ్లీ దొంగలని జనాలు అంటున్నారు.అసెంబ్లీ సమావేశాలకు రాకుండా తప్పించుకునేందుకు అసెంబ్లీ వద్ద రచ్చరచ్చ చేశారు అన్నారు.సభ్య సమాజం తలదించుకునేలా బట్టలిప్పి బరి తెగించారు.విధినిర్వహణలో ఉన్న మహిళా అధికారుల పోలీసుల పట్ల అసభ్యంగా ప్రవర్తించారు.బాల్కసుమన్ చెప్పినట్లు ధర్నాలకి రైతులు రాక పోతే సంచలనం కోసం సింగరేణి భవన్ తగులబెట్టాలి రైలు పట్టాలు కొయ్యాలి అన్నట్లు గా నిన్న బిఆర్ఎస్ ఎమ్మెల్యే లు ఉన్మాదులుగా ప్రవర్తించారు అన్నారు.మాజీ మంత్రి హరీష్ రావుకు మెడలో ఉన్న బంగారు గొలుసు పై ఉన్న ధ్యాస మహిళా పోలీసుల పట్ల లేకపోవడం దారుణం.బిఆర్ఎస్ ఎన్ని కుట్రలు చేసినా వాటిని సమర్థవంతంగా కాంగ్రెస్ తిప్పికొట్టిందని వాళ్ళ సర్వే లో వెల్లడైంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజామోదం ఉంది ఇంటింటికి పదికి పైగా సంక్షేమ పథకాలు ఇక పక్కా పదేళ్ళు కాంగ్రెస్ రేవంత్ రెడ్డి సర్కారని ప్రతి ఎన్నికలో ప్రజలు దీవించారు ఒక రాజకీయ పార్టీ వాళ్ళు చేసుకున్న సర్వే లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పాలనకు 41.1శాతం ప్రజలు ఆమోదం తెలపడం తో వారు బిత్తరపోయారు అన్నారు.తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం తలసరి ఆదాయం లో 4,19,931 గ ఉండి దేశంలో రెండో స్థానంలో నిలిచిందని అతి త్వరలోనే మొదటి స్థానంలో ఉన్న కర్ణాటక ను మించి మొదటి స్థానంలో నిలుస్తుందని,అదేవిధంగా రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దేశంలో ని అన్నీ రాష్ట్రాల కంటే అభివృద్ధి పథంలో ఆర్థిక,ఆరోగ్య సూచిలో దూసుకుపోతున్నదని ప్రపంచ బ్యాంక్, కేంద్ర ప్రభుత్వం నీతిఆయోగ్, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లు నెల రోజుల క్రితం ధృవీకరిస్తే ప్రతిపక్షాలు జీర్ణించుకోలేక రాజకీయ లబ్ధి కోసం విమర్శలు చేయడం హేయమైన రాజకీయం అన్నారు.ఈ కార్యక్రమంలొ వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహమ్మద్ అయుబ్, పెరుమాండ్ల రామకృష్ణ, బందెల భద్రయ్య, ఆరూరి సాంబయ్య, వీసం సురేందర్ రెడ్డి, మహమ్మద్ రహమతుల్లా, హర్షం అశోక్, మేడారపు సుధాకర్ నేత, అచ్చ వర్ష, రోషన్ గైక్వాడ్, కుమ్మరి రవి తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో టయోటా హైలక్స్ బూట్ క్యాంప్



హైదరాబాద్, సెప్టెంబర్ 11 (విజన్ ఆంధ్ర) : టయోటా ఆధ్వర్యంలో మోయినాబాద్‌లో 'ఆల్ న్యూ టయోటా హైలక్స్ బూట్ క్యాంప్'ను నిర్వహించినట్లు ఆ సంస్థ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాహన ప్రియులకు హైలక్స్ పవర్, స్థిరత్వం, ఆఫ్‌రోడ్ సామర్థ్యాలను స్వయంగా అనుభవించే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణకు చెందిన హర్ష టయోటా, మోదీ టయోటా, ఫార్చ్యూన్ టయోటా, హెడ్‌వే టయోటా డీలర్‌షిప్‌లు పాల్గొన్నాయి. హైదరాబాద్, పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన వాహన ప్రియులు ప్రత్యేకంగా రూపొందించిన ఆఫ్‌రోడ్ ట్రాక్‌పై హైలక్స్ పనితీరు, నియంత్రణ, స్థిరత్వాన్ని పరీక్షించినట్లు తెలిపారు. వినియోగదారుల కోసం ఈ బూట్ క్యాంప్ సెప్టెంబర్ 12 వరకు అందుబాటులో ఉంటుందని తెలిపిపారు.

# పెద్దచెరువు ట్యాంక్‌బండ్ పనులు 15 రోజుల్లో పూర్తి చేయాలి కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మహబూబ్ నగర్ పెద్దచెరువు ట్యాంక్‌బండ్ అభివృద్ధి పనుల్లో మిగిలిన పనులను 15 రోజుల్లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె పెద్దచెరువు మినీ ట్యాంక్‌బండ్, పక్కనే ఉన్న శిల్పారామాన్ని సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించారు. పెద్దచెరువులో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్న కలెక్టర్, ఇరిగేషన్ శాఖ, మూఢ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన పెండింగ్ పనుల వివరాలను పరిశీలించారు. ఇప్పటికే చేపట్టిన పనులను పరిశీలించి, అవసరమైన చోట మార్పులు, అదనపు అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం శిల్పారామాన్ని సందర్శించిన కలెక్టర్ అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. స్టాళ్లను ఎవరెవరికి కేటాయించారు, వాటి ప్రస్తుత పరిస్థితి ఏమిటనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేటాయించిన అన్ని స్టాళ్లను త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అక్టోబర్ 1వ తేదీ నుంచి శిల్పారామంలోని అన్ని స్టాళ్లు పూర్తిస్థాయిలో కార్యకలాపాలు నిర్వహించేలా అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, ఇరిగేషన్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సందేశాత్మక నాటిక 'ప్రేమకు పరాకాష్ట" ప్రదర్శన

**- ప్రముఖులకు సత్కారం**



హైదరాబాద్ సెప్టెంబర్ 2026, విజన్ ఆంధ్ర (ఆకెళ్ళ. విశ్వనాథ్) : "కళ కళ కోసం కాదు ప్రజల కోసం" అనే నినాదంతో ముందుకు సాగుతున్న ప్రముఖ సాంస్కృతిక సంస్థ "రాధ ఆర్ట్స్ అసోసియేషన్" 66వ వార్సికోత్సవం సందర్భంగా మనోహరంగా ప్రదర్శించిన సందేశాత్మక నాటిక 'ప్రేమకు పరాకాష్ట" 390 వ ప్రదర్శన నాటక ప్రియులను, ప్రేక్షకులను విశేషంగా ఆకర్షించింది, ఆకట్టుకుంది. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్, సమావేశ మందిరం మొదటి అంతస్తు, హైదరాబాద్ లో బుధవారం సాయంత్రం ప్రఖ్యాత దర్శకుడు, నటుడు, బళ్ళారి రాఘవ బిరుదు గ్రహీత, మాడుగుల కృష్ణమోహన్ నేతృత్వంలో "ప్రేమకు పరాకాష్ట" పుస్తకం ఆవిష్కరణ అలాగే,"ప్రేమకు పరాకాష్ట" నాటిక ప్రదర్శించిన అందరి ప్రశంశలను అందుకుంది. ఈ కార్యక్రమంలో భాగంగా మాడుగుల కృష్ణమోహన్ పలువురు ప్రముఖులు, కళాకారులను ఘనంగా సత్కరించారు. సత్కార అందుకున్న వారిలో జోతిష్య పండితులు డాక్టర్. పులిగడ్డ హనుమంతరాయ శర్మ, రంగస్థల,టి.వి,సిని కళాకారిణి జగదీశ్వరి, సత్కళాభారతి సంస్థ వ్యవస్థాపకుడు సత్యనారాయణ, యువకళావాహిని సంస్థ అధ్యక్షుడు లంక. లక్ష్మీనారాయణ, అవొపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ శేర్లింగంపల్లి అబ్జర్వర్ వీరబొమ్మ రమేష్, రంగస్థల, సిని డబ్బింగ్ కళాకారిణి శ్రీవల్లి, ప్రముఖ నటుడు ఆధ్యాత్మికవేత్త శ్రీశైలం, ఇతర ప్రముఖులు ఉన్నారు. ఈ సందర్భంగా పురస్కార గ్రహీతలు మాట్లాడుతూ, మాడుగుల కృష్ణమోహన్ నాటక రంగ అభివృద్ధి కోసం చేస్తున్న కృషిని అభినందించారు, చేస్తున్న సేవలను కొనియాడారు, నాటికలో ప్రదర్శించిన నటీనటులను అభినందించారు. తమ వంతు సహాయ సహకారాలు కృష్ణమోహన్ కు ఎల్లప్పుడూ అందిస్తామని ఈ సందర్భంగా పురస్కార గ్రహీతలు పేర్కొన్నారు.

# 19న రవీంద్ర భారతి లో "గ్రాండ్ తౌఫీఖ్ మ్యూజికల్ నైట్ "




హైదరాబాద్ సెప్టెంబర్ 2026 విజన్ ఆంధ్ర ఆకెళ్ళ విశ్వనాథ్) : తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో ప్రముఖ "తౌఫీక్ కల్చరల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ" వ్యవస్థాపకుడు, ప్రోగ్రామర్, ఈవెంట్ ఆర్గనైజర్, మొహమ్మద్ తౌఫీఖ్ ఆధ్వర్యంలో "గ్రాండ్ తౌఫీఖ్ మ్యూజికల్ నైట్ "కార్యక్రమాన్ని ఈనెల 19 సెప్టెంబర్, శనివారం సాయంత్రం రవీంద్రభారతి మెయిన్ ఆడిటోరియం హైదరాబాద్ లో నిర్వహిస్తున్నట్లు మొహమ్మద్ తౌఫీఖ్ ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. ఈ తౌఫీఖ్ మ్యూజికల్ నైట్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇఫ్తేఖర్ షరీఫ్, భారతదేశపు మొట్టమొదటి విదేశీ పౌరుడు, హెచ్.హెచ్. రౌనక్ యార్ ఖాన్, హైదరాబాద్ 9వ నిజాం, ఆసఫ్ జాహీ వంశానికి చెందినవారు, ఇతర ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని తెలిపారు. నగరానికి చెందిన ప్రముఖ గాయనీ గాయకులు ఈ మ్యూజికల్ నైట్ కార్యక్రమంలో తమ సుమధురమైన గాత్రంతో హిందీ హిట్స్ పాటలను పాడి సంగీత ప్రియులను, ప్రేక్షకులను అలరిస్తారని ఆకట్టుకుంటారని, పాటల పల్లకిలో విహరింప జేస్తారని, అనంతరం అవార్డ్స్ సెర్మనీ కార్యక్రమం ఉంటుందని, సంగీత ప్రియులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని పాటలను ఆస్వాదించగలరని తెలుపుతూ, ఈ మ్యూజికల్ ఈవెంట్ కార్యక్రమానికి ప్రవేశం ప్రతి ఒక్కరికి ఉచితమని తౌఫీఖ్ పత్రిక ప్రకటనలో తెలియజేశారు.

# "నవంబర్ 27ను బాల్య, బాల్యదశ, బలవంతపు వివాహాల నిర్మూలనకు అంతర్జాతీయ దినోత్సవంగా ప్రకటించిన ఐక్యరాజ్యసమితి"

**- జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జె ఆర్ సి) ఆధ్వర్యంలోని ప్రపంచవ్యాప్త ఉద్యమానికి చారిత్రాత్మక ఐక్యరాజ్యసమితి గుర్తింపు.**






– హైదరాబాద్, తెలంగాణ । సెప్టెంబర్ 11, 2026 బాలల రక్షణ, వారి హక్కుల పరిరక్షణ కోసం ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న ఉద్యమానికి మరింత బలం చేకూర్చే విధంగా నవంబర్ 27ను " బాల్యదశ, బాల్యం, బలవంతపు వివాహాల నిర్మూలనకు అంతర్జాతీయ దినోత్సవం"గా ప్రకటిస్తూ ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాన్ని "స్పందన కల్చరల్ ఆర్గనైజేషన్ ఫర్ ప్రోగ్రెసివ్ ఎడ్యుకేషన్ (స్కోప్) స్వాగతించింది.

బాలల రక్షణ, వారి హక్కుల పరిరక్షణతో పాటు బాల్య వివాహాలు, దోపిడీ, హానికరమైన సామాజిక ఆచారాలను నిర్మూలించేందుకు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పోరాటంలో ఈ నిర్ణయం ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని స్కోప్ సంస్థ పేర్కొంది. తెలంగాణలోని జనగాం, సంగారెడ్డి , యాదాద్రి భువనగిరి జిల్లాల్లో బాలల హక్కుల పరిరక్షణ కోసం క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న స్కోప్ సంస్థ, భారతదేశవ్యాప్తంగా బాల్య వివాహాల నిర్మూలనకు, బాలల రక్షణకు కృషి చేస్తున్న జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జె ఆర్ సి), దాని భాగస్వామ్య సంస్థల నిరంతర కృషికి ఐక్యరాజ్యసమితి నిర్ణయం ఒక ముఖ్యమైన అంతర్జాతీయ గుర్తింపుగా అభివర్ణించింది.

స్కోప్, జె ఆర్ సి భాగస్వామ్య సంస్థగా, బాల్య వివాహాల నివారణ, బాలల రక్షణ వ్యవస్థల బలోపేతం, విద్యను ప్రోత్సహించడం, బలహీన వర్గాల కుటుంబాలకు సహాయం చేయడం వంటి అంశాల్లో నిరంతరంగా సమాజ ఆధారిత కార్యక్రమాలను అమలు చేస్తోంది.

***"భారతదేశం నుంచి వినిపించిన స్వరం నేడు ప్రపంచ సంకల్పంగా మారింది"***

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో స్కోప్ అధ్యక్షులు డా. బండి సాయన్న మాట్లాడుతూ, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న ఉద్యమంలో ఐక్యరాజ్యసమితి నిర్ణయం ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలిచిందని అన్నారు.

"భారతదేశం నుంచి వినిపించిన స్వరం నేడు ప్రపంచ సంకల్పంగా మారింది. మన సమిష్టి కృషికి అంతర్జాతీయ గుర్తింపు లభించడం ఎంతో గర్వకారణం. బాల్య వివాహాల నిర్మూలన కోసం ప్రత్యేకమైన అంతర్జాతీయ దినోత్సవంగా నవంబర్ 27ను ఐక్యరాజ్యసమితి ఎంపిక చేయడం భారతదేశానికి కూడా ఎంతో గర్వకారణం."

నవంబర్ 27, 2024 భారతదేశానికి ప్రత్యేక ప్రాధాన్యత కలిగిన రోజని డా. సాయన్న పేర్కొన్నారు. బాలల రక్షణ కోసం పనిచేస్తున్న సంస్థల భాగస్వామ్యంతో భారత ప్రభుత్వం అదే రోజున "బాల వివాహ్ ముక్త్ భారత్" (బాల్య వివాహ రహిత భారత్) ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. ఐక్యరాజ్యసమితి తాజా నిర్ణయంతో ఈ తేదీకి ఇప్పుడు ప్రపంచవ్యాప్త ప్రాధాన్యత లభించిందని అన్నారు.

"అయితే ఇది సంబరాలు చేసుకుని ఆగిపోయే సమయం కాదు. అసలు సవాలు ఇప్పుడే ప్రారంభమవుతోందిప్రపంచ స్థాయిలో వ్యక్తమైన ఈ సంకల్పాన్ని గ్రామాలు, సమాజాలు, ప్రతి కుటుంబ స్థాయిలో కార్యాచరణగా మార్చాలి."

***మూడు తెలంగాణ జిల్లాల్లో 3,604 బాల్య వివాహాల నివారణ***

బాల్య వివాహాల నివారణలో స్కోప్ సంస్థ క్షేత్రస్థాయి కార్యక్రమాలు గణనీయమైన ఫలితాలను సాధించాయని సంస్థ తెలిపింది.

2023 నుంచి సెప్టెంబర్ 2026 వరకు జనగామ, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో మొత్తం 3,604 బాల్య వివాహాలను నివారించడంలో స్కోప్ సంస్థ కీలకంగా కృషి చేసింది.

చట్టపరమైన జోక్యాలు, సమాజ సమీకరణ, అవగాహన కార్యక్రమాలు, ప్రభుత్వ అధికారులతో సమన్వయం, బాలల రక్షణ వ్యవస్థల భాగస్వామ్యంతో ఈ బాల్య వివాహాలను నివారించినట్లు స్కోప్ సంస్థ తెలిపింది.

2023 నుంచి నివారించిన 3,604 బాల్య వివాహాలు అంటే వేలాది మంది పిల్లలను చిన్న వయస్సులోనే వివాహ బంధంలోకి వెళ్లకుండా రక్షించి, వారు తమ విద్యను కొనసాగించేందుకు, సురక్షితంగా ఎదిగేందుకు, మెరుగైన భవిష్యత్తును నిర్మించుకునేందుకు అవకాశం కల్పించినట్లేనని స్కోప్ పేర్కొంది.

***డా. బండి సాయన్న మాట్లాడుతూ:***

"ఒక గ్రామంలో ఒక్క బాలిక లేదా బాలుడు కూడా బాల్య వివాహం ముప్పులో ఉన్నంతకాలం మన పోరాటం పూర్తికాలేదు. 3,604 బాల్య వివాహాలను నివారించామన్న సంఖ్య ఎంతో ముఖ్యమైనదే. కానీ ప్రతి సంఖ్య వెనుక ఒక బాల్యం, ఒక భవిష్యత్తు ఉంది. ఆ బాల్యం, భవిష్యత్తును మనం రక్షించాం." చట్టాలు మాత్రమే బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించలేవని, నిరంతర ప్రజా భాగస్వామ్యం అత్యంత అవసరమని ఆయన స్పష్టం చేశారు.

"చట్టం ఒక ముఖ్యమైన సాధనం. అయితే నివారణకు అవగాహన, విద్య, సమాజ అప్రమత్తత, ఆర్థిక సహాయం, సకాలంలో జోక్యం అవసరం. అందుకే ప్రభుత్వ శాఖలు, పోలీస్, బాలల రక్షణ వ్యవస్థలతో సమన్వయం చేసుకుంటూనే, మేము నేరుగా సమాజాలు మరియు బలహీన కుటుంబాలతో కలిసి పనిచేస్తున్నాం."

***స్కోప్ క్షేత్రస్థాయి కార్యాచరణ విధానం***

2023 నుంచి సెప్టెంబర్ 2026 వరకు మూడు జిల్లాల్లో బాల్య వివాహాల నివారణ, బాలల రక్షణ కోసం స్కోప్ పలు కార్యక్రమాలను బలోపేతం చేసింది. వాటిలో:

పాఠశాలలు, గ్రామాలు, గ్రామ పంచాయతీలలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాల నిర్వహణ;

- బాల్య వివాహాల ముప్పు ఎదుర్కొంటున్న పిల్లలు, కుటుంబాలను గుర్తించడం;
- ప్రతిపాదిత, జరగబోయే బాల్య వివాహాలను నివారించేందుకు సమాజాలను సమీకరించడం;
- అత్యవసర జోక్యం అవసరమైన సందర్భాల్లో చట్టపరమైన చర్యలు, సకాలంలో సమాచారాన్ని అందించడం;
- బాల్య వివాహాల వ్యతిరేక ప్రతిజ్ఞలు చేయడానికి పౌరులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు , సమాజ నాయకులను ప్రోత్సహించడం;
- ఆర్థికంగా బలహీన కుటుంబాలను ప్రభుత్వ సంక్షేమ, జీవనోపాధి పథకాలతో అనుసంధానం చేయడం;
- పాఠశాల నుంచి మధ్యలోనే బయటకు వచ్చిన పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు సహకరించడం;
- సమాజ ఆధారిత బాలల రక్షణ వ్యవస్థలను బలోపేతం చేయడం;
- విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు సమాజ సభ్యుల్లో బాలల హక్కులపై అవగాహన పెంపొందించడం;

సమర్థవంతమైన జోక్యాల కోసం ప్రభుత్వ అధికారులు, పోలీసులు, బాలల రక్షణ సంస్థలు, ఇతర భాగస్వామ్య సంస్థలతో సమన్వయం చేయడం.

బాల్య వివాహాల నివారణకు నివారణ, రక్షణ, విద్య, చట్టపరమైన జోక్యం, సామాజిక సమీకరణలను సమన్వయం చేసే బహుళ రంగాల విధానం అవసరమని స్కోప్ తన అనుభవం ద్వారా స్పష్టం చేసింది. భారతదేశం నుంచి ఐక్యరాజ్యసమితి వరకు ప్రపంచవ్యాప్తంగా బాల్య వివాహాల నిర్మూలన కోసం ప్రత్యేకమైన అంతర్జాతీయ దినోత్సవాన్ని ఏర్పాటు చేయాలనే ఉద్యమాన్ని ప్రారంభించి, నిరంతరం ముందుకు తీసుకెళ్లిన జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జె ఆర్ సి) వ్యవస్థాపకులు "భువన్ రిభు" నాయకత్వాన్ని స్కోప్ ప్రత్యేకంగా అభినందించింది. మార్చి 2026లో ఐక్యరాజ్యసమితిలో చేసిన ప్రసంగంలో భువన్ రిభు బాల్య వివాహాల నిర్మూలనకు ప్రత్యేకమైన యూ ఎన్ తీర్మానం తీసుకురావాలని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమానికి సియెర్రా లియోన్ ప్రథమ మహిళ డా. ఫాతిమా మాడా బయో సహా పలువురు అంతర్జాతీయ నాయకుల మద్దతు లభించింది. అనంతరం భారతదేశంతో సహా 67 దేశాల మద్దతుతో సియెర్రా లియోన్, ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో నవంబర్ 27ను బాల్య, బాల్యదశ, బలవంతపు వివాహాల నిర్మూలనకు అంకితమైన అంతర్జాతీయ దినోత్సవంగా ప్రకటించేందుకు కృషికి నాయకత్వం వహించింది. సెప్టెంబర్ 4, 2026న ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం ఈ తీర్మానంపై చర్య తీసుకుంది. బాల్య, బాల్యదశ, బలవంతపు వివాహాలపై ప్రపంచవ్యాప్త దృష్టిని, కార్యాచరణను మరింత బలోపేతం చేసే దిశగా ఇది చారిత్రాత్మక పరిణామమని స్కోప్ పేర్కొంది. భారతదేశంలోని క్షేత్రస్థాయి వాస్తవాల నుంచి పుట్టిన ఒక ఉద్యమం, ప్రపంచవ్యాప్త సంకల్పంగా ఎలా రూపాంతరం చెందిందో ఈ పరిణామం చాటిచెబుతోందని స్కోప్ తెలిపింది.

***జె ఆర్ సి దేశవ్యాప్త, ప్రపంచ బాలల రక్షణ ఉద్యమం***

జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జె ఆర్ సి) బాల్య వివాహాలు, ఇతర రకాల బాలల దోపిడీని ఎదుర్కొనేందుకు ప్రభుత్వ సంస్థలు, పౌర సమాజ సంస్థలతో కలిసి పనిచేస్తున్న ప్రముఖ బాలల రక్షణ నెట్వర్క్. జె ఆర్ సి దాని భాగస్వామ్య సంస్థలు "చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ వరల్డ్" ప్రచారం ద్వారా బాల్య వివాహాలకు వ్యతిరేకంగా విస్తృత ప్రజా ఉద్యమాన్ని నిర్మించేందుకు కృషి చేస్తున్నాయి. భారతదేశంలో జె ఆర్ సి భాగస్వామ్య సంస్థలు 782 జిల్లాల్లో ప్రభుత్వాలు, జిల్లా పరిపాలనా యంత్రాంగాలతో కలిసి పనిచేస్తూ, బాలల రక్షణ కార్యక్రమాలను నేరుగా సమాజాలు, బలహీన వర్గాల ప్రజల వద్దకు తీసుకెళ్తున్నాయి. ఈ నెట్వర్క్ పాఠశాలలు, గ్రామ పంచాయతీలు, గిరిజన, అణగారిన వర్గాలు, మహిళా సంఘాలు, పోలీసు సిబ్బంది, మత పెద్దలు మరియు ప్రజా ప్రతినిధులను సమీకరించి బాల్య వివాహాలను నివారించడంతో పాటు బాలల రక్షణ వ్యవస్థలను బలోపేతం చేస్తోంది. జె ఆర్ సి ప్రకారం, భాగస్వామ్య సంస్థలతో కలిసి నిర్వహించిన సమిష్టి కృషి ద్వారా భారతదేశంలో 5.5 లక్షలకు పైగా బాల్య వివాహాల నివారణకు సహకారం అందించబడింది. లక్షలాది మంది ప్రజలు బాల్య వివాహాల వ్యతిరేక ప్రతిజ్ఞల్లో పాల్గొన్నారు. భారతదేశంలో పురోగతి ఉన్నప్పటికీ సవాలు కొనసాగుతోంది బాల్య వివాహాల ప్రాబల్యాన్ని తగ్గించడంలో భారతదేశం గణనీయమైన పురోగతి సాధించింది. తాజా నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే-6 (ఎన్ ఎఫ్ హెచ్ ఎస్-6), 202324 ప్రకారం, 2024 సంవత్సరాల వయస్సు గల మహిళల్లో 18 సంవత్సరాల లోపు వివాహం జరిగిన వారి శాతం 20.1%కి తగ్గింది. ఇది లిలిఎన్ ఎఫ్ హెచ్ ఎస్ -5 (201921)లో 23.3%లిలిగా ఉంది. ఈ తగ్గుదల ప్రోత్సాహకరమైన పరిణామమని స్కోప్ పేర్కొన్నప్పటికీ, బాల్య వివాహాలు ఇప్పటికీ కొనసాగుతుండటం వల్ల క్షేత్రస్థాయిలో నిరంతర చర్యలు అవసరమని తెలిపింది. జాతీయ స్థాయిలో సాధించిన పురోగతి ప్రతి గ్రామానికి, ప్రతి పాఠశాలకు, ప్రతి బలహీన కుటుంబానికి చేరుకోవాల్సిన అవసరం ఉందని సంస్థ స్పష్టం చేసింది. ముఖ్యంగా పేదరికం, పాఠశాల మానివేత, సామాజిక ఒత్తిళ్లు, అవగాహన లోపం కారణంగా పిల్లలు ఎక్కువగా ప్రమాదానికి గురయ్యే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి అవసరమని పేర్కొంది. 2030 నాటికి బాల్య వివాహాలను నిర్మూలించాలనే ప్రపంచ లక్ష్యం, సుస్థిర అభివృద్ధి లక్ష్యం (ఎస్ డి జి) 5లోని 5.3 లక్ష్యంతో అనుసంధానమై ఉంది. ఈ లక్ష్యం బాల్య, బాల్యదశ మరియు బలవంతపు వివాహాలతో సహా అన్ని రకాల హానికరమైన ఆచారాలను నిర్మూలించాలని పిలుపునిస్తుంది.

***"3,604 మంది పిల్లలు రక్షించబడ్డారు కానీ మా లక్ష్యం కొనసాగుతుంది"***

ఐక్యరాజ్యసమితి ప్రకటనను కేవలం ప్రతీకాత్మక విజయంగా కాకుండా, మరింత కార్యాచరణకు పునరుద్ఘాటించిన పిలుపుగా చూడాలని డా. బండి సాయన్న అన్నారు. "2023 నుంచి సెప్టెంబర్ 2026 వరకు 3,604 బాల్య వివాహాలను నివారించడం స్కోప్ కు ఒక ముఖ్యమైన విజయం. కానీ ఇది మా ప్రయాణానికి ముగింపు కాదు. మేము రక్షించిన ప్రతి బాలబాలిక ఒక భద్రపరిచిన భవిష్యత్తుకు ప్రతీక. జనగామ, సంగారెడ్డి లేదా యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఏ ఒక్క బాలబాలిక అయినా వారి బాల్యం, విద్య , కలలను కోల్పోయేలా బలవంతంగా వివాహం చేసుకునే పరిస్థితి రాకుండా చూడటం మా బాధ్యత." ఆయన ఇంకా మాట్లాడుతూ: "నవంబర్ 27 సామూహిక కార్యాచరణకు ఒక దినంగా మారాలి. ప్రభుత్వం, పౌర సమాజ సంస్థలు, పాఠశాలలు, పంచాయతీలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసులు, సమాజ నాయకులు, ప్రతి పౌరుడు కలిసి పనిచేసి, బాల్య వివాహాలను అంగీకరించని, సహించని సమాజాన్ని నిర్మించాలి." బాలల రక్షణ వ్యవస్థలను మరింత బలోపేతం చేసి, తమ కార్యాచరణ జిల్లాలను బాల్య వివాహ రహిత జిల్లాలుగా మార్చే దిశగా ప్రభుత్వం, జిల్లా పరిపాలన, పోలీసు, ఇతర చట్ట అమలు సంస్థలు, పాఠశాలలు, పంచాయతీలు, సమాజాలు మరియు పౌర సమాజ సంస్థలతో కలిసి పనిచేయడానికి స్కోప్ తన నిబద్ధతను పునరుద్ఘాటించింది. స్కోప్ ముఖ్య విజయాలు ఒక చూపులో 3,604 బాల్య వివాహాలు నివారించడంలో కృషి కాల వ్యవధి: 2023 సెప్టెంబర్ 2026 జిల్లాలు: జనగామ । సంగారెడ్డి । యాదాద్రి భువనగిరి, తెలంగాణ స్కోప్ సందేశం స్పష్టం: "ప్రతి బాలబాలికకు బాల్యాన్ని ఆస్వాదించే హక్కు ఉంది. విద్య, భద్రత, బాల్య వివాహాల నుంచి విముక్తమైన భవిష్యత్తు ప్రతి బిడ్డ హక్కు."

# వినాయక విగ్రహాల నిమజ్జనానికి అనువైన చెరువులను పరిశీలించిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్.పి

**నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి**



మహబూబ్ నగర్ సెప్టెంబరు 11 విజన్ ఆంధ్ర ప్రతినిధి : వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా నిర్వహించనున్న వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమం ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా, ప్రశాంతంగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్.పి. శ్రీమతి డి.జానకి అధికారులను ఆదేశించారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా జిల్లాలోని పలు చెరువులు, ఇతర నీటి వనరుల్లో నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో చిన్న, మధ్య తరహా విగ్రహాల నిమజ్జనం కోసం ఏర్పాటు చేస్తున్న కృత్రిమ బేబీ పాండును, పెద్ద విగ్రహాల నిమజ్జనానికి అనువైన చెరువులను శుక్రవారం కలెక్టర్, ఎస్.పి సంయుక్తంగా పరిశీలించారు. ఈ సందర్భంగా క్రిస్టియన్ పల్లి పంచవటి పాఠశాల సమీపంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్మించిన కృత్రిమ బేబీ పాండ్‌తో పాటు పాలకొండ చెరువు, శ్రీనివాస్ కాలనీ చెరువు, అప్పన్నపల్లి చెరువు, చిన్నదర్పల్లి చెరువులను పరిశీలించి, నిమజ్జన ఏర్పాట్లపై మున్సిపల్, రెవెన్యూ, పోలీసు అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అప్పనపల్లి చెరువు వద్ద ఎక్కువ వినాయక విగ్రహాలు వచ్చే అవకాశం ఉన్నందున, అక్కడ రెండు పెద్ద బేబీ పాండ్లను నిర్మించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. చిన్న, మధ్య తరహా విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే ప్రాంతాల్లో బేబీ పాండ్లను ఏర్పాటు చేయాలని, వాటిలో తగినంత నీరు ఉండేలా చూడాలని కలెక్టర్ సూచించారు. నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భద్రతా చర్యలను పటిష్టంగా చేపట్టాలని జిల్లా ఎస్.పి ఆదేశించారు. నిమజ్జన కేంద్రాల వద్ద విద్యుత్ దీపాలు, బారికేడ్లు, పారిశుద్ధ్య సౌకర్యాలు, తాగునీరు, ప్రవేశంనిష్క్రమణ మార్గాలు తదితర మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిమజ్జనం అనంతరం విగ్రహాల అవశేషాలు, పూజా సామగ్రి, ప్లాస్టిక్ తదితర వ్యర్థాలను వెంటనే తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. బేబీ పాండ్ల వద్ద నిరంతరం పారిశుద్ధ్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, నీటి నాణ్యతను పర్యవేక్షించాలని తెలిపారు. నిమజ్జనం పూర్తయిన అనంతరం పాండ్లను శుభ్రపరిచి, అవసరమైన మేరకు నీటిని తొలగించి, ఆయా ప్రాంతాలను యథావిధిగా పునరుద్ధరించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బేబీ పాండ్లు, నిమజ్జన కేంద్రాల వివరాలను ప్రజలకు ముందుగానే తెలియజేసేలా మీడియా, సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రజలు తమ సమీపంలోని నిర్దేశిత నిమజ్జన కేంద్రాల్లోనే విగ్రహాలను నిమజ్జనం చేసేలా అవగాహన కల్పించాలని తెలిపారు. పెద్ద విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన నీటి లభ్యతను పరిశీలించి, అవసరమైతే ప్రత్యామ్నాయ ప్రాంతాలను గుర్తించి తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి వచ్చే పెద్ద విగ్రహాల నిమజ్జనానికి బీచుపల్లి వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలని గద్వాల జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. దీనిపై గద్వాల జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని కలెక్టర్ వెల్లడించారు. నిమజ్జన కార్యక్రమం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా జరిగేలా పోలీసు, మున్సిపల్, రెవెన్యూ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్, ఎస్.పి.లు సూచించారు. నిమజ్జన కేంద్రాల వద్ద తగినంత పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల రాకపోకలు, ప్రజల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ ఆదేశించారు. నిమజ్జన కేంద్రాలకు విగ్రహాలను తీసుకువచ్చే వాహనాలకు అనుకూలంగా ప్రవేశ మార్గాలు, పార్కింగ్ స్థలాలు, నిమజ్జనం అనంతరం తిరిగి వెళ్లే మార్గాలను ముందుగానే సిద్ధం చేయాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసు శాఖతో సమన్వయంతో చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అనంతరం పాతపల్లి పెద్ద చెరువు మినీ ట్యాంక్‌బండ్‌ను, దాని ప్రక్కనే ఉన్న శిల్పారామాన్ని జిల్లా కలెక్టర్, ఎస్పీ సంయుక్తంగా సందర్శించారు. పెద్ద చెరువులో జరుగుతున్న పనులు, వాటి పురోగతిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. శిల్పారామంలోని స్టాళ్ల కేటాయింపుల వివరాలను కూడా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, డి.ఆర్.డి.ఓ నరసింహులు, జిల్లా వి.హెచ్.పి. అధ్యక్షులు యాది రెడ్డి, ప్రతినిధులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# స్వచ్ఛమైన గానుగ నూనె ఆరోగ్యానికి మేలు

**- కలెక్టర్ రాజర్షిషా**



ఆదిలాబాద్ జిల్లా (విజన్ ఆంధ్ర బ్యూరో)రసాయనాలు లేకుండా పురాతన పద్ధతిలో ఎద్దుల గానుగ ద్వారా తీసే స్వచ్ఛమైన నూనె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని కజ్జర్ల గ్రామంలో తోట రాణి - శ్రీధర్ దంపతులు ఏర్పాటు చేసిన 'నిధి నేచురల్ ఫార్మింగ్' ఎద్దు గానుగ నూనె తయారీ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి, ప్రాసెసింగ్ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోనే తొలిసారిగా సంప్రదాయ పద్ధతిలో స్వచ్ఛమైన నూనె ఉత్పత్తిని ప్రారంభించడం అభినందనీయమన్నారు. ప్రజారోగ్యానికి దోహదపడే ఇలాంటి సహజసిద్ధ యూనిట్లకు ప్రభుత్వం నుంచి ఎల్లప్పుడూ ప్రోత్సాహం ఉంటుందని, సబ్సిడీతో కూడిన రుణాలు సైతం అందిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి రవీందర్ సింగ్, తహసిల్దార్ రాజ్ మోహన్, ఎంపిడిఓ శంకర్, ఇతర అధికారులు, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# 'అన్‌హైప్' స్కిన్‌కేర్ బ్రాండ్ ప్రారంభించిన విజయ్ దేవరకొండ




హైదరాబాద్, సెప్టెంబర్ 11 (విజన్ ఆంధ్ర) : భారతీయ వాతావరణం, ఎండ, తేమ, కాలుష్యం, చెమట, హార్డ్ వాటర్‌ను దృష్టిలో పెట్టుకుని నటుడు విజయ్ దేవరకొండ సహ వ్యవస్థాపకుడిగా 'అన్‌హైప్' స్కిన్‌కేర్ బ్రాండ్‌ను ప్రారంభించినట్లు ఆ సంస్థ ప్రతినిధులు శుక్రవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ 'నో బీఎస్ ఓన్లీ వాట్ వర్క్స్' నినాదంతో యువతను లక్ష్యంగా చేసుకుని శాస్త్రీయ ఆధారిత, పారదర్శకమైన స్కిన్‌కేర్ ఉత్పత్తులను అందిస్తున్నట్లు తెలిపారు. విజయ్ దేవరకొండ తొమ్మిది నెలల పాటు ఉత్పత్తుల అభివృద్ధిలో స్వయంగా పాల్గొని, వివిధ ఫార్ములేషన్లను పరీక్షించినట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్-ఫస్ట్ విధానంలో ప్రారంభమైన అన్‌హైప్ ఉత్పత్తులకు సెప్టెంబర్ 11న ప్రీ-బుకింగ్ ప్రారంభమై, సెప్టెంబర్ 21 నుంచి షిప్‌మెంట్లు మొదలు కానున్నాయని తెలిపారు.

# ఎన్ఐటీ వరంగల్ డిప్యూటీ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ పి. రతీష్ కుమార్



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 11 ( విజన్ ఆంధ్ర ) : నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) వరంగల్ డిప్యూటీ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ పి. రతీష్ కుమార్ నియమితులయ్యారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆయన బోధన, పరిశోధన, విద్యా పరిపాలన రంగాల్లో విశేష సేవలు అందించారు. ప్రొఫెసర్ రతీష్ కుమార్ ఎన్ఐటీ వరంగల్‌లో డీన్ (ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్), సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతిగా, అలాగే పలు ఇతర పరిపాలనా బాధ్యతల్లో సేవలందించారు. ఆయన తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఫెలోగా, ఇండియన్ నేషనల్ అకాడమీ ఆఫ్ ఇంజినీరింగ్ ( ఐ ఎన్ ఏ ఈ ) సీనియర్ సభ్యుడిగా ఉన్నారు.కొత్త బాధ్యతల్లో భాగంగా ఆయన సంస్థలోని విద్యా, పరిపాలనా, అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించనున్నారు.

# భద్రత బందోబస్తు కోసం ఆన్‌లైన్ ఇంటిమేషన్.

**- జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 11 ( విజన్ ఆంధ్ర ) : వికారాబాద్ జిల్లాలో గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ముందస్తు భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నామని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినాయక విగ్రహాల ఏర్పాటు, ఉత్సవాలు నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా అవసరమైన భద్రత, బందోబస్తు ఇతర పోలీస్ ఏర్పాట్లను సమర్థవంతంగా ప్రణాళిక చేయడానికి గణేష్ నిర్వాహకులు ఆన్‌లైన్‌లో Intimation నమోదు చేయాలని సూచించారు. ఆన్‌లైన్ ఇంటిమేషన్ పోర్టల్: https://policeportal.tspolice.gov.in“ (https://reference`url`citation.invalid/0) గమనిక: ఇది పోలీస్ శాఖకు ముందస్తు సమాచారం అందించేందుకు ఉద్దేశించిన ఆన్‌లైన్ ప్రక్రియ. ఆన్‌లైన్ అప్లికేషన్ పూర్తి చేసే విధానానికి సంబంధించిన డెమో వీడియోను వీక్షించి, అందులో సూచించిన విధంగా ప్రతి గణేష్ ఉత్సవ నిర్వాహకుడు తమ వినాయక విగ్రహానికి సంబంధించిన ఆన్‌లైన్ ఇంటిమేషన్‌ను పూర్తి చేయాలని వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖ విజ్ఞప్తి చేస్తోంది. మీ సమాచారం మా ముందస్తు ప్రణాళిక మీ ఉత్సవాలకు మరింత భద్రత.

# ఒప్పంద ప్రాతిపదికన పోస్టుల భర్తీకి చర్యలు

**- జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్**



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 11,(విజన్ ఆంధ్ర) : జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్ సంయుక్తశీగా తెలిపారు. శుక్రవారం జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో భర్తీకి వాక్-ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సీనియర్ రెసిడెంట్ల పోస్టులను ఒక సంవత్సరం కాలపరిమితికి ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన వైద్య విద్య, శిక్షణ అందించడంతో పాటు, అనుబంధ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన వైద్య బోధనా సిబ్బందిని సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. వైద్య విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచడంతో పాటు, ఆసుపత్రిలో రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందేలా అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**- స్పెషల్ ఆఫీసర్ రామలింగేశ్వర గౌడ్**




అయిజ సెప్టెంబర్ 11 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణ కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో భాస్కర్ అధ్యక్షతన మండల స్థాయి సాధారణ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా స్పెషల్ ఆఫీసర్ రామలింగేశ్వర గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా స్పెషల్ ఆఫీసర్ రామలింగేశ్వర గౌడ్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ సూచనల మేరకు మండలంలోని గ్రామాల్లో ప్రజల ఆరోగ్యం, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం తదితర అంశాలపై సమీక్షించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. వివిధ గ్రామాల సర్పంచులు మాట్లాడుతూ గ్రామాల్లో వీధిలైట్లు, తాగునీరు, డ్రైనేజీ తదితర సమస్యలను సర్పంచులు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, వాటిని త్వరలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని స్పెషల్ ఆఫీసర్ రామలింగేశ్వర గౌడ్, ఎంపీడీవో భాస్కర్ తెలిపారు. ఈ సమావేశంలో మండల, గ్రామస్థాయి అధికారులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి

**- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**




మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 11,(విజన్ ఆంధ్ర ) : వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి అని,విగ్రహాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో సమాచారం అందించాలని,నిబంధనలకు లోబడి ఉత్సవాలు నిర్వహించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు.ఈ నెల 14వ తేదీ సోమవారం వినాయక చవితి పండుగ సందర్భంగా రామగుండము పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో మండపాలు ఏర్పాటు చేసి, వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి ఉత్సవాలు నిర్వహించాలనుకునే వారు తప్పనిసరిగా పోలీస్ శాఖ అనుమతి పొందాలని తెలిపారు.వినాయక విగ్రహాల ఏర్పాటుకు సంబంధించిన పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఇందుకోసం https://policeportal.tspolice.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తుదారుని వివరాలు,విగ్రహం ఏర్పాటు చేసే ప్రదేశం,ఆ ప్రదేశం ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుందో, విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, కమిటీ సభ్యుల పేర్లు,వారి ఫోన్ నంబర్లు,విగ్రహాన్ని ప్రతిష్ఠించే తేదీ, నిమజ్జనం చేసే తేదీ, సమయం,ప్రదేశం, నిమజ్జనం చేసే ప్రదేశానికి చేరుకునే వాహనం వివరాలను నమోదు చేయాలన్నారు. అదేవిధంగా మండప నిర్వాహకులు, గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు, వాలంటీర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, చిరునామా తదితర వివరాలను కూడా పూర్తిగా నమోదు చేయాలని సూచించారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లోని పట్టణాలు,గ్రామాల్లో ఏర్పాటు చేసే గణపతి మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా వెబ్‌సైట్‌లో తమ వివరాలను నమోదు చేయాలని కమిషనర్ సూచించారు. ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేయడంలో ఇబ్బందులు ఎదురైతే సమీపంలోని పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఉత్సవ కమిటీ సభ్యులు మట్టి వినాయక విగ్రహాల ప్రతిష్ఠాపనకు ప్రాధాన్యత ఇవ్వాలని కమిషనర్ సూచించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా కమిషనరేట్ పోలీస్ యంత్రాంగం 24 గంటలు అందుబాటులో ఉండి అప్రమత్తంగా ఉంటుందని, అత్యవసర సమయంలో వెంటనే డయల్ 112కు సమాచారం అందించాలని తెలిపారు. మండపాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహించే నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్ శాఖ నిబంధనలకు లోబడి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు.

# సెప్టెంబర్ 17న ప్రజా పాలన దినోత్సవంను ఘనంగా నిర్వహించాలి

**- మట్టి వినాయకులనే పూజించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలి**

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**





గద్వాల సెప్టెంబర్ 11 (విజన్ ఆంధ్ర బ్యూరో) : సెప్టెంబర్ 17వ తేదీన ప్రజా పాలన దినోత్సవంను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ పక్కడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన దినోత్సవం ఏర్పాట్లపై శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి కలెక్టర్ సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రోటోకాల్ ప్రకారం అతిథులకు ఆహ్వానాలు, జాతీయ పతాకావిష్కరణకు ఏర్పాట్లు చేయాలన్నారు. కలెక్టరేట్ ఆవరణలోనే కార్యక్రమం నిర్వహిస్తున్నందున టెంట్లు, భారీకేడ్ల ఏర్పాటుతోపాటు స్టేజి అలంకరణ, శుభ్రత, తాగునీరు, ఫైర్ సేఫ్టీ, వైద్య శిబిరం, తదితర ఇతర సౌకర్యాలు ఉండాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. శాంతి భద్రతలకు సంబంధించి పటిష్ట పోలీస్ బందోబస్తు నిర్వహించాలని తెలిపారు. సెప్టెంబర్ 17వ తేదీ ప్రాధాన్యతను ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పురపాలికలు, మండలాల్లోనూ ప్రజా పాలన దినోత్సవంను జరపాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులనే పూజించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో తయారుచేసిన విగ్రహాలతో కాలుష్యం పెరుగుతుందని, పర్యావరణహితంగా గణేష్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. ముఖ్యంగా అధికారులందరూ మట్టి గణనాథులను పూజించి ప్రజలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. గణేష్ నిమజ్జనంలో ఎలాంటి అపశృతులు చోటు చేసుకోకుండా అవసరమైన ఏర్పాట్లన్ని చేయాలన్నారు. ఈ సందర్భంగా మట్టి వినాయకుల ప్రాధాన్యతపై ముద్రించిన గోడపత్రికలను, విగ్రహాలను ఎస్పీ, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. పలువురు అధికారులకు, కలెక్టరేట్ సిబ్బందికి మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో మంజుల, పలువురు జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ సమాచారం ఇచ్చిన వారికి రూ.10,000 బహుమతి

**- విద్యార్థులు, యువతకు డ్రగ్స్ నివారణపై అవగాహన కార్యక్రమాలు**

**- నషాముక్త భారత్ అభియాన్ సమన్వయ సమావేశాన్ని నిర్వహించిన**

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీటి శ్రీనివాసరావు**




గద్వాల సెప్టెంబర్ 11 (విజన్ ఆంధ్ర బ్యూరో) : డ్రగ్స్ మహమ్మారిని జిల్లాలో సమూలంగా పారద్రోలడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయం లోని కాన్ఫరెన్స్ హాల్లో నషాముక్త భారత్ అభియాన్ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యాసంస్థల్లో ముఖ్యంగా కళాశాలలలో డ్రగ్స్ నిర్మూలనపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అబ్కారీ, పోలీస్ శాఖలు బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం తీసుకునే వారిపై నిఘా ఉంచుతూ అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా అడ్డుకట్ట వేయాలన్నారు. బస్టాండ్, రైల్వే స్టేషన్ లతోపాటు విద్యా సంస్థల వద్ద ఉండే దుకాణాలు, ఇండ్ల యజమానులకు ఎవరైనా ఆయా ప్రదేశాల్లో డ్రగ్స్ తీసుకోవడం, రవాణా చేస్తుంటే సమాచారం ఇవ్వాల్సిందిగా కోరాలన్నారు. విద్యాసంస్థల సమీపంలో పొగాకు, గుట్కా విక్రయాలు కూడా జరగకుండా ఆయా దుకాణాల యజమానులకు ఆదేశాలు జారీచేయాలని డీఈఓకు సూచించారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో కొందరు యువత స్టెరాయిడ్స్ వాడుతున్నట్లు తెలిసిందని, వీటి వలన ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నం దున కట్టడి చేయాలన్నారు. ముఖ్యంగా జిమ్ ట్రైనర్స్, ఆర్ఎంపి లకు ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఆదేశించాలన్నారు. జిల్లాలో ఎక్కడ కూడా గంజాయి మొక్కలు సాగు చేయకుండా వ్యవసాయ, పోలీస్ శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. డ్రగ్స్ కార్యకలాపాలు, రవాణా చేసే వారిపై సమాచారం ఇచ్చే పౌరులకు రూ.10,000 నగదు బహుమతి ఇస్తామని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రకటించారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో గంజాయి, డ్రగ్స్ సరఫరాను సమూలంగా నిర్మూలించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలను ఇప్పటికే నిర్వహించినట్లు తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లా రెండు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉండడంతో చెక్ పోస్టుల వద్ద కూడా విస్తృత తనిఖీలు నిర్వహించి డ్రగ్స్ సరఫరా కాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఇటీవల డ్రగ్స్ కేసులు పెరుగుతున్నందున అరికట్టేందుకు ఈగల్ విభాగంతోను సమన్వయం చేసుకుంటూ ముందుకెళు_న్నామన్నారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో గంజాయి మొక్కలు సాగు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని వ్యవసాయ శాఖ అధికారులు కూడా గంజాయి నివారణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అబ్కారి, రవాణా, ఇతర శాఖల సమన్వయంతో జిల్లాలో డ్రగ్స్ ను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని ఈ సందర్భంగా ఎస్పీ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ కోతలకు నిరసనగా రైతులు ధర్నా..

**- మద్దతు పలికిన బిజెపి**

**- ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన అమలు చేయాలి**

**- బిజెపి యువ నాయకురాలు డికె.స్నిగ్ధ రెడ్డి**



దరూర్ సెప్టెంబర్ 11 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా దరూర్ మండలం కేంద్రంలో 33/11కెవి సబ్ స్టేషన్ దగ్గర వ్యవసాయ విద్యుత్ కోతలకు నిరసనగా రోడ్డు పై మండల రైతులు ధర్నా కార్యక్రమం చేపట్టారు.. ఈ ధర్నా కార్యక్రమంకు బిజెపి పార్టీ జిల్లా యువ నాయకురాలు డికె. స్నిగ్ధ రెడ్డి ,బిజెపి నాయకులు రైతులకు మద్దతు తెలుపుతూ ఈ ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా యువ నాయకురాలు డికె. స్నిగ్ధ రెడ్డి మాట్లాడుతూ గద్వాల నియోజకవర్గంలో రైతులు ప్రస్తుతం తీవ్రమైన విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ బోర్లకు సరిపడా నాణ్యమైన విద్యుత్ అందకపోవడం వల్ల పంటలకు సకాలంలో నీరు అందడం లేదు. ప్రభుత్వం ప్రకటించిన మేరకు విద్యుత్ సరఫరా జరగకపోవడం, తక్కువ వోల్టేజ్, తరచూ విద్యుత్ అంతరాయాలు, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను సకాలంలో మార్చకపోవడం వంటి కారణాలతో రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని అన్నారు.వ్యవసాయానికి అవసరమైన సమయంలో విద్యుత్ అందక రైతులు రాత్రి వేళల్లో పొలాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో వారి ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడుతోంది. మరోవైపు, విద్యుత్ సరఫరాలో లోపాల కారణంగా మోటార్లు దెబ్బతిని రైతులపై అదనపు ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు 24 గంటలు ప్రకటించిన 12 గంటలు కూడా ఇవ్వడం లేదని అన్నారు.తక్కువ వోల్టేజ్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడంతో పాటు, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను అత్యవసరంగా మార్చాలని విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న అంతరాయాలను నివారించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వ్యవసాయ విద్యుత్ అందించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు.ఎస్ఈ.అబ్దుల్ కరీం, డిఈ.రవి ప్రసాద్ 2రోజులు సమయం ఇవ్వాలని ఉన్నత అధికారులతో మాట్లాడుతా మని కోరడం తో డికె. స్నిగ్ధ రెడ్డి హామీ తో రైతులు ధర్నా కార్యక్రమం విరమించడం జరిగింది..ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు ,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్ర రెడ్డి,రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండల వెంకట రాములు అక్కల రమాదేవి, జిల్లా కోశాధికారి మిర్జాపురం రామచంద్ర రెడ్డి,బిజెవైఎం జిల్లా అధ్యక్షుడు బాబుల్ రెడ్డి, కిసాన్ మోర్చా అధ్యక్షుడు దరూర్ కిష్టన్న,ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దాస్, జిల్లా ఎస్సి మోర్చా ఆంజనేయులు,మండల అధ్యక్షుడు తిమ్మా రెడ్డి, బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలంతా ఏకమైతేనే గో సంరక్షణ సాధ్యమైతది

**- సన్ కార్థిక్ దాస్ మహారాజ్**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 11,(విజన్ ఆంధ్ర ) : ప్రజలంతా ఏకమైతేనే గో సంరక్షణ సాధ్యమైతదని, గోమాతను జాతీయ మాతగా ప్రకటించాలని సన్ కార్థిక్ దాస్ మహారాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మంచిర్యాల పట్టణం కు విచ్చేసిన ఆయన స్థానిక గోపాల్ వాడ లోగల హనుమాన్ ఆలయంలో గో సమ్మాన్ ఆహ్వాన్ అభియాన్ ముఖ్య ఉద్దేశం ను భక్తులకు తెలియపర్చారు. గోవు బ్రతికితేనే భూమి బ్రతుకుతుందన్నారు. ఇప్పటికే రెండు మార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడం జరిగిందని, వచ్చే డిసెంబర్ 17 నాటికీ దేశ వ్యాప్తంగా 31 కోట్ల సంతకాల సేకరణ పూర్తి చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్లు పేర్కొన్నారు,కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే గోమాతను “జాతీయ మాత“గా ప్రకటించాలని డిమాండ్ చేశారు.ఈ మహత్తర కార్యక్రమం లో ప్రతి ఒక్కరూ భాగస్వాములై సంతకాల సేకరణలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.గోవే భూమికి ఆధారమన్నారు.గో ఉత్పత్తులను వాడడం వల్ల మానవాళి ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు.శ్రీకృష్ణుడు స్వయంగా గోవులను మేతకు తీసుకెళ్లాడని, శ్రీ రాముడు గోరక్షణ చేశాడని,ఛత్రపతి శివాజీ మహారాజ్ 14 సంవత్సరాల చిన్న వయసులోనే గోవులను రక్షించారని, ఇదే వారి నుండి మనకు వచ్చిన బాధ్యతని తెలిపారు.ఆవు నుండి లభించే పంచగవ్యాలు మానవుల ప్రాణాలను కాపాడుతాయని, ఆవులో 33 కోట్ల దేవతలు కొలువై ఉంటారని,అందుకే గోవును కాపాడుకోవడం ప్రతి పౌరుడి హక్కుగా భవించాలన్నారు.అయన ఉపదేశం,చెప్పిన మాటలు గోమాత పట్ల ప్రేమను,ధర్మం పట్ల నిష్టను పెంచుకోవాలన్నారు. చిన్న,పెద్ద తేడా లేకుండా అందరూ కలిసి ఈ సంతకాల సేకరణ మహాయజ్ఞాన్ని విజయవంతం చేసి, గోమాతను రాష్ట్ర మాత హోదాకు చేర్చే దిశగా కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమం లో చేతన్ దాస్, మోహన్ రెడ్డి, గంగయ్య, విజయ్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# దళితుల పేరుపై డ్రామాలు చేస్తున్న కాంగ్రెస్

**- కాంగ్రెస్ నాయకులు కపట ప్రేమ మానుకోండి**

**- దళిత పేరును అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేస్తే ఖబర్దార్**

**- మళ్లీ మళ్లీ దళిత పేరు తీసి దళితులను కించపరిస్తున్న కాంగ్రెస్ పార్టీ**

**- మీడియా సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు చైతన్య కిరణ్**




వికారాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 11 ( విజన్ ఆంధ్ర ) : దళితుల పేరుపై డ్రామాలు చేస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని బిఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు చైతన్య కిరణ్ మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ కపట ప్రేమ మానుకోకపోతే ప్రజలు తగిన సమయంలో బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు. శుక్రవారం వికారాబాద్ లో బిఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు చైతన్య కిరణ్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. దళిత పేరును అడ్డం పెట్టుకొని రాజకీయం చేయాలని చూస్తే తగుమూల్యం చెల్లించుకోవలసి వస్తుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్లీ మళ్లీ దళిత పేరును వాడుకొని కాంగ్రెస్ పార్టీ లబ్ధి పొందాలని చూడడం సిగ్గుచేటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులు అని డిజైన్ చేయడంలో కాంగ్రెస్ పార్టీ ఒక ఆకు ఎక్కువే చదివిందని ఆయన దెప్పిపొడిచారు. దళితుల అనే పేరు చెప్పి బిఆర్ఎస్ పార్టీని అనగదొక్కాలని చూస్తే పార్టీ కార్యకర్తలు సహించలేరని ఆయన ధ్వజమెత్తారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏదో ఒక రకంగా కేసు నమోదు చేయాలని చూడడం అవివేకమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దళిత బూచీని చూపి రాబోవు ఎన్నికల్లో లబ్ది పొందాలని భావించడం మూర్ఖత్వం అని ఆయన ఘాటుగా స్పందించారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి ఇచ్చిన హామీలను ఎలా అమలు చేయాలో తెలియక తికమక పడుతుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పోలీస్ ఉద్యోగాల ఉచిత శిక్షణకు దరఖాస్తుల గడువు పొడిగింపు...

**- జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



ఆదిలాబాద్ జిల్లా ( విజన్ ఆంధ్ర బ్యూరో)ఆదిలాబాద్ జిల్లాలో కానిస్టేబుల్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు బీసీ, ఎస్సీ స్టడీ సర్కిళ్ల ఆధ్వర్యంలో నిర్వహించనున్న 60 రోజుల ప్రత్యేక ఉచిత శిక్షణకు దరఖాస్తుల గడువును ఈ నెల 13వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక శిక్షణలో మొత్తం 200 మంది అభ్యర్థులకు అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో 100 మంది కానిస్టేబుల్ అభ్యర్థులకు, 100 మంది ఎస్ఐ అభ్యర్థులకు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు సెప్టెంబర్ 13వ తేదీ వరకు ఆదిలాబాద్‌లోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. అభ్యర్థుల ఎంపికను నిర్దేశిత రిజర్వేషన్ ప్రకారం చేపట్టనున్నట్లు తెలిపారు. బీసీలు 25 శాతం ఎస్సీలు 25 శాతం ఎస్టీలు 25 శాతం ఈబీసీ/ఈడబ్ల్యూఎస్/ అనాథలు 25 శాతం దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు రూ.3 లక్షల లోపు వార్షిక ఆదాయానికి సంబంధించిన ఇన్‌కమ్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, రెసిడెన్షియల్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్లు, పోలీస్ ఉద్యోగానికి దరఖాస్తు చేసినట్లు తెలిపే పత్రం సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు పోలీస్ రిక్రూట్‌మెంట్ నిబంధనలకు అనుగుణంగా అర్హత కలిగి ఉండాలని స్పష్టం చేశారు. దరఖాస్తుల చివరి తేదీ: సెప్టెంబర్ 13, 2026 మెరిట్ జాబితా: సెప్టెంబర్ 16, 2026 సర్టిఫికెట్ల పరిశీలన: సెప్టెంబర్ 17 నుంచి 18 వరకు సెప్టెంబర్ 19, న శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. 60 రోజుల శిక్షణలో భాగంగా అభ్యర్థులకు ఉచితంగా పుస్తకాలు అందించడంతో పాటు, ప్రతిరోజూ నిపుణులైన అధ్యాపకులతో నాలుగు తరగతులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అభ్యర్థుల ప్రతిభను ఎప్పటికప్పుడు అంచనా వేసేందుకు ప్రతి వారం పూర్తి స్థాయి పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. శిక్షణ తరగతులు ఆదిలాబాద్‌లోని బీసీ స్టడీ సర్కిల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. మరిన్ని వివరాలకు: ఫోన్: 08732-221280, 9949684959, 9494149416 బీసీ స్టడీ సర్కిల్, ఎస్సీ స్టడీ సర్కిల్, ఆదిలాబాద్‌ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

## 132/33కేవీ ఆసిఫాబాద్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ లోడ్లను పరిశీలించిన ఎస్ఈ ఉత్తమ్ జాడే.



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి,సెప్టెంబర్ 11(విజన్ ఆంధ్ర) : ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ సరఫరా తీరుతెన్నులు లోడ్ నిర్వహణను పరిశీలించేందుకు ఆసిఫాబాద్ విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎస్ఈ ఉత్తమ్ జాడే శుక్రవారం 132/33కేవీ సబ్‌స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ పర్యటనలో భాగంగా ఎస్ఈ సబ్‌స్టేషన్‌లోని కంట్రోల్ రూమ్‌ను పరిశీలించి, వివిధ ఫీడర్ల వారీగా విద్యుత్ లోడ్ వివరాలను ఆరా తీశారు. పీక్ అవర్స్‌లో విద్యుత్ డిమాండ్ ఏ విధంగా ఉంది, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం ఎలా పనిచేస్తుందనే అంశాలపై అధికారులతో సమీక్షించారు. సబ్‌స్టేషన్‌లో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని సిబ్బందిని ఆదేశించారు. రాబోయే కాలంలో విద్యుత్ వినియోగం మరింత పెరిగే అవకాశం ఉన్నందున, లోడ్ బ్యాలెన్సింగ్ మరియు గ్రిడ్ భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వినియోగదారులకు ఎటువంటి అంతరాయం లేకుండా నిరంతర నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా పనిచేయాలని స్థానిక ఇంజనీరింగ్ సిబ్బందికి తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు ానజు ్రా, ఆసిఫాబాద్ , దుస్సా శ్రీనివాస్ మరియు సబ్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్‌టీపీసీ సీఎస్ఆర్ నిధులపై సమగ్ర ప్రణాళిక

**- ప్రభావిత గ్రామాల అభివృద్ధి, ప్రజా ప్రయోజనాలకే ప్రాధాన్యం**

**- కలెక్టర్ కోయ శ్రీహర్ష**



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్-11(విజన్ ఆంధ్ర) : ఎన్‌టీపీసీ సీఎస్ఆర్,సీడీ నిధులను జిల్లాలో ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరేలా సద్వినియోగం చేసేందుకు సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె. అరుణశ్రీతో కలిసి సీఎస్ఆర్,సీడీ నిధుల వినియోగంపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాకు అందుబాటులో ఉన్న నిధులను ఏయే రంగాల్లో సమర్థవంతంగా వినియోగించవచ్చో శాఖల వారీగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్‌టీపీసీ ప్రభావిత గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటి అభివృద్ధికి నిధులు వినియోగించేలా ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. విద్య, వైద్య రంగాల్లోని అవసరాలను గుర్తించి, అత్యవసరమైన పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సీఎస్ఆర్ నిధులు వృథా కాకుండా నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా, సమర్థవంతంగా వినియోగించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, ప్రజలకు గరిష్ఠ ప్రయోజనం చేకూరే పనులపై సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

## అటవీ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం....

**- ఎఫ్ డీ ఓ. ప్రథమేస్ కేశవ్ థీజర్**

**- అటవీ, వన్యప్రాణుల సంరక్షణలో వారి సేవలు స్ఫూర్తిదాయకం**





ఆదిలాబాద్ జిల్లా (విజన్ ఆంధ్ర బ్యూరో)అటవీ, వన్యప్రాణుల సంరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అటవీ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని ఆదిలాబాద్ డివిజన్ ఎఫ్‌డీఓ ప్రతమేష్ కేశవ్ తిజారే అన్నారు.జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆదిలాబాద్‌లోని మావల పార్కులో ఉన్న అటవీ అమరవీరుల స్తూపం వద్ద అటవీ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఎఫ్‌డీఓ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రెండు అటవీ డివిజన్లకు చెందిన రేంజ్ అధికారులు, సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు, ఫీల్డ్, మినిస్టీరియల్ సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఇంద్రవెల్లి రేంజ్ పరిధిలోని దస్నాపూర్ బీట్‌లో విధులు నిర్వహిస్తూ ప్రాణాలు కోల్పోయిన ఎఫ్‌బీఓ గౌస్ మొయినుద్దీన్, ఇచ్చోడ రేంజ్‌లో విధి నిర్వహణలో ఉండగా ముల్తానీలో దారుణ హత్యకు గురైన మాంత్యా నాయక్ త్యాగాలను ప్రత్యేకంగా స్మరించుకున్నారు. అమరవీరుల స్మారక స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు.అటవీ సంపద, వన్యప్రాణుల సంరక్షణలో అటవీ సిబ్బంది అందిస్తున్న సేవలు ఎంతో కీలకమని ఎఫ్‌డీఓ పేర్కొన్నారు. అమరవీరుల ధైర్యం, అంకితభావం, విధి నిర్వహణ పట్ల నిబద్ధత ప్రస్తుత అటవీ సిబ్బందికి ఎల్లప్పుడూ స్ఫూర్తిగా నిలుస్తాయని తెలిపారు.

## గంగారంలో మెరిసిన బంగారం బిడ్డ

**- గవర్నర్ చేతుల మీదుగా ఛాంపియన్ అవార్డ్**

**- ఇంటర్నేషనల్ నాట్య మయూరి అవార్డు**

**- 2024లో మిస్ హైదరాబాద్**

**- సీఐఎస్‌సీఈ జాతీయ క్రికెట్ ఛాంపియన్‌షిప్‌కు తెలుగు రాష్ట్రాల జట్టు కెప్టెన్‌గా శ్లోక ఫాల్గుణ రెడ్డి.**

**- ఉత్తర తెలంగాణకు జాతీయ స్థాయిలో గుర్తింపు తెస్తున్న గంగారం యువ క్రికెట్ ప్రతిభ.**

*కాటారం డివిజన్ ప్రతినిధి, (విజన్ ఆంధ్ర): గాదిభీ రమేశ్ 9440054323*

సీఐఎస్‌సీఈ (CISCE) జాతీయ అండర్-19 మహిళల క్రికెట్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటున్న ఆంధ్రప్రదేశ్‌తెలంగాణ సంయుక్త అండర్-19 మహిళల క్రికెట్ జట్టుకు గంగారం వాసి, హైదరాబాద్‌కు చెందిన ఫాల్గుణ రెడ్డి కెప్టెన్‌గా ఎంపికైంది. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో సెప్టెంబర్ 10 నుంచి జరుగుతున్న సీఐఎస్‌సీఈ జాతీయ ఛాంపియన్‌షిప్‌లో ఫాల్గుణ తెలుగు రాష్ట్రాల సంయుక్త జట్టుకు సారథ్యం వహిస్తోంది.

ఫాల్గుణ హైదరాబాద్‌లోని మల్లాపూర్ జాన్సన్ గ్రామర్ స్కూల్‌లో 12వ తరగతి చదువుతోంది. చదువుతో పాటు క్రికెట్‌లోనూ విశేష ప్రతిభ కనబరుస్తున్న ఆమె గతంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (HCA) అండర్-19 మహిళల జట్టుకు ఎంపికైంది. అనంతరం బీసీసీఐ దేశవాళీ అండర్-19 మహిళల క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపికైన తెలంగాణ జట్టులోనూ స్థానం సంపాదించింది. కుడిచేతి మీడియం పేస్ బౌలర్‌గా రాణిస్తున్న ఫాల్గుణకు సీఐఎస్‌సీఈ జాతీయ ఛాంపియన్‌షిప్‌లో తెలుగు రాష్ట్రాల సంయుక్త జట్టుకు కెప్టెన్‌గా అవకాశం లభించడం ఆమె క్రికెట్ ప్రయాణంలో మరో కీలక మైలురాయిగా నిలిచింది.

### అండర్-14లోనూ సత్తా

గతంలో జాతీయ స్థాయి అండర్-14 మహిళల క్రికెట్‌లోనూ ఫాల్గుణ అద్భుత ప్రతిభ కనబరిచింది. లక్నోలో జరిగిన టోర్నమెంట్‌లో మహారాష్ట్ర జట్టుపై కీలక వికెట్లు సాధించి, ఆంధ్రప్రదేశ్‌తెలంగాణ జట్టు ఛాంపియన్‌గా నిలవడంలో తనవంతు కీలక పాత్ర పోషించింది. అలాగే హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో జరిగిన క్రికెట్ పోటీల్లో అప్పటి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ డా. తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా ఛాంపియన్‌షిప్ అవార్డును కూడా అందుకుంది.

### క్రీడలతో పాటు కళారంగంలోనూ ప్రతిభ

క్రికెట్‌తో పాటు కూచిపూడి, త్రోబాల్, అబాకస్ తదితర రంగాల్లోనూ ఫాల్గుణ తన బహుముఖ ప్రతిభను చాటుతోంది. అబాకస్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి గణన సామర్థ్యాన్ని ప్రదర్శించిన ఆమె కళారంగంలోనూ ప్రత్యేక గుర్తింపు పొందింది. దుబాయిలో కూచిపూడి నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్న ఫాల్గుణకు ప్రతిష్ఠాత్మక 'నాట్య మయూరి ఇంటర్నేషనల్ అవార్డు' లభించింది.

వ్యక్తిత్వ వికాసం, ప్రజెంటేషన్, వేదికపై ఆత్మవిశ్వాసంతో వ్యవహరించే తీరు వంటి అంశాల్లోనూ ప్రతిభ కనబరిచిన ఫాల్గుణకు 2024లో 'మిస్ హైదరాబాద్' బిరుదు లభించింది. క్రీడలు, విద్య, నృత్యం, ఇతర సాంస్కృతిక రంగాల్లో ఆమె సాధిస్తున్న విజయాలు





బహుముఖ ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

### గంగారం నుంచి జాతీయ స్థాయికి

శ్రీ రాజలింగారెడ్డిబుచ్చక్క దంపతుల మనవరాలు, శ్రీ జైపాల్ రెడ్డికావ్య రాజేశ్వరి దంపతుల కుమార్తె అయిన ఫాల్గుణ రెడ్డి జాతీయ స్థాయిలో తెలుగు రాష్ట్రాల సంయుక్త అండర్-19 మహిళల క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా ఎంపిక కావడం పట్ల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్థులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణ రాష్ట్రంలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా (పూర్వ ఉమ్మడి కరీంనగర్ జిల్లా) పరిధిలోని కాటారం మండలం గంగారం నుంచి ఎదిగి జాతీయ స్థాయి క్రికెట్‌లో తన ప్రతిభను చాటుతున్న ఫాల్గుణ రాబోయే రోజుల్లో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని గ్రామస్థులు ఆకాంక్షిస్తున్నారు. ఆమె సారథ్యంలో తెలుగు రాష్ట్రాల సంయుక్త జట్టు జాతీయ ఛాంపియన్‌షిప్‌లో విజయాలు సాధించాలని వారు కోరుకుంటున్నారు.

## అటవీ శాఖ అమరవీరుల సంస్మరణ దినోత్సవ సందర్భంగా బైక్ ర్యాలీ నీ ప్రారంభించిన జిల్లా అటవీశాఖ అధికారిని బాల మని....



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 11:( విజన్ ఆంధ్ర) : అటవిశాఖ అమరవీరుల దినోత్సవ సందర్భంగా కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయం ముందు బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన జిల్లా అటవీ శాఖ అధికారిని అనంతరం జిల్లా కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించి అటవీశాఖ కార్యాలయానికి చేరుకున్న బైక్ ర్యాలీ... ఈ సందర్భంగా జిల్లా అటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా జిల్లా అటవీ శాఖ అధికారిని బాలామణి మాట్లాడుతూ అటవీ సంరక్షణకు ప్రతి ఒక్కరిలో అవగాహన ముఖ్యమని అన్నారు. ఈ అవగాహన కల్పించాలని లక్ష్యంతో గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ తో భేటీ అయిన మొట్టమొదటి ప్రభుత్వ అధికారి ఐఎఫ్ఎస్ శ్రీనివాస్ ను 2012లో వీరప్పన్ కిరాతకంగా చంపారని అన్నారు. శ్రీనివాస్ మృతికి చిహ్నంగా అటవీ అమరవీరుల దినోత్సవం నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. అటవీ సంరక్షణలో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ రక్షణ కల్పించాలన్నారు. సాధారణ చట్టాలు, అటవీ చట్టాలు పోటీపడినప్పుడు తమకు అటవీ చట్టాలే ముఖ్యమని వాటికే ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అటవీ సంరక్షణలో వివిధ రకాల కారణాలతో ఎంతోమంది అమరులయ్యారని అన్నారు. అటవీ సంరక్షణలో క్షేత్రస్థాయిలో తీసుకునే చర్యలు ఒక్కొక్కసారి ముప్పు చేసే అవకాశం ఉంటాయని జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఇటీవలే నిజామాబాద్ లో ఎఫ్ఆర్ఓ గంగాధర్ ను కొంతమంది పోడు జరుగుతుందంటూ ఫోన్ చేసి అక్కడికి వెళ్ళగానే హతమార్చిన సంఘటన గుర్తు చేశారు. అటవీ సంరక్షణ కోసం నిబద్ధులై నిలబడుతున్న సందర్భంలో గురుతర కుటుంబ బాధ్యతలు గుర్తురావని, రాత్రిపూట వచ్చే సమాచారాలకు జట్టుగా వెళ్లాలన్నారు. అటవీ సిబ్బంది కదలికలు వన్యప్రాణులకు, వాటి కదలికలు అటవీ సిబ్బందికి తెలుస్తూ ఉండడం వల్ల వాటి వల్ల గాయపడడం ప్రాణాలు పోగొట్టుకునే వారి సంఖ్య తక్కువగా ఉందన్నారు. సాధారణ ప్రజానీకం మాత్రమే వాటిపైన వివిధ రకాల ప్రయోగాలు చేసే క్రమంలో ప్రాణాలు పోగొట్టుకుంటున్నారన్నారు. అటవీ సంరక్షణలో అవసరమైన జాగ్రత్తలు పాటించడం వల్ల పదవీ విరమణ వరకు అడవికి సేవ చేసే అవకాశం లభిస్తుందన్నారు. ఉద్యోగం అనేది ప్రధానమైనదని ఇదే సందర్భంలో జీవితం కూడా ప్రాముఖ్యత కలిగి ఉంటుందన్నారు. బయటతో పోలిస్తే అడవిలో తిరిగే సందర్భంలో వాతావరణం అనేక మార్పులతో కూడుకొని ఉంటుందని ఆర్మీ వాళ్లు వివిధ రకాల వాతావరణంలో అలవాటు పడి విధులు నిర్వహిస్తున్నట్లు అటవీ అధికారులు కూడా నిర్వహించాల్సి ఉంటుందన్నారు. అటవీ సంరక్షణ కోసం పోడు తగ్గించడం, జంతువుల రక్షణ, వృక్షాల సంరక్షణ లాంటి వాటి విషయాల్లో ప్రాణాలు కోల్పోయిన ప్రతి ఒక్కరి త్యాగాలు గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇప్పటివరకు అటవీ సంరక్షణలో అమరులైన 26 మంది అమరుల త్యాగాలు వెలకట్టలేనివన్నారు, ఈ కార్యక్రమంలో అటవీ రైన్జ్ అధికారులు రమాదేవి, గోవింద్ చంద్ సర్దార్, రమేష్, మజారుద్దీన్, జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు యోగేష్ కులకర్ణి, సభ్యులు సద్దాం హుస్సేన్, సాయి, డిప్యూటీ రేంజ్ అధికారులు విజయ్ ప్రకాష్, ఝాన్సీ రాణి, ఇక్బాల్, జమీల్, శాబాజ్, అటవీ సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు పాల్గొన్నారు.

## 'స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-26 పోస్టర్ ఆవిష్కరణ



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 11(విజన్ ఆంధ్ర ) : కిట్స్ వరంగల్ క్యాంపస్‌లో జాతీయ స్థాయి విద్యార్థి సాంకేతిక కార్యక్రమం 'స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-26' పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ & సైన్స్, వరంగల్ (కిట్స్ వరంగల్) లోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సి ఎస్ ఇ) విభాగం, 'సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్' (సెంటర్ ఫర్ ఐ స్క్వేర్ ఆర్ఈ ) మరియు 'ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్' (ఐ ఐ సి ) సహకారంతో 'స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2026' (ఎస్ ఐ హెచ్ -2026) కోసం అంతర్గత హ్యాకథాన్‌ను నిర్వహిస్తోంది. ఈ విషయంలో కిట్స్ వరంగల్ క్యాంపస్‌లో హుస్నాబాద్ నియోజకవర్గ ఫార్మర్ ఎమ్మెల్యే మరియు కిట్స్ వరంగల్ అదనపు కార్యదర్శి శ్రీ వొడితల సతీష్ కుమార్ గారు; ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి, సి ఎస్ ఇ విభాగం అధిపతి డాక్టర్ పి. నిరంజన్ మరియు అసోసియేషన్ సభ్యుల సమక్షంలో ఎస్ ఐ హెచ్ -2026 పోస్టర్‌ను సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం 2026 సెప్టెంబర్ 18న కిట్స్ వరంగల్ లోని సివిల్ సెమినార్ హాల్‌లో నిర్వహించబడుతుంది. ఈ సందర్భంగా హుస్నాబాద్ నియోజకవర్గ ఫార్మర్ ఎమ్మెల్యే & కిట్స్ వరంగల్ అడిషనల్ సెక్రెటరీ, వొడితల సతీష్ కుమార్ మాట్లాడుతూ, ప్రస్తుత సాంకేతిక రంగంలో విద్యార్థులకు నైపుణ్య ఆధారిత విద్యను అలవాటు చేయడం అత్యంత అవసరమని నొక్కి చెప్పారు. స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ అనేది మన దైనందిన జీవితంలో ఎదురయ్యే కొన్ని తీవ్రమైన సమస్యలను పరిష్కరించడానికి విద్యార్థులకు ఒక వేదికను అందించే దేశవ్యాప్త కార్యక్రమం. తద్వారా ఉత్పత్తి ఆవిష్కరణ సంస్కృతిని మరియు సమస్య పరిష్కార దృక్పథాన్ని వారిలో పెంపొందించడం దీని లక్ష్యం, ఇది విద్యార్థి సంఘంలో సాంకేతిక సామరస్యం, సోదరభావం, సమగ్రత మరియు నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తుంది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి అధ్యక్షోపన్యాసం చేశారు. విద్యార్థుల వర్క్‌షాప్‌లు, సమావేశాలు, విజయవంతమైన పారిశ్రామికవేత్తలతో ఇంటరాక్టివ్ సెషన్లను నిర్వహించడం ద్వారా ఆవిష్కరణ మరియు వ్యవస్థాపక సంస్కృతిని ప్రోత్సహించడమే హ్యాకథాన్ లక్ష్యమని ఆయన నొక్కి చెప్పారు. మరిన్ని వివరాలు మరియు పాల్గొనడానికి ఆసక్తి ఉన్న విద్యార్థులు వెబ్‌సైట్ : ఒఒఒ.ంఱ్‌ష్ట్ర.్‌రశీజ.ఱఅ ద్వారా రిజిస్ట్రేషన్ లో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా కిట్స్ కళాశాల యాజమాన్యం, ఫార్మర్ రాజ్య సభ ఎం.పి., కిట్స్ వరంగల్ చైర్మన్, కెప్టెన్ వి. లక్ష్మీకాంత రావు గారు, కోశాధికారి పి.నారాయణరెడ్డి గారు & హుస్నాబాద్ నియోజకవర్గ ఫార్మర్ ఎమ్మెల్యే & కిట్స్ వరంగల్ అడిషనల్ సెక్రెటరీ, వి. సతీష్ కుమార్ గారు కార్యనిర్వాహక అధ్యాపక బృందంను మరియు విద్యార్థి సమన్వయకర్తల బృందాన్ని పోస్టర్ ఆవిష్కరణ ను నిర్వహించినందుకు అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. కోమల్ రెడ్డి, సెంటర్ ఫర్ ఐ స్క్వేర్ ఆర్ఈ హెడ్, డాక్టర్ రాజ నరేందర్ రెడ్డి, ఇన్స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్, ప్రెసిడెంట్, డా. పి. విజయ్ కుమార్, కెమిస్ట్రీ అసోసియేట్ ప్రొఫెసర్ & పిఆర్ఓ డా.డి. ప్రభాకర చారి, ఎస్ ఐ హెచ్ ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ (ఎస్ పి ఓ సి) మరియు సి ఎస్ ఇ సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.సి. సంతోష్ కుమార్; ఫ్యాకల్టీ కో-కోఆర్డినేటర్ మరియు సి ఎస్ ఇ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్. రాజేష్; సి ఎస్ ఇ అసోసియేషన్ విద్యార్థి అధ్యక్షుడు టి. విశ్వత్ నారాయణ & వారి బృందంతో కూడిన ఫ్యాకల్టీ విద్యార్థి ప్రతినిధులు, 100 మంది విద్యార్థులు హాజరయ్యారు.

## తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను దొంగిలించడానికి యత్నిస్తున్న బిజెపి

**- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు**

**- సిపిఐ ఆధ్వర్యంలో సాయుధ పోరాట వారోత్సవాల ర్యాలీ, సభ**



హనుమకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 11( విజన్ ఆంధ్ర ) : తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను దొంగిలించడానికి బిజెపి ప్రయత్నిస్తున్నదని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు విమర్శించారు.రజాకార్లు, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన చారిత్రాత్మక తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాన్ని శుక్రవారం హనుమకొండలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ ఆధ్వర్యంలో హనుమకొండ పట్టణంలో బాలసముద్రం నుండి ఏకశిలా పార్కు వరకు ర్యాలీ నిర్వహించారు.బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ, ఏకశిలా పార్కు వద్ద గల, తెలంగాణ సాయుధ పోరాట అమరుడు థానునాయక్ విగ్రహం వరకు కొనసాగింది.ఈ సందర్భంగా సీపీఐ శ్రేణులు, కార్మికులు, రైతులు, ప్రజా సంఘాల నాయకులు భారీ సంఖ్యలో పాల్గొని, సాయుధ పోరాట వీరులకు జోహార్లు అర్పిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీపీఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటం భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం సాగిన అసలైన చారిత్రాత్మక పోరాటమని కొనియాడారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా కమ్యూనిస్టుల నేతృత్వంలో ప్రజలు సాహసోపేతమైన పోరాటం చేశారని, ఆనాటి పోరాట స్ఫూర్తిని నేటి తరాలు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. నాటి సాయుధ రైతాంగ పోరాటంలో నాలుగున్నర వేల కమ్యూనిస్టు అమరుల త్యాగాలతో ఎర్రబారిన నేల తెలంగాణ అని అన్నారు. నిజాం నిరంకుశ పాలనను కూలదోసింది కమ్యూనిస్టులేననిపటేల్ సైన్యం కాదని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట ఫలితంగానే నిజాం నిరంకుశ పాలన రద్దయ్యిందని, పటేల్ సైనిక చర్య వల్ల కాదని అన్నారు. ఆ పోరాటంలో 10 లక్షల ఎకరాల భూమి పేదలకు పంచి, 3 వేయి గ్రామాలను విముక్తి చేసింది కమ్యూనిస్టులేనని చెప్పారు. ఆనాడు పటేల్ చీకటి ఒప్పంద ఫలితమే నిజాం రాజుకు గవర్నర్ పదవి దక్కిందని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట అమర వీరులను స్మరించుకుందామని, వారి ఆశయ సాధనకు ప్రతిజ్ఞ చేద్దామని పిలుపునిచ్చారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని, అమరుల జీవిత చరిత్రలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠ్యాంశాలుగా చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్,సిరబోయిన కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, బత్తిని సదానందం, మునిగాల బిక్షపతి, ఏదునూరి వెంకట్రాజం,నేదునూరి రాజమౌళి,ఎన్. అశోక్ స్టాలిన్, యేషబోయిన శ్రీనివాస్, కండె నర్సయ్య, నిమ్మల మనోహర్, గుంటి రాజేందర్, అల్వాల రాజు, నోముల కిషోర్, రాంగోపాల చారి తదితరులు పాల్గొన్నారు.

## మల్బరీ సాగుతో రెండు లక్షల నికర ఆదాయం

**- MERA RESHAM MERA ABHIMAN 2.0 (నా పట్టు నా అభిమానం 2.0)**

**- నూతన రైతులకు మల్బరీ సాగు లాభదాయకం**

**- పంట మార్పిడితో ప్రతీ గ్రామంలో 50 ఎకరాలలో అధిక ఆదాయాన్నిచ్చే మల్బరీ సాగు చేయాలి**



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 11 (విజన్ ఆంధ్ర): కేంద్ర సిల్క్ బోర్డు 75 సంవత్సరాలు పూర్తి చేసిన సందర్భంలో మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం లైన్ తండా లో మల్బరీ సాగు విస్తీర్ణం ను పెంచే క్రమంలో నా పట్టు నా అభిమానం 2.0 (MERA RESHAM MERA ABHIMAN 2.0) కార్యక్రమాన్ని G.అనసూయ, జాయింట్ డైరెక్టర్, సెరికల్చర్ శాఖ వారి ఆధ్వర్యం లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర సిల్క్ బోర్డు కర్ణాటక రాష్ట్రానికి చెందిన ముఖ్య అతిథి మైసూర్ శాస్త్రవేత్త జె. శ్రీకాంత్ నాయక్, మల్బరీ సాగు గురించి రైతులకు పలు సాంకేతిక సలహాలు ఇస్తూ పలు సందేహాలు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతాంగం పంట మార్పిడి ద్వారా మార్కెట్ డిమాండ్ ఉన్న మల్బరీ సాగు చేపట్టి ఎకరానికి 2 లక్షల ఆదాయం పొందాలని తెలిపారు. ఈ పంట ఆదాయం సాఫ్ట్వేర్ ఇంజనీర్ జీతం తో సమానం అని తెలిపారు. క్లస్టర్ స్థాయిలో సామూహికంగా మల్బరీ సాగు చేపట్టాలని దీనికి కోతులు, దొంగల బెడద లేదని, ఒక సంవత్సరం లో 5 నుండి 6 పంటలు తీసుకోవచ్చని ఎక్కువ స్థాయిలో ఎరువులు అవసరం లేదని, పురుగు మందులు అసలు అవసరం లేదని తెలుపుతు ఈ సాగు వైపు మొగ్గుచూపాలని తెలిపారు. వరి, మొక్కజొన్న, ప్రత్తి, మిరప సాగు విస్తీర్ణం తగ్గించి ఈ మల్బరీ పంటని సాగు చేసి ఆర్థికంగా ఎదగాలని తెలిపారు. జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న ఈ పంట సాగు వలన పరిశ్రమలు స్థాపించి యువతకు, స్వయం సహాయక మహిళా సంఘాలకు ఉపాదిని కల్పించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని కనుక రైతాంగం ఆలోచించి పంట మార్పిడి ద్వారా మల్బరీ సాగు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో G.అనసూయ జాయింట్ డైరెక్టర్ , సీరికల్చర్, జినుగు మరియన్న జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ అధికారి, జీ. శ్రీకాంత్, కేంద్ర సిల్క్ బోర్డు శాస్త్రవేత్త, కె.సురేష్ , సెరికల్చర్ అధికారి ,మహిళా స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# భూమి పూజ కార్యక్రమానికి విచ్చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే బండారి, ఉప్పల్ జోనల్ కమీషనర్ రాధిక గుప్తా
- 30 కోట్ల వ్యయంతో ఆత్మగౌరవ భవనం
- భారీ ఏర్పాట్లు చేస్తున్న ఆర్యవైశ్య మహాసభ
- రాష్ట్ర ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొనాలి
- మేడ్చల్ జిల్లాకే గర్వకారణం : బెలిదే రమేష్





కాప్రా/సెప్టెంబర్ 11 (విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : ఉప్పల్ భగాయత్ లో ఈనెల 13న రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో నిర్మించనున్న ఆత్మగౌరవ భవన నిర్మాణానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటున్నారు. ఆర్యవైశ్యుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉప్పల్ బగాయత్ లో 5 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరావతి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో దాదాపు 30 కోట్ల రూపాయల వ్యయంతో ఆత్మగౌరవ భవన నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. గతవారం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్ష కార్యదర్శులు బెలిదే రమేష్ గుప్తా, బచ్చు నగేష్ గుప్తాల ఆధ్వర్యంలో జరిగిన జిల్లా సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు అమరావతి లక్ష్మీనారాయణ హాజరై ఈనెల 13న ఉప్పల్ భగయత్ లో నిర్వహించే భూమి పూజ కార్యక్రమానికి రాష్ట్రంలోని ఆర్యవైశ్యులు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తమ జిల్లాలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఆత్మగౌరవ భవన నిర్మాణం జరగడం ఎంతో గర్వంగా ఉందని మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్ష కార్యదర్శులు హర్షం వ్యక్తం చేశారు. మేడ్చల్ జిల్లా నుంచి సుమారు ఐదువేల మంది ఆర్యవైశ్యుల తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. ఈనెల 13న ఉదయం ఎనిమిది గంటలకు భూమి పూజ స్థలంలో శ్రీనివాస కళ్యాణం నిర్వహిస్తున్నామని ఆసక్తి ఉన్న దంపతులు పాల్గొనవచ్చని వారు సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూమి పూజ కార్యక్రమానికి హాజరవుతున్న సందర్భంగా ఉప్పల్ బగాయత్ లో జరుగుతున్న ఏర్పాట్లను శుక్రవారం ఉదయం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఎం ఎం సి ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తాలు పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికి ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆర్యవైశ్య మహాసభ నిర్వాహకులకు వారు సూచించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఆర్యవైశ్యుల ఐక్యతను చాటుకోవాలని నిర్వాహకులు కోరారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు మరింత మెరుగుపరచాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ జిల్లా,సెప్టెంబర్ 11,(విజన్ ఆంధ్ర); జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ కార్యాలయంలో వైద్యాధికారులు, వివిధ విభాగాల అధిపతులతో కలెక్టర్ సమావేశమై ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై సమీక్షించారు. రోజువారీగా నమోదవుతున్న ఓపీ వివరాలతో పాటు వివిధ విభాగాల్లో అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. జనరల్ మెడిసిన్, గైనకాలజీ, ఆర్థోపెడిక్, కార్డియాలజీ, రేడియాలజీ, ఈఎన్‌టీ తదితర విభాగాల్లో వైద్య సేవల మెరుగుదలకు అవసరమైన పరికరాలు, శస్త్రచికిత్సలకు అవసరమైన యంత్రాల వివరాలను ఆయా విభాగాల అధిపతుల నుంచి సేకరించారు. అవసరమైన పరికరాలను ప్రాధాన్యత క్రమంలో సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు సౌకర్యవంతంగా వైద్య సేవలు అందేలా అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. సదుపాయాలు మెరుగుపడితే మరింత మంది రోగులకు ఆసుపత్రిలోనే మెరుగైన చికిత్స అందించే అవకాశం ఉంటుందని అన్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పార్కింగ్ స్థలాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సమావేశంలో ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, అధికారులు రమేష్, సరోజ, వైద్యులు, అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీఎం ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా




నిర్మల్ జిల్లా,సెప్టెంబర్ 11,(విజన్ ఆంధ్ర); జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సీఎం ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీఎం ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. దరఖాస్తుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం చేయవద్దని స్పష్టం చేశారు. జిల్లా స్థాయిలోపరిష్కరించలేని, పైస్థాయిలో పరిష్కరించాల్సిన దరఖాస్తులను వెంటనే సంబంధిత ఉన్నతాధికారులకు పంపించాలని ఆదేశించారు. అనంతరం మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 9వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమాలకు సంబంధించిన గోడప్రతులను కలెక్టర్ ఆవిష్కరించారు. డీడబ్ల్యూవో వినూత్నతో కలిసి గోడప్రతులను ఆవిష్కరించిన ఆయన, పోషణ మాసం కార్యక్రమాలను అక్టోబర్ 8వ తేదీ వరకు పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పోషకాహారం, ఆరోగ్యం, మహిళలు, చిన్నారుల్లో పోషకాహారంపై అవగాహన కల్పించే కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్వో రాథోడ్ రమేష్, ఆర్డీవో దేవీదాస్, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ భవనం త్వరగా పూర్తి చేయండి

- నిధుల లేమితితో అర్ధాంతరంగా నిలిచిన భవన నిర్మాణ పనులు
- మహిళ సంఘం భవనంలో తాత్కాలిక పంచాయతీ నిర్వహణ.
- పంచాయతీ భవనం లేక చెట్లకిందనే గ్రామసభలు.
- మోత్కులగూడా సర్పంచ్ జెట్ట లావణ్య రమేష్ ఆవేదన.
- మోత్కులగూడాలో దిక్కుతోచని స్థితిలో పంచాయతీ పాలకవర్గం.







నందిగామ:సెప్టెంబర్ 10(విజన్ ఆంధ్ర న్యూస్); గత ప్రభుత్వం నూతన గ్రామపంచాయతిలను ఏర్పాటు చేసిన తరువాత మారుమూల గ్రామలల్లోని గ్రామాలకు గ్రామపంచాయతీలు లేక ఆరుబయట గ్రామసభలు,తదితర కార్యక్రమాలు నిర్వహించుకునే దుస్థితి ఏర్పడిందని స్థానిక సర్పంచులు ఆవేదన చెందుతున్నారు. పంచాయతీ కార్యాలయం గ్రామ పరిపాలనకు కేంద్ర బిందువు ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడానికి,గ్రామ సభల్లో తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించడానికి సరైన వేదిక అవసరం.రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం నందిగామ మండల పరిధిలోని మోత్కులగూడా గ్రామ గ్రామపంచాయతీ స్థానిక ఎన్నికలు ముగిసిన గత ఎనిమిది నెలలుగా మోత్కూలగూడలో పంచాయతీ భవనం అందుబాటులో లేకపోవడంతో ఈ కార్యక్రమాల నిర్వహణలో ఇబ్బందులు తప్పడం లేదని మోత్కూలగూడా సర్పంచ్ జెట్ట లావణ్య రమేష్ పేర్కొన్నారు. గ్రామంలో అవసరమైన కొన్ని మౌలిక వసతుల పనులను సొంత నిధులతోనే నెట్టుకొచ్చామని సర్పంచ్ చెప్పుకొచ్చారు.పంచాయతీకి సొంత భవనం లేకపోవడంతో ప్రజలకు,పాలకవర్గానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని,ప్రస్తుతం తాత్కాలికంగా మహిళా సమైక్య భవనంలో పంచాయతీ పరిపాలన కొనసాగుతోందని,దీంతో పంచాయతీ పాలకవర్గంతో పాటు మహిళా సంఘాల సభ్యులు కూడా ఇబ్బందులు పడుతున్నారని,పంచాయతీ కార్యకలాపాలకు మహిళా సమైక్య కార్యక్రమాలకు ఒకే భవనాన్ని వినియోగించుకోవాల్సి రావడంతో ఇరువర్గాలకు అసౌకర్యం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వ నిధులతో మొదలైన పంచాయతి భావన నిర్మాణం పనులు మద్యంతరంగా నిలిపోయాయని,అధికారులు స్పందించి వెంటనే మరిన్ని నిధులు మంజూరు చేసి భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి కోరారు.

# నిజామాబాద్ రూరల్‌లో వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుపై అసెంబ్లీలో ఎమ్మెల్యే ప్రస్తావన

- గుండారంఖానాపూర్ ప్రాంతంలో 500 ఎకరాలు గుర్తించాం
- అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి
- సానుకూలంగా స్పందించిన మంత్రి..
- అందుకు చర్యలు తీసుకుంటామని అసెంబ్లీ సాక్షిగా వెల్లడి

నిజామాబాద్ సెప్టెంబర్11:( విజన్ ఆంధ్ర ) శుక్రవారం జరిగిన అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి లేవనెత్తిన వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటు అంశం పై రాష్ట్ర ఐటి మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల మంత్రి శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందించారు.

జిల్లా వ్యవసాయ ఆధారిత ప్రాంతంగా ఉన్నందున, ఇక్కడ వ్యవసాయ ఉత్పత్తులకు విలువను జోడించే ఆహార శుద్ధి, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేయడం ద్వారా రైతులకు అదనపు ఆదాయంతో పాటు యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో అసెంబ్లీలో పేర్కొన్నారు. గతంలో జిల్లాలో చక్కెర పరిశ్రమ కూడా మూతపడిందని, ప్రస్తుతం జిల్లాలో పెద్దగా పరిశ్రమలు లేకపోవడం వల్ల స్థానికంగా ఉపాధి అవకాశాలు పరిమితంగా ఉన్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఉపాధి అవకాశాల కల్పనలో పరిశ్రమల పాత్ర అత్యంత కీలకమని, వ్యవసాయ రంగానికి అనుసంధానంగా పరిశ్రమలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

### రైజింగ్ తెలంగాణ లక్ష్యాలకు అనుగుణంగా అభివృద్ధి

2047 నాటికి అభివృద్ధి చెందిన తెలంగాణగా తీర్చిదిద్దే లక్ష్యానికి అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని భూపతి రెడ్డి అన్నారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం =ూ=జు (రూరల్ అగ్రికల్చరల్ రీజినల్ ఎకనామీ) పరిధితో పాటు ప్రధానంగా గ్రామీణ, వ్యవసాయ ప్రాంతాలతో కూడి ఉన్నందున ఫుడ్ ప్రాసెసింగ్, అగ్రో బేస్డ్ ఇండస్ట్రీస్ ఏర్పాటుకు అపారమైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

### గుండారంఖానాపూర్ ప్రాంతంలో 500 ఎకరాల గుర్తింపు

జిల్లా కేంద్రానికి సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుండారంఖానాపూర్ ప్రాంతంలో సుమారు 500 ఎకరాల భూమిని పరిశ్రమల ఏర్పాటుకు అనువైన ప్రాంతంగా గుర్తించినట్లు భూపతి రెడ్డి తెలిపారు. ఈ ప్రాంతానికి అనేక అనుకూలతలు ఉన్నాయని ఆయన వివరించారు. రైల్వే డబ్లింగ్ పనులతో పాటు రైల్వే గోదాం కూడా మంజూరు కావడంతో భవిష్యత్తులో రైల్వే రవాణా మరింత సులభతరం కానుందని అన్నారు. రైల్వే, రోడ్డు రవాణా సౌకర్యాలతో పాటు నీటి లభ్యత



ఉండటం, జిల్లా కేంద్రానికి సమీపంలోనే ఉండటం వల్ల వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు ఈ ప్రాంతం అత్యంత అనుకూలంగా ఉంటుందని తెలిపారు.

### పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామిక వర్గాల సానుకూలత

గుండారంఖానాపూర్ ప్రాంతంలో వ్యవసాయ ఆధారిత, ఆహార శుద్ధి పరిశ్రమలను ఏర్పాటు చేసే అంశంపై చాంబర్ ఆఫ్ కామర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో పాటు ట్రేడర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కూడా సానుకూలంగా ఉన్నారని ఎమ్మెల్యే తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో విస్తారంగా లభించే వరి, పసుపు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను స్థానికంగానే శుద్ధి చేసి విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చే విధంగా పరిశ్రమలను ఏర్పాటు చేస్తే రైతులకు, వ్యాపారులకు, యువతకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. గుండారంఖానాపూర్ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై జిల్లా కలెక్టర్ ద్వారా ఫిజిబిలిటీ అధ్యయనం నిర్వహించి, సంబంధిత పరిశ్రమల ప్రతినిధుల అభిప్రాయాలను సేకరించి సమగ్ర ప్రతిపాదనను సిద్ధం చేసి.. మంత్రికి సమర్పించినట్లు పేర్కొన్నారు.

### సానుకూలంగా స్పందించిన మంత్రి.. అందుకు చర్యలు తీసుకుంటామని హామీ

వ్యవసాయానికి పరిశ్రమల అనుసంధానం ద్వారా రైతు ఆదాయం పెంచడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాన్ని వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు కేంద్రంగా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి ప్రశ్నోత్తరాల సమయంలో లేవనెత్తిన అంశానికి రాష్ట్ర ఐటి మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందించారు.లి ఈ మేరకు జిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని.. గుండారం-ఖానాపూర్ ప్రాంతంలో రైల్వే లైన్, గోదాంతో పాటు ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఫుడ్ ప్రాసెసింగ్, టర్మరిక్ ప్రాసెసింగ్ వెసులుబాటు ఉన్నాయని చెప్పిన ఎమ్మెల్యే భూపతి రెడ్డి వ్యాఖ్యలను పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొన్న మంత్రి..వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుతో పాటు, లాజిస్టిక్ పార్క్ ఏర్పాటు దిశగా తప్పకుండా చర్యలు తీసుకుంటామని అసెంబ్లీలో వెల్లడించారు.

# రోడ్డు ప్రమాద స్థలాన్ని పరిశీలించిన నిజామాబాద్ పోలీస్ కమిషనర్

నిజామాబాద్ సెప్టెంబర్11:(విజన్ ఆంధ్ర ) నిజామాబాద్ గురువారం ఉదయం సుమారు 10 గంటల సమయంలో హైదరాబాద్ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న ( ు+ 18ాూ 6033 ) నంబర్ గల హ్యుందాయ్ వెన్యూ కారు నాగపూర్ గేట్ సమీపంలో ప్రమాదానికి గురైంది. డిచిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగపూర్ గేట్ వద్ద నిజామాబాద్ రోడ్డు దాటిన అనంతరం , లారీ / ట్యాంకర్ ( ూ09ఖదీ9042 ) గల డ్రైవర్ ఎలాంటి ముందస్తు సూచనలు , హెచ్చరికలు లేకుండా రహదారిపై వాహనాన్ని అజాగ్రత్తగా నిలిపివేసినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. ఈ క్రమంలో వెనుక నుంచి వస్తున్న హ్యుందాయ్ వెన్యూ కారు రోడ్డుపై నిలిపి ఉన్న వాహనాన్ని ఢీకొన్నట్లు సమాచారం. ఈ ప్రమాదంలో కారులో పక్క సీటులో ప్రయాణిస్తున్న పైడిపల్లి భోజన్న (49), మన్మాడ్ గ్రామం , లోకేశ్వరం మండలం, నిర్మల్ జిల్లా సంఘటన స్థలంలోనే మృతి చెందారు. కారు డ్రైవర్ గురువెల్లి గంగాధర్ తో పాటు వెనుక సీటులో ప్రయాణిస్తున్న మనోజ్ కు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసు అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలు , రహదారిపై వాహనం నిలిపిన విధానం, ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా శుక్రవారం నాడు నిజామాబాద్



పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐ.పి.యస్.సంఘటన స్థలాన్ని స్వయంగా పర్యవేక్షించి , ప్రమాదానికి సంబంధించిన వివరాలను పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు చేపట్టి , బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రహదారులపై వాహనాలను అజాగ్రత్తగా నిలిపివేయడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున , వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని , వాహనం అత్యవసర పరిస్థితుల్లో నిలిపివేయాల్సి వచ్చినప్పుడు తగిన హెచ్చరిక సూచనలు ఏర్పాటు చేయాలని పోలీసులు సూచించారు. ఈ సందర్భంగా డిచిపల్లి సి.ఐ శ్రీ వినోద్ , ఎస్.ఐ శ్రీ ఆరీఫ్ తదితరులు గలరు.

# కలెక్టరేట్ లో మట్టి గణపతుల పంపిణీ

నిజామాబాద్, సెప్టెంబర్ 11 :(విజన్ ఆంధ్ర )సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్) లో శుక్రవారం అదనపు కలెక్టర్ భుజంగరావు మట్టి గణపతులు పంపిణీ చేశారు. వినాయక చవితి వేడుకను పురస్కరించుకుని జిల్లా రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ ద్వారా కొనసాగుతున్న హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి గణపతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ కోసం మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేస్తుండడం ప్రశంసనీయమని ఫౌండేషన్ నిర్వాహకులను అభినందించారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలోనూ ప్రభుత్వపరంగా మట్టి గణపతులను ఉచితంగా పంపిణీ చేస్తున్నారని తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, ఇతర రసాయనిక



రంగులతో రూపొందించిన విగ్రహాల కారణంగా జల వనరులు కలుషితం అయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రజలందరూ మట్టి గణపతులను ప్రతిష్ఠించి, పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, డీఆర్ఓ గీత, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, బోధన్ ఆర్డీఓ విజయ కుమారి, రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ్ రెడ్డి, ప్రశాంత్, కలెక్టరేట్ డీ సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# భక్తి భావంతో ఉత్సవాలు నిర్వహించాలి

- ధన్ పాల్ లక్ష్మీ బాయి విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మండపాలకు సహకారం
- బారులు తీరిన నిర్వాహకులు



నిజామాబాద్ సెప్టెంబర్11:(విజన్ ఆంధ్ర ) నిజామాబాద్ నగరంలో వినాయక మండపాల నిర్వహకులు యువత ఉత్సవాలను భక్తి భావంతో నిర్వహించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. శ్రీ ధన్ పాల్ లక్ష్మీ బాయి విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని మార్వాడి గల్లి లో గల కార్యాలయంలో వినాయక ఉత్సవ నిర్వాహకులకు చెందాలను రాశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ఇందూరు యువత భక్తి మార్గంలో నడవాలని సూచించారు. వినాయక ఉత్సవాలను హిందూ సాంప్రదాయం ప్రకారం ఎటువంటి లోటుపాట్లకు తావు లేకుండా శాంతియుతంగా నిర్వహించాలని తెలిపారు. ప్రతి సంవత్సరం తమ ట్రస్టు ద్వారా సహకారం అందిస్తామని గత సంవత్సరం 725 మండపాలకు అందించినట్లు పేర్కొన్నారు. భగవంతుడి ఆశీర్వాదంతో ఈ ఏడాది కూడా వచ్చిన వారందరికీ తన వంతు సహకారం ఉంటుందన్నారు. వినాయకుడు కేవలం ఒక పండుగకు సంబంధించిన దేవుడు కాదని సంస్కృతి సనాతన ధర్మం ఐక్యతకు ప్రతీక అని చెప్పారు. వినాయకుడిని పూజిస్తే విఘ్నాలు తొలగి శుభాలు జరుగుతాయన్నారు. ఇంటింటా గణపతి పూజా చాలాకాలంగా ఉన్నప్పటికీ సామూహిక ఉత్సవాలకు బాలగంగాధర్ తిలక్ ప్రోత్సహించాడని గుర్తు చేశారు. దీనిద్వారా ప్రజలు ఒకచోట చేరి సామూహిక ఐక్యతను పెంపొందించుకొనే అవకాశం ఉంటుందన్నారు. శనివారం కూడా ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఉంటుందన్నారు. కార్యక్రమంలో బిజెపి కార్పొరేటర్ పాల్గొన్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.